




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY

నవతరం తెలుగు దినపత్రిక








Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

Navabhoomi daily fallows..

హైదరాబాద్ | 22 మంగళవారం | జులై 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 307

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


# 25 నుంచి రేషన్ కార్డులు

- ఆగస్టు 10 వరకు మండలాల వారీగా పంపిణీ
- జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు పాల్గొనాలి
- మనకు రైతులే ముఖ్యం.. వారికంటే ఎవరూ ఎక్కువకాదు
- అన్నదాతలకు నష్టం జరిగే పని ఎవరు చేసినా ఉపేక్షించం
- ఎరువుల లభ్యతను ఎప్పటికప్పుడు రైతులకు తెలపాలి
- కలెక్టర్లు ఉదయం 7 గంటలకే ఫీల్డ్‌లో ఉండాలి
- కలెక్టర్లకు అత్యవసర ఖర్చుల కింద వారి ఖాతాలో కోటి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

రాష్ట్రంలో రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 25 నుంచి ఆగస్టు 10 వరకు నిర్వహించనున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 15 రోజుల పాటు మండలాల వారీగా రేషన్‌కార్డుల పంపిణీ చేపట్టాలని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాలకు జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు. ప్రభుత్వానికి రైతులే ప్రాధాన్యమని, వారి కంటే ఎవరూ ఎక్కువ కాదని స్పష్టం చేశారు. అన్నదాతలకు కష్టం, నష్టం జరిగే పని ఎవరు చేసినా ఉపేక్షించేదని లేదని హెచ్చరించారు. పంటల సాగుకు తగ్గట్టుగా ఎరువులను అందుబాటులోకి తీసుకురావాలని, ఎరువుల లభ్యత వివరాలను ప్రజలకు తెలియజేసేలా ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎరువుల అంశంపై రైతులు ఫిర్యాదు చేసేందుకు వీలుగా టోల్ ఫ్రీ నంబరుతో బోర్డులను బస్‌స్టాపలు, జనం తిరిగే ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలన్నారు. వానాకాలం సన్నద్ధత, వ్యవసాయం, నీటి పారుదల, సీజనల్ వ్యాధులు, విపత్తు నిర్వహణ, రేషన్‌కార్డుల పంపిణీ అంశాలపై సోమవారం సాయంత్రం సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాల కలెక్టర్లు ఉదయం 7 గంటలకే ఫీల్డ్‌కు వెళ్లాలన్నారు. ఏ రోజు ఏ కలెక్టర్ ఏం చేస్తున్నారనే విషయాలను తనకు తెలియజేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యద ర్శి రామకృష్ణారావును ఆదేశించారు. వానాకాలం లో వరదలు, అంటువ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షంతో వచ్చే నీటిని ఒడిసిపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణ వివరాలను ప్రజలకు తెలియజేసేందుకు ప్రత్యేక వ్యవస్థను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. అవసరమైతే ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకుని, రాష్ట్ర స్థాయి అధికారులతో, వాతావరణ శాఖ అధికారులతో చర్చించాలని, కనీసం 3గంటల ముందుగా ప్రజలకు వాతావరణం, వర్షం వివరాలను తెలియజేయాలన్నారు. తద్వారా ఆస్తి, ప్రాణనష్టం జరగ కుండా చూసే అవకాశం ఉంటుందన్నారు.

**నిరంతర ప్రక్రియగా రేషన్‌కార్డులు..**

రాష్ట్రంలో అర్హులైన వారందరికీ ప్రభుత్వం

# తెలంగాణకు కేంద్రం ఊహించని వరం

- ఫ్యూచర్ సిటీకి కేంద్రం అంగీకారం
- ఫ్యూచర్ సిటీకి కేంద్రం నుంచి కీలక సూత్రప్రాయ అంగీకారం
- అమరావతిని కలుపుతున్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టు
- డ్రైపోర్ట్ నుండి మచిలీపట్నం వరకూ హైస్పీడ్ రైలు మార్గం ప్రతిపాదన
- తెలంగాణ-ఏపీ అభివృద్ధికి కేంద్రం నుంచి ఊహించని మద్దతు
- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ కీలక చర్చలు
- రహదారి మార్గం పరిశీలనకు ప్రైవేటు సంస్థకు బాధ్యత అప్పగింపు
- రెండు రాష్ట్రాల ఆర్థిక, ప్రాధాన్యతా భవిష్యత్తుకు గేమ్ ఛేంజర్ ప్రాజెక్టు

2




**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణకు కేంద్రం భారీ ప్రాజెక్టుకు దాదాపు ఆమోద ముద్ర వేసింది. కొంత కాలంగా కేంద్రంతో వరుస చర్చల్లో భాగంగా పలు ప్రతిపాదనలు సమర్పించారు. ఆమోద ముద్ర కోసం కీలక భేటీలు నిర్వహించారు. అందులో భాగంగా ఇప్పుడు తెలంగాణలో గేమ్ ఛేంజర్ గా కనిపిస్తున్న ప్రాజెక్టు పైన కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రాజెక్టు తెలంగాణతో పాటుగా ఏపీకి కీలకంగా మారనుంది. దీనికి సంబంధించి అధికారిక నిర్ణయం వెలువడనుంది. ముఖ్యమంత్రి రేవంత్ డ్రీమ్ ప్రాజెక్టు ఫ్యూచర్ సిటీకి సంబంధించి మరో అనుకూల పరిణామం చోటు చేసుకుంది. ఫ్యూచర్ సిటీ నిర్మాణంతో పాటుగా దీనిని ఏపీ రాజధాని అమరావతితో అనుసం ధానించే హైస్పీడ్ రైలు వ్యవహారం కొలిక్కి వచ్చింది. రాష్ట్ర విభజన చట్టంలో హైదరాబాద్ - విజయవాడ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ వే ( కొత్త అలైన్ మెంట్) నిర్మాణానికి హామీ ఉంది. ఈ క్రమంలో ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి వరకు గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ వేను, ఇదే ప్రాంతంలో నిర్మించాలని భావిస్తున్న డ్రైపోర్టు నుంచి మచిలీపట్నం పోర్టు వరకు కొత్త రైలు మార్గాన్ని మంజూరు చేయాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది. సంబంధిత టాపిక్‌లు తెలుగు చలనచిత్ర నటుల బయోగ్రఫీలు తెలుగు సంగీత సీడీలు హ్యాండ్‌లూమ్ దుస్తులు తెలుగు వేషధారణ తెలుగు భాషలో పాఠ్యపుస్తకాలు ఇక్కడ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ వేకు పక్కనే కొత్త రైలు మార్గాన్ని నిర్మిస్తే బాగుంటుందని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇక్కడ రైలు మార్గాన్ని హైస్పీడ్ కారిడార్ గా నిర్మించాలని.. అది రెండు తెలుగు రాష్ట్రాలకే కాకుండా.. ఇరుగు పొరుగు రాష్ట్రాలకు కూడా ఉపయుక్తమని భావిస్తోంది. సీఎం రేవంత్ ఇటీవల ఢిల్లీలో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో సమావేశమైన సమయంలో ఈ అంశాలకు కేంద్రం సూత్ర ప్రాయంగా అంగీకరించినట్లు తెలుస్తోంది. మరో వైపు ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతికి నిర్మించే రోడ్డు ఏపీ ప్రాంతాల మీదగా చేపట్టాలనే అంశాన్ని పరిశీలించే బాధ్యతను ఒక సంస్థకు అప్పగించింది. దీంతో.. ఈ ప్రాజెక్టు పైన కేంద్రం సానుకూల స్పందన.. వేగంగా చోటు చేసుకుంటున్న పరిణామాలు మొత్తంగా రెండు తెలుగు రాష్ట్రాలకు కీలకంగా మారనున్నాయి.

# భారత ఉపరాష్ట్రపతి రాజీనామా..!

- రాజీనామా లేఖను రాష్ట్రపతికి పంపించిన ధన్‌ఖడ్
- హఠాత్ నిర్ణయానికి అనారోగ్యమే కారణమా?
- రాజకీయ వర్గాల్లో కలకలం - విస్తృత చర్చలు
- ధన్‌ఖడ్ విధానశైలి, పార్లమెంటులో నిర్వాహకత
- తదుపరి ఉపరాష్ట్రపతి ఎవరు? వేచి చూడాల్సిందే



**న్యూఢిల్లీ-నవభూమి ప్రతినిధి**

దేశ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం (జులై 21, 2025) రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు తన రాజీనామా లేఖను పంపించారు. ఈ హఠాత్ నిర్ణయానికి అనారోగ్య సమస్యలే కారణమని ధన్‌ఖడ్ తన లేఖలో పేర్కొన్నారు. దేశ అత్యున్నత పదవులలో ఒకటైన ఉపరాష్ట్రపతి బాధ్యతల నుంచి ఆయన తప్పుకోవడం జాతీయ స్థాయిలో తీవ్ర చర్చకు దారి తీసింది. ఎటువంటి ముందస్తు సూచన లేకుండా తీసుకున్న ఈ నిర్ణయం రాజకీయ వర్గాలను, ప్రజలను ఆశ్చర్యపరిచింది. "హంస మహాపురుష రాజయోగంతో ఈ రాశులవారికి కుబేర యోగం" జగదీప్ ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి తనదైన శైలిలో వ్యవహరిస్తూ వచ్చారు. పార్లమెంటు ఉభయ సభల్లోనూ ఆయన సమర్థవంతంగా వ్యవహరించారు. ఈ పరిణామం దేశ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది ఇప్పుడు సర్వత్రా ఆసక్తిగా మారింది.ఇప్పుడు ఆయన రాజీనామాతో ఉపరాష్ట్రపతి పదవి ఖాళీ అయింది. తదుపరి ఉపరాష్ట్రపతి ఎవరు కాబోతున్నారో చూడాల్సి ఉంది.

# కేరళ మాజీ ముఖ్యమంత్రి, అచ్యుతానందన్ ఇకలేరు

- తిరువనంతపురంలో ఆసుపత్రిలో తుదిశ్వాస
- శతాధిక వయస్సులో జీవితాంతం ఉద్యమమే లక్ష్యంగా
- పునప్రా ఉద్యమంలో కీలక నేతగా అచ్యుతానందన్
- 2006-2011 మధ్య కాలంలో కేరళ ముఖ్యమంత్రిగా సేవలు
- ప్రజాస్వామ్యానికి నిబద్ధత గల మార్గదర్శి
- రాజకీయ నాయకులు, ప్రజల నుంచి ఘన నివాళి



**తిరువనంతపురం-నవభూమిబ్యూరో**

కేరళ మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్ట్ నేత వీఎస్ అచ్యుతానందన్ సోమవారం కన్నుమూశారు. ప్రస్తుతం ఆయన వయసు 101 ఏళ్ళు కాగా.. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జూన్ 23న గుండెపోటుకు గురికావడంతో చికిత్స కోసం ఆయనను కుటుంబసభ్యులు తిరువనంతపురం మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆయన ఐసీయూలోనే ఉన్నారు. వైద్యుల చికిత్స చేస్తున్నా.. రోజు రోజుకూ ఆయన ఆరోగ్యం క్షీణిస్తూ వచ్చింది. ఏడుగురు వైద్యుల బృందం ఆయనను నిరంతరం పర్యవేక్షించింది. అయితే, చివరకు పరిస్థితి విషమించి సోమవారం మధ్యాహ్నం అచ్యుతానందన్ తుదిశ్వాస విడిచారు. వీఎస్ అచ్యుతానందన్ 2006 నుంచి 2011 వరకూ కేరళ ముఖ్యమంత్రిగా పనిచేశారు. .కమ్యూనిస్టు ఉద్యమానికి జీవితం అంకితం చేసిన నేతగా, ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాట యోధునిగా గుర్తింపు పొందారు. 1923లో అలప్పూజ జిల్లా పునప్రాలోని ఒక సాధారణ వ్యవసాయ కూలీ కుటుంబంలో జన్మించిన అచ్యుతానందన్, బాల్యంలో కార్మిక హక్కుల కోసం పోరాడే కమ్యూనిస్ట్ ఉద్యమంలోకి ప్రవేశించారు. ట్రావెన్‌కోర్ దివాన్.. అమెరికన్ మోడల్ ప్రభుత్వ ఏర్పాటు ప్రయత్నాలకు వ్యతిరేకంగా జరిగిన పునప్రా-వేలయార్ ఉద్యమానికి అచ్యుతానందన్ నాయకత్వం వహించారు. 'కేరళ

# ఏపీలో మహిళలకు ఉచిత బస్సుపై కీలక అప్డేట్

- ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం
- మహిళలకు 'జీరో ఫేర్ టికెట్' ప్రారంభం
- టికెట్‌పై పూర్తి ప్రయాణ వివరాలు
- పథకంపై సీఎం సమీక్ష, ఆదేశాలు
- ఆర్టీసీకి భారం కాకుండా చూడాలి
- ఎలక్ట్రిక్ బస్సుల దిశగా ప్రణాళిక

2



**అమరావతి-నవభూమిబ్యూరో:**ఏపీలో మహిళలకు కూటమి సర్కార్ సూపర్ సిక్స్ హామీల అమల్లో భాగంగా మరో గుడ్ న్యూస్ చెప్పింది. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించబోతున్న ప్రభుత్వం.. దీనికి సంబంధించి మరిన్ని వివరాలను ప్రకటించింది. ఈ మేరకు సీఎం చంద్రబాబు అధికారులతో ఇవాళ సమీక్ష నిర్వహించి ఈ పథకం అమలుపై కీలక ఆదేశాలు జారీ చేశారు. %సాశ్రీంశీ =ఘుం% సాయిరెడ్డి మరో బిగ్ ట్విస్ట్..! కాంగ్రెస్ అధ్యక్షుడికి సంకేతం..! ఆగస్టు 15 నుంచి మహిళలకు అమలు చేయబోయే ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ పథకంలో భాగంగా మహిళలకు 'జీరో ఫేరో టిక్కెట్' ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఇవాళ అధికారులకు సూచించారు. ఎక్కడ నుంచి ఎక్కడకు ప్రయాణం చేస్తున్నారు, ఉచిత ప్రయాణంతో ఎంతమేర వారికి డబ్బులు ఆదా అయ్యాయి, 100 శాతం ప్రభుత్వం ఇస్తున్న రాయితీ వంటి వివరాలు ఆ టిక్కెట్‌లో ఉండాలని ఆదేశించారు. జీరో ఫేర్ టిక్కెట్ ఇవ్వడం ద్వారా ఎంత లబ్ధిపొందారనే విషయం రాష్ట్రంలోని మహిళా ప్రయాణికులు అందరికీ సులభంగా తెలుస్తుందన్నారు. పైన చెప్పిన

# ఏపీలో మున్సిపల్ శాఖ ఉద్యోగులకు ప్రభుత్వం గుడ్ న్యూస్..!

- మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాల్లో భారీ పెంపు
- జీవన వ్యయాల ఆధారంగా మూడు కేటగిరీలకు తాజా మార్పులు
- వేతన పెంపును అధికారికంగా ప్రకటించిన పురపాలక శాఖ
- కేటగిరీ-1 ఉద్యోగులకు రూ.3,000 మేర పెంపు
- ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగుల్లో హర్షాతిరేకం
- సేవల నాణ్యత పెరగనుందని విశ్లేషకుల అభిప్రాయం

2



**అమరావతి-నవభూమి ప్రతినిధి**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ నాన్-పీహెచ్ వర్కర్లకు తీపికబురు అందించింది. రాష్ట్ర ప్రభుత్వం వారు నెలలుగా ఎదురుచూస్తున్న వేతనాల పెంపును ఆమోదించింది. నూతన గడిచిన జీవన వ్యయాలను దృష్టిలో పెట్టుకుని తీసుకున్న ఈ నిర్ణయంతో వేలాది మంది కార్మికులు ఉపశమనం పొందనున్నారు. మూడు కేటగిరీల వేతనాల్లో పెంపు.. పురపాలక పట్టణాభివృద్ధి శాఖ తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. కేటగిరీ-1 వర్గంలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనం ప్రస్తుతం ఉన్న రూ.21,500 నుంచి రూ.24,500కి పెంచారు. కేటగిరీ-2 వేతనం రూ.18,500 నుంచి రూ.21,500కి కేటగిరీ-3 వేతనం రూ.15,000 నుంచి రూ.18,500కి పెంచుతూ ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ మేరకు పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్. సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ కమిషనర్ అండ్ డైరెక్టర్‌కు అందుకు సంబంధించిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. తాజా నిర్ణయాన్ని అనుసరించి అన్ని మున్సిపాలిటీలలో, పట్టణ స్థానిక సంస్థలలో వేతన మార్పులు అమలవుతాయని భావిస్తున్నారు.

# భారీ వర్షాలు



2

**అమరావతి/హైదరాబాద్-నవభూమిబ్యూరో**

రాష్ట్రంలో వర్షపాతం మెరుగుపడింది. ద్రోణి, ఉపరితల ఆవర్తన ప్రభావం, రుతుపవనాల కదలికతో గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో 14 జిల్లాల్లో వర్షపాతం సాధారణ స్థితికి వచ్చింది. అయితే, మరో 12 జిల్లాల్లో లోటు నెలకొందని వాతావరణ నిపుణులు తెలిపారు. విజయనగరం, అల్లూరి, విశాఖ, అనకాపల్లి, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వర్షపాతం సాధారణ స్థాయికి చేరగా, శ్రీకాకుళం, మన్యం, కోనసీమ, కాకినాడ, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, పల్నాడు, నెల్లూరు, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య జిల్లాల్లో వర్షపాతం సాధారణం కన్నా తక్కువగా ఉంది. రాష్ట్రంలో జూన్ 1 నుంచి ఈ నెల 21 వరకు 199.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 157.1 మిల్లీమీటర్లు నమోదైంది. మరోవైపు, గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్ పంటలు జీవం పోసుకున్నా యి. ఈ నెల 24న బంగాళాఖాతంలో అల్ప పీడనం ఏర్పడుతుందని వాతావరణ విభాగం ప్రకటించింది. కాగా సోమవారం కోస్తా జిల్లాల్లో అనేక చోట్ల వర్షాలు పడ్డాయి. అలాగే మంగళవారం అల్లూరి సీతారామరాజు, ఉభయగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో కొన్ని చోట్ల ఓ మోస్తరు నుంచి భారీవర్షాలు కురుస్తాయని, మిగతా జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

**24న అల్పపీడనం..**రాష్ట్రంలో మరో ఐదు రోజులపాటు వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు, దక్షిణ ఒడిసా పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో సోమవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు నర్సీపట్నంలో 114, మందసలో 88.75, గొలుగొండలో 88.25, ఇనుమెల్ల(పల్నాడు జిల్లా)లో 80, అనకాపల్లి జిల్లా గంధవరంలో

# రోజా అరెస్ట్ ఆ రోజునే .. ముహూర్తం ఫిక్స్

- వైసీపీ నేతలపై కేసుల పరంపర
- ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో నిధుల దుర్వినియోగం ఆరోపణలు
- సీఐడీకి క్రీడా సంఘాల ఫిర్యాదులు
- రోజా అరెస్టుకు రంగం సిద్ధం



2

**అమరావతి-నవభూమి ప్రతినిధి**

వైసీపీ నేతలు వరుస కేసులతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వైసీపీ నేతలపై వరుసగా కేసులు నమోదు అవుతున్నాయి. ఇప్పటికే కొడాలి నాని, వల్లభనేని వంశీ,నందిగం సురేష్ , పేర్ని నాని, మిథున్ రెడ్డి,జోగి రమేష్, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కాకాణి గోవర్ధన్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి మొదలగు వైసీపీ కీలక నేతలపై కేసులు నమోదు కాగ, వల్లభనేని వంశీ,పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కాకాణి గోవర్ధన్

# కూరగాయల వ్యాపారికి రూ.29 లక్షల జీఎస్టీ

- చిన్నపాటి కూరగాయల వ్యాపారి శంకర్‌గౌడ్ షాక్
- రైతులనుంచి కూరగాయలు కొని అమ్మితే జీఎస్టీలేదు
- మరి ఇంత మొత్తంలో జీఎస్టీ ఎలా వేశారు..
- ఖాతాలో రూ.1.63కోట్ల వరకు ఆర్థిక లావాదేవీలు

2



**బెంగళూరు-నవభూమిబ్యూరో:** కర్ణాటకలోని హావేరీలో చిన్నపాటి కూరగాయల దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్న ఓ వ్యక్తికి రూ.29 లక్షలు కట్టాలంటూ జీఎస్టీ నోటీస్ జారీఅయ్యింది. తనకు వచ్చిన ఆ నోటీస్ చూసి దుకాణందారు శంకరగౌడ షాక్‌కు గురయ్యాడు. ఇంతపెద్ద మొత్తంలో తనకు జీఎస్టీ నోటీసు రావటమేంటి?, దీనిని చెల్లించటం తనకు అసాధ్యమని వాపోయాడు.జీఎస్టీ నిబంధనల ప్రకారం, రైతుల నుంచి తాజా

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in




# రామయ్య భూముల్లో ప్రహరీ నిర్మాణం చేపడతాం




**భద్రాచలం-నవభూమి:** ఏపీలోని పురుషోత్తపట్నంలో ఉన్న భద్రాచల రామయ్యకు చెందిన భూములకు రక్షణగా భద్రాద్రి దేవస్థానం (శ్రీగోకులరామం చుట్టూ) నిర్మించతలపెట్టిన ప్రహరీ నిర్మాణానికి మరోసారి దేవస్థానం అధికారులు కసరత్తు చేపడుతున్నారు. ఇప్పటికే ప్రహరీ నిర్మాణానికి ఉన్నతాధికారుల నుంచి ఆమోద ముద్ర రాగా పనులు చేపట్టే క్రమంలో స్థానికులు అడ్డుకున్నారు. దాంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. సుమారు రూ.70లక్షలతో ప్రహరీ నిర్మాణం చేపట్టనుండగా దానికి సహకరించాలని కోరుతూ 2 రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులకు భద్రాద్రి దేవస్థానం అధికారులు లేఖ రాశారని తెలిసింది. ఇటీవల రామయ్య భూముల్లో అక్రమ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు వెళ్లిన దేవస్థానం ఈవో రమాదేవిపై, ఇతర సిబ్బందిపై ఆక్రమణదారులు దాడి చేయడం కలకలం రేపింది. ఈ నేపథ్యంలో భద్రాద్రి దేవస్థానం అధికారులు భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీకి, ఏపీలోని పోలీసు ఉన్నతాధికారులకు లేఖ రాసినట్టు సమాచారం.

## నవ వార్త



# పిడుగు పాటు మరణాలపై సీఎం రేవంత్ కీలక నిర్ణయం..



**హైదరాబాద్-నవభూమి:** వర్షాకాలంలో తలెత్తే అన్ని సమస్యలు మిగతా ఏ సీజన్లో రావు. వర్షాలు, వరదల వల్ల కరెంట్ కోతలు మొదలు.. తాగు నీరు, దోమలు, అంటువ్యాధులు, నగరాల్లో అయితే మురుగు నీరు సమస్య, ట్రాఫిక్ జామ్ వంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. వీటికి తోడు పిడుగులు. ప్రతి ఏటా వానాకాలంలో పిడుగుపాటు కారణంగా మనుషులు, పశు సంపద మృత్యువాత పడుతుంటాయి. ఇలాంటి సందర్భాల్లో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సాయం అందదు. అయితే ఇకపై ఇలా ఉండదు. పిడుగుపాటు వల్ల ఎవరైనా చనిపోతే.. వారికి ఆర్థిక సాయం అందించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం నాడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆ

రాష్ట్రంలో పిడుగుపాటు మరణాలకు ఆర్థిక సాయం అందించాలన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. అలానే హైదరాబాద్ నగరంలో వర్షం పడితే ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు, అంటువ్యాధులు, వైరల్ ఫీవర్లు, పంటల సాగు, ఎరువులు, రేషన్ కార్డుల పంపిణీ వంటి అంశాలపై సమీక్షించారు. సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్ని ఆసుపత్రుల్లో వైరల్ ఫీవర్స్ మందులు అందుబాటులో ఉండాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులను కలెక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం రేవంత్ తెలిపారు. హైదరాబాద్లో వర్షాలు ఎక్కువగా పడితే అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీరు నిలిచే ప్రాంతాలను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. వర్షాలకు సంబంధించిన సమాచారం ముందుగానే తెలుసుకొని అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ట్రై సిటీ కమిషనర్లతో హైదరాబాద్ కలెక్టర్ సమన్వయం చేసుకోవాలని సీఎం రేవంత్ సూచించారు. భారీ వర్షాలు పడినప్పుడు సిటీ కమిషనర్లు కూడా గ్రౌండ్ స్థాయిలో పర్యవేక్షించాలని చెప్పారు.జిల్లాల్లో పిడుగుపాటు మరణాలు ఎక్కువగా ఉన్నాయని ఈ సందర్భంగా అధికారులు సీఎంకు తెలిపారు. పిడుగులకు సంబంధించిన ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సీఎం సూచించారు. పిడుగుపాటు మరణాలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిధిలోని ఐఏఎస్ అధికారులు గ్రౌండ్లో పని చేయాలని స్పష్టం చేశారు. కలెక్టర్ల కార్యచరణ రిపోర్టును ప్రతి రోజు తనకు పంపాలని ఆదేశించారు.ఇదిలా ఉంటే గత కొన్ని రోజులుగా తెలంగాణ వ్యాప్తంగా.. మరీ ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో భారీ వర్షాలు కురుస్తున్న సంగతి తెలిసిందే. భాగ్యనగరంలో వర్షం బీభత్సం సృష్టించింది. అయితే రానున్న ఐదు రోజులు తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. దీనిలో భాగంగా ఇవాళ జులై 21న భారీ వర్షాలు.. 22, 23 న భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

# ఎనీ టైం.. డ్రంక్ అండ్ డ్రైవ్!



**హైదరాబాద్-నవభూమి :** మందుబాబులూ .. బీ కేర్ ఫుల్.. ఇకపై ఎనీ టైమ్ ఎనీ సెంటర్ తనిఖీలు తప్పవు. వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో హైదరాబాద్ సిటీ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. పాఠశాలలకు పిల్లలను తీసుకెళ్లే బస్సు, వ్యాను, ఆటో డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు ట్రాఫిక్ తనిఖీల్లో గుర్తించారు. దీంతో పగటిపూట కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాలని పోలీసులు డిసైడయ్యారు. స్కూల్ పిల్లలను తీసుకెళ్లే వాహనాలను తనిఖీ చేసే క్రమంలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల్లో నెలరోజుల్లో 35 మంది డ్రైవర్లను గుర్తించారు.

# బైక్‌ను ఢీకొన్న కారు.. డ్యాంలో పడ్డ యువకుడు



**ధరూరు:నవభూమి:** గద్వాల జిల్లాలోని ధరూరు మండలం రేవులపల్లి వద్దగల జూరాల ప్రాజెక్టుపై ఆదివారం రాత్రి ఘోర ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనంపై వెళుతున్న యువకులపైకి కారు దూసుకురావడంతో ఇద్దరిలో ఓ యువకుడు ఎగిరి డ్యాంలో పడి గల్లంతయ్యాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. జిల్లాలోని మానవపాడు మండలం ఏ-బూదిపాడు గ్రామానికి చెందిన మహేశ్ (25), సతీశ్, వీరేశ్‌తో పాటు తిమ్మాపుట్టిపల్లి చెందిన జానకిరాములు స్నేహితులు. ఆదివారం కావడంతో సరదాగా జూరాల జలాశయం చూసేందుకు రెండు బైక్ల మీద వచ్చారు. రాత్రి 7.30కు గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఓ బైక్‌ను జానకిరాములు నడుపుతుండగా మహేశ్ వెనుక కూర్చున్నాడు. మరో ఇద్దరు స్నేహితులు వెనకాలే మరో బైక్‌పై వారిని అనుసరిస్తున్నారు.ఆ సమయంలో ప్రాజెక్టు 48వ గేటు వద్ద ఎదురుగా వస్తున్న కారు జానకిరాములు, మహేశ్ ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో మహేశ్ బైక్ పైనుంచి ఎగిరి డ్యాంలో పడిపోయాడు. జానకిరాములుకు తీవ్రగాయాలయ్యాయి. వెనుక వస్తున్న మరో ఇద్దరు యువకులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. వారు ధరూర్ పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి ఎస్సై కొండా శ్రీహరికి సమాచారమిచ్చారు. హుటాహుటిన ప్రాజెక్టు వద్దకు చేరుకున్న పోలీసులు గాయపడిన జానకిరాములును ఆస్పత్రికి తరలించారు. ఆదివారం రాత్రి వరకు మహేశ్ ఆచూకీ లభ్యంకాలేదు. సోమవారం ఉదయం డ్యాంలో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు ఆచూకీ లభ్యం కాలేదని ఎస్సై తెలిపారు. కారు డ్రైవర్ సెల్ఫోన్‌లో మాట్లాడుతూ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతోనే ప్రమాదం జరిగినట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# బీసీ రిజర్వేషన్ల అమలు సాధ్యమేనా.. సుప్రీంకోర్టు ఏం చెప్పింది?




**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్లపై వాడీవేడీగా చర్చ జరుగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలను సెంప్టెంబర్ 30 లోపు పూర్తి చేయాలని రాష్ట్ర ఎలక్షన్ కమిషన్‌కు.. హైకోర్టు గడువు విధించడంతో ప్రభుత్వం ఆ దిశగా కసరత్తు వేగవంతం చేసింది. అందులో భాగంగా డ్రాఫ్ట్ ఆర్డినెన్స్‌ను గవర్నర్ వద్దకు పంపించింది. దీనిపై గవర్నర్ న్యాయ సలహా కోరారు. ఓ పక్క ఈ విషయంలో న్యాయ పరమైన చిక్కులు ఎదుర్కొనేందుకు కూడా ప్రభుత్వం సిద్ధమవుతున్న తరుణంలో.. గతంలో కేసీఆర్ చేసిందే జరుగుతుందా? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

బీసీ రిజర్వేషన్ల బిల్లులపై తాజాగా కేంద్రం.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి క్లారిటీ కోరినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ సర్కార్ కూడా పూర్తి వివరాలతో జవాబు ఇచ్చేందుకు సిద్ధమవుతోందని సమాచారం. తెలంగాణ ఇచ్చిన సమాచారంతో కేంద్రం సంతృప్తి చెందితే.. తదుపరి పరిశీలన కోసం కేంద్ర న్యాయ శాఖకు పంపే అవకాశం ఉంది. అయితే, ఈ బిల్లులో ముస్లింలకు సంబంధించిన రిజర్వేషన్‌లు కూడా ఉన్నాయి. దీన్ని బీజేపీ గట్టిగా వ్యతిరేకిస్తోంది. ఇన్ని చిక్కులున్నా.. తెలంగాణ ప్రభుత్వం రిజర్వేషన్లను అమలు చేస్తామని ఎలా చెబుతోంది? న్యాయ పరమైన సమస్యలు ఏమిటి? గతంలో కేసీఆర్ చేసినట్లే జరుగుతుందా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లులు**

తెలంగాణలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ గతంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన రెండు బిల్లులను గవర్నర్‌కు పంపగా.. ఆయన వాటిని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపించారు. దాదాపు మూడు నెలలుగా బిల్లులు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఇక స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు గడువు విధించిన నేపథ్యంలో.. రిజర్వేషన్లను అమలు చేసేందుకు ఆర్డినెన్స్ తెచ్చింది తెలంగాణ ప్రభుత్వం. అది కూడా గవర్నర్‌కు పంపింది. ఒకే విషయంపై బిల్లు పెండింగ్‌లో ఉండగానే ఆర్డినెన్స్ తెచ్చింది.

**రాజ్‌భవన్‌కు ఆర్డినెన్స్..**

ప్రస్తుతం బీసీ రిజర్వేషన్ ఆర్డినెన్స్ గవర్నర్ వద్ద ఉంది. దీనిపై గవర్నర్ న్యాయ సలహా కోరారు. ఈ ఆర్డినెన్స్‌లో.. పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ముఖ్యంగా పంచాయతీరాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 285 క్లాజ్-ఏ సవరించాల్సిందిగా పేర్కొంది. ఈ సెక్షన్‌లో లోకల్ బాడీ ఎలక్షన్స్‌లో 50 శాతానికి మించకుండా రిజర్వేషన్లు అమలవుతాయని ఉంది. ఈ వాక్యాన్ని తొలగించాలని ప్రభుత్వం కోరుతోంది.

**2018లో కేసీఆర్ ఏం చేశారు?**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఉండేది. దాన్ని 2019 ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం 23 శాతానికి తగ్గిస్తూ పంచాయతీ రాజ్ (ఆర్డినెన్స్) చట్టం, 2018 తీసుకువచ్చింది. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం.. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి దాటొద్దు. అందుకే తాము ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని అప్పటి కేసీఆర్ ప్రభుత్వం తమ నిర్ణయాన్ని సమర్థించుకుంది. న్యాయ పరమైన చిక్కులు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించింది. అయితే, అప్పుడు ఈ నిర్ణయంపై బీసీ సంఘాలు, ప్రతిపక్ష పార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అయితే దీనిపై అప్పట్లో అసెంబ్లీలో కేసీఆర్ వివరణ ఇచ్చారు.

**సుప్రీం కోర్టు తీర్పుతో చిక్కు..!**

అయితే, పలు నివేదికల ప్రకారం.. ఎస్సీలకు 15%, ఎస్టీలకు 10%, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే.. అది మొత్తంగా 67% అవుతుంది. అంటే సుప్రీం కోర్టు విధించిన 50% సీలింగ్‌ను ఉల్లంఘించినట్లు అవుతుంది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఎదుర్కొన్న సమస్యనే ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్‌కు ఎదురైంది.

ఇదిలా ఉండగా.. 1992లో ఇంద్ర సాహ్నీ కేసులో (%మీఖఅఋశ్రీ జశీఎఎఱంంఱశీఅ ఝంవ%) సుప్రీం కోర్టు చారిత్రక తీర్పు ఇచ్చింది. ఉద్యోగాలు, విద్యా సంస్థలు, రాజకీయ ప్రాతినిధ్యంలో 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఉండకూడదని తేల్చి చెప్పింది. అయితే, కొన్ని ప్రత్యేక, అసాధారణ పరిస్థితుల్లో 50 శాతానికి మించి రిజర్వేషన్లు కల్పించొచ్చని వెల్లడించింది.

సుప్రీం తీర్పు ఉన్నా.. తెలంగాణ ఎలా రిజర్వేషన్ కల్పిస్తామంటోంది?

42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం తమిళనాడు ప్రభుత్వాన్ని ఉదాహరణగా చూపిస్తోంది. తమిళనాడులో బీసీలకు 50 శాతంతో కలిపి (బ్యాక్‌వార్డ్ క్లాస్ (బీసీ 26.5% = బీసీ ముస్లిం 3.5%) 30% ం మోస్ట్ బ్యాక్‌వార్డ్ కమ్యూనిటీలు (20%) =% 50% ) మొత్తంగా 69 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి.

రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో ఉన్న రాష్ట్రాలకు ఈ అవకాశం ఉంటుంది. తొమ్మిదో షెడ్యూల్‌లో ఉంటే.. చట్టాలకు న్యాయ సమీక్షల (ప్రాథమిక హక్కులు ఉల్లంఘించడం లాంటి విషయాలపై) నుంచి ఉపశమనం లభిస్తుంది. అందుకే తొమ్మిదో షెడ్యూల్‌లో తెలంగాణను కూడా చేర్చాలని ప్రభుత్వం అంటోంది. ఇటీవల చేసిన కులగణన ఆధారంగా.. తెలంగాణలో బీసీల సంఖ్య 56.33 శాతం ఉందని ప్రభుత్వం చెబుతోంది.

అయితే, 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇవ్వాలంటే.. సుప్రీం కోర్టుకు అనుభావిక డేటా సమర్పించాల్సి ఉంటుంది. కేవలం థియరీ మాత్రమే కాకుండా.. ప్రత్యేకమైన, అసాధారణ పరిస్థితులు ఎలా ఉన్నాయో, ఎందుకు రిజర్వేషన్లు పెంచాలో చెప్పాల్సి ఉంటుంది. అందుకే కులగణన ద్వారా సేకరించిన అనుభావిక డేటాను.. తమ నిర్ణయానికి ఆధారంగా చూపించాలని భావిస్తోంది తెలంగాణ ప్రభుత్వం. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు.. తెలంగాణ జనాభా, సాంఘిక, ఆర్థిక, రాజకీయ వెనుకబాటుతనాన్ని ప్రతిబింబించడం లేదని వాదిస్తోంది.

గత అనుభవాలు.. సుప్రీంలో తెలంగాణ చుక్కెదురు?

**బిహార్‌కు భంగపాటు..**

బీసీ రిజర్వేషన్ విషయంలో కూడా తెలంగాణ ప్రభుత్వానికి చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 2023లో బిహార్ కులగణన చేసింది. 2023లో అక్టోబర్‌లో విడుదల చేసిన నివేదిక ప్రకారం.. రాష్ట్ర జనాభాలో ఎక్కువ భాగం బీసీలు ఉన్నారని తేలింది. అనంతరం బీసీలకు రిజర్వేషన్‌ను పెంచింది. దీంతో మొత్తం రిజర్వేషన్లు 65 శాతానికి చేరాయి. దీన్ని వ్యతిరేకిస్తూ పాట్నా హైకోర్టులో పిటిషన్లు దాఖలు కాగా.. 20 జూన్ 2024న పాట్నా హైకోర్టు దీన్ని కొట్టివేసింది. ప్రస్తుతం ఈ కేసు సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉంది.

**ఆంధ్రప్రదేశ్‌లోనూ..**

ఇక ఆంధ్రప్రదేశ్‌లో 2019లో జగన్ సీఎం అయ్యాక.. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లతో పాటు మొత్తం 58.95 శాతం రిజర్వేషన్లతో అన్ని రకాల స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించారు. ఆ తర్వాత దీనిపై సూప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలవ్వగా.. ఈ నిర్ణయాన్ని అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ఫలితంగా.. జిల్లా పరిషత్ చైర్మన్, మండలాధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు సహా దాదాపు 15 వేలకు పైగా పదవులు కోల్పోవాల్సి వచ్చింది. రాజ్యాంగం ప్రకారం ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లలో మార్పులు చేయకూడదు. కాబట్టి బీసీ రిజర్వేషన్లను తగ్గించాల్సి వచ్చింది. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వానికి కూడా అలాంటి పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉంది.

**కేంద్రం చేతిలో బంతి!**

ఇప్పుడు బంతి కేంద్రం చేతిలో ఉంది. బిల్లులను ఆమోదించి.. తెలంగాణను తొమ్మిదో షెడ్యూల్లో చేరిస్తే.. రిజర్వేషన్లు అమలు అవుతాయి. అందుకోసం పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుంది. ఇది కేంద్రం పరిధిలోనే ఉంది. ఇక తన వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం తెలపడం కూడా ముఖ్యమే. అంతేకాకుండా హైకోర్టులు, సుప్రీం కోర్టులో కేసులు దాఖలైనా.. తెలంగాణ కుల గణన వివరాలను సమర్పించి గట్టిగా వాదించేందుకు సిద్ధమైంది. అయితే ఇలా కేసులు దాఖలైతే.. కేంద్రం కూడా అందులో పార్టీ (ప్రతివాది) కావచ్చు. తన అభిప్రాయాలు తెలపొచ్చు. అఫిడవిట్ దాఖలు చేయొచ్చు.

న్యాయపరమైన చిక్కులు, కుల గణన కచ్చితత్వంపై అనుమానాలు, బిల్లులు రాష్ట్రపతి వద్ద పెండింగ్, కేంద్రం తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చడంపై సందిగ్ధత తదితర అంశాల నేపథ్యంలో బీసీ రిజర్వేషన్లపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇలాంటి పరిస్థితిల్లోనూ.. కేంద్రం బీసీ రిజర్వేషన్ బిల్లులకు ఆమోదం ఇచ్చే అవకాశం ఉందని, ఇది తెలంగాణకు సానుకూల అంశం అని న్యాయ నిపుణులు అంటున్నారు.

బీసీ రిజర్వేషన్లలో ముస్లింల చేర్చడాన్ని బీజేపీ వ్యతిరేకిస్తున్న.. దీనిపై కేంద్రం స్పష్టత కోరకపోవడం గమనార్హం. దీన్ని బట్టి కేంద్రం కూడా ఈ విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సానుకూలంగానే ఉందని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో బీసీ రిజర్వేన్ల బిల్లు అమలవుతుందా? భవిష్యత్తులో ఈ అంశం ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి.

# కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో మల్లారెడ్డి కోడలు భేటీ..



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉండే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు భేటీ కావడం తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఇంతకు ఈ ఆసక్తికర భేటీ ఎవరి మధ్య జరిగిందంటే.. బీజేపీ కేంద్రమంత్రి బండి సంజయ్‌తో బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి భేటీ అయ్యారు. ప్రస్తుతం వీరి భేటీకి సంబంధించిన ఫొటోలు, వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతోంది. మరి ఇంతకు వీరిద్దరూ ఎందుకు భేటీ అయ్యారు.. దీని వెనక ఏవైనా రాజకీయ కారాణాలున్నాయా.. లేదా వేరే ఇతర కారణ్షాలా అని జనాలు చర్చించుకుంటున్నారు.

నేడు అనగా సోమవారం నాడు.. మేకలమండి బీజేపీ నాయకుడి ఇంట్లో నిర్వహించిన లంచ్ కార్యక్రమానికి బీజేపీ కేంద్రమంత్రి బండి సంజయ్ హాజరయ్యారు. ఇక ఇదే కార్యక్రమానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి కూడా వచ్చారు. వీరిద్దరూ ఒకే టేబుల్ మీద భోజనానికి కూర్చున్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ తమతో పాటు కూర్చున్న వ్యక్తులను ప్రీతి రెడ్డికి పరిచయం చేయగా.. ఆమె మర్యాదపూర్వకంగా వారికి నమస్కారం చేశారు. ఆతర్వాత ప్రీతిరెడ్డి, బండి సంజయ్‌లు సరదాగా మాట్లాడుకున్నారు.

బండి సంజయ్, ప్రీతిరెడ్డిలు భేటీ అయిన వీడియో , ఫొటో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. ఈ భేటీ హాట్ టాపిక్‌గా మారింది. ఇదిలా ఉంటే ప్రస్తుతం ప్రీతిరెడ్డి బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నారు. ఇదిలా ఉంటే.. నిన్న పాతబస్తీలో జరిగిన బోనాల వేడుకల్లో బండి సంజయ్, ప్రీతిరెడ్డి ఫొటోలు కలిపి ఉన్న ఫ్లెక్సీలు వెలిశాయి. ఆతర్వాత మరుసటి రోజే అనగా సోమవారం నాడే వీరు ఇరువురు ఇలా భేటీ కావడం సంచలనంగా మారింది. అయితే వీరి సన్నిహితులు మాత్రం దీనిలో రాజకీయ అంశాలు ఏం లేవని.. సాధారణంగానే కలిశారని.. ఇద్దరూ ఒకే కార్యక్రమానికి హాజరు కావడంతో.. పలకరించుకున్నారని అంటున్నారు.

ఇదిలా ఉంటే ప్రీతిరెడ్డి మెట్టినిల్లు అయిన మల్లారెడ్డి కుటుంబం అంతా రాజకీయాల్లో ఉన్నప్పటికీ ఆమె మాత్రం పాలిటిక్స్ మీద పెద్దగా ఆసక్తి చూపరు. ఆమె డాక్టర్. ఇక ప్రీతి రెడ్డి విషయానికి వస్తే.. ఆమె స్వస్థలం కర్నాటకలోని హుబ్లి. అమ్మ సైంటిస్ట్, నాన్న డాక్టర్. ఇద్దరికీ పూనాలో ఉద్యోగం చేసేవారు. తల్లి వల్ల ప్రీతి రెడ్డి భరతనాట్యం కూడా నేర్చుకున్నారు. అలానే తల్లిదండ్రుల కోరిక మేరకు డాక్టర్ అయ్యారు. ప్రస్తుతం ఆమె మల్లారెడ్డి గ్రూప్ విద్యాసంస్థల డైరెక్టర్‌గా ఉన్నారు.

మల్లారెడ్డి ఆస్పత్రుల్లో ఉచితంగా డెలివరీ చేసి, కిట్ అందిస్తున్నారు. ఆడపిల్లను కన్న తల్లికి ప్రోత్సాహకం ఇస్తున్నారు. అలానే డెంటల్ హాస్పిటల్‌లో రోజుకు 250 మందికి ఉచిత వైద్యంతోపాటు 750 బెడ్‌లున్న టీచింగ్ ఆస్పత్రుల్లో కూడా ఫ్రీగా వైద్యం చేస్తారు. ఈ నిర్ణయాల వెనక ప్రీతి రెడ్డి ఉన్నారు. ఇక అత్తింటి వారు తనను సొంత కుమార్తెలా చూసుకుంటారని.. వారి ప్రోత్సాహం వల్లే తాను కెరీర్‌లో ముందుకు సాగుతున్నాని ప్రీతి రెడ్డి అనేక సందర్భాల్లో చెప్పుకొచ్చారు.

# డయాలసిస్ రోగులకు ప్రభుత్వం చేయూత

**హైదరాబాద్-నవభూమి:** రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 681 మంది డయాలసిస్ రోగులకు పెన్షన్ల మంజూరుకు మంత్రి సీతక్క ఆమోదం తెలిపారు. వీరిలో 629 మంది రోగులు హైదరాబాద్‌లో చికిత్స పొందుతుండగా.. మిగిలిన 52 మంది రోగులు ఇతర జిల్లాల్లో చికిత్స పొందుతున్నారు. వచ్చే ఆగస్టు నుంచి పెన్షన్ డబ్బులు వారి ఖాతాల్లో జమకానున్నాయి. తాజా నిర్ణయంతో ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం పొందుతున్న డయాలసిస్ రోగుల సంఖ్య 4,029కి చేరింది. ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ద్వారా వివిధ ఆసుపత్రుల్లో చికిత్సపొందుతున్న డయాలసిస్ రోగులను ప్రభుత్వం గుర్తిస్తోంది. సెర్ప్ ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేసి పెన్షన్లను మంజూరు చేస్తోంది.

# భారీ వర్షాలు

**(1వపేజీ తరువాయి)**78, పరవాడలో 71, ఏలూరు జిల్లా టి.నరసాపురంలో 67.75 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దక్షిణ కోస్తా తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని వాతావరణశాఖ హెచ్చరించింది. కాగా, ఈ నెల 24న ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది.

**స్వల్పంగా పెరిగిన గోదావరి**
**పోలవరం నుంచి నీటి విడుదల**

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ఏలూరు జిల్లా పోలవరంలో గోదావరికి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో సోమవారం సాయంత్రానికి నీటి మట్టం స్వల్పంగా పెరిగింది. ప్రాజెక్టులోకి వస్తున్న 1,09,622 క్యూసెక్కుల వరదను స్పిల్‌వే 48 గేట్ల నుంచి దిగువకు విడుదల చేస్తున్నట్టు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. స్పిల్‌వే ఎగువన 27.190 మీటర్లు, దిగువన 17.170 మీటర్ల మేర నీటిమట్టం నమోదైనట్టు పేర్కొన్నారు.

# కేరళ మాజీ ముఖ్యమంత్రి, అచ్యుతానందన్ ఇకలేరు

**(1వపేజీ తరువాయి)**అక్టోబర్ విప్లవం'గా గుర్తింపు పొందిన ఈ ఉద్యమంలో అచ్యుతానందన్ క్షేత్రస్థాయిలో పనిచేస్తూ ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు.దీంతో ఆయనను అరెస్ట్ చేసిన పోలీసులు.. కస్టడీలో చిత్రహింసలకు గురిచేశారు. ఈ సంఘటన అచ్యుతానందన్ జీవితాన్ని మలుపు తిప్పింది. 1964లో భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కౌన్సిల్ నుంచి నిష్క్రమించారు. అనంతరం కొత్తగా ఏర్పడిన మార్క్సిస్టు పార్టీ కు సహ-వ్యవస్థాపకుడిగా వ్యవహరించారు. అసమానంగా సాగిన ఆయన రాజకీయ జీవితంలో పార్టీ కార్యదర్శిగా, విపక్ష నేతగా, అనంతరం కేరళ ముఖ్యమంత్రిగా సేవలందించారు.అచ్యుతానందన్ మృతిపై రాజకీయ నేతలు, ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు. 'అచ్యుతానందన్ కేవలం రాజకీయ నేతే కాదు, ప్రజాస్వామ్యం పట్ల అపార నిబద్ధత కలిగిన మార్గదర్శకుడు' అని కొనియాడుతున్నారు.

# ఏపీలో మహిళలకు ఉచిత బస్సుపై కీలక అప్డేట్

**(1వపేజీ తరువాయి)**వివరాలన్నీ టికెట్ పై వచ్చేలా కొత్తగా సాఫ్ట్‌వేర్ సిద్ధం చేయాలని సీఎం అధికారుల్ని దేశించారు. ఇవాళ సచివాలయంలో మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ పథకంపై అధికారులతో సీఎం సమీక్షించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో ఏ ఏ రాష్ట్రాలకు ఆర్థికంగా ఎంత భారం పడింది, మన రాష్ట్రంలో ఎంత వ్యయం కానుందనే అంశాలపై అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. ఎట్టిపరిస్థితుల్లో పథకాన్ని ఆగస్ట్ 15 నుంచి సమర్థవంతంగా అమలు చేయాలని వారిని కోరారు. మరోవైపు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం త్వరలో అమలు చేస్తున్నందున ఆర్టీసీకి భారం కాకుండా చూడాలని కూడా ఆదేశించారు. ఇతర ఆదాయ మార్గాలు పెంపొందించుకోవడం, నిర్వహణా వ్యయం తగ్గించుకోవడం ద్వారా సంస్థను లాభాల బాట పట్టించాలన్నారు. లాభాల ఆర్జనకు ఎలాంటి మార్గాలున్నాయి, ఎటువంటి విధానాలు తీసుకురావాలనే దానిపై కార్యాచరణ రూపొందించాలన్నారు. మరోవైపు రాష్ట్రంలో ఇకపై ఏసీ ఎలక్ట్రానిక్ బస్సులు మాత్రమే కొనుగోలు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి నిర్దేశించారు. ప్రస్తుతం ఉన్నవాటిని ఎలక్ట్రికల్ బస్సులుగా మారిస్తే నిర్వహణా వ్యయం తగ్గుతుందని... అలాగే ఇందుకు అవసరమయ్యే విద్యుత్‌ను సొంతంగా ఉత్పత్తి చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ డిపోల్లోనూ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసే అంశంపైనా అధ్యయనం చేయాలని సీఎం స్పష్టం చేశారు.

# ఏపీలో మున్సిపల్ శాఖ ఉద్యోగులకు ప్రభుత్వం గుడ్ న్యూస్..!

**(1వపేజీ తరువాయి)**వారిని రాజకీయాల నుంచి ఊడ్చేయాలి - ఏపీ సీఎం " ఈ నిర్ణయం పట్ల మున్సిపల్ శాఖలో పని చేస్తున్న వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఉద్యోగుల మనోధైర్యాన్ని పెంపొందిస్తుందని, సేవల నాణ్యతను మెరుగుపరుస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# రోజా అరెస్ట్ ఆ రోజునే .. ముహూర్తం ఫిక్స్



**(1వపేజీ తరువాయి)**రెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి,నందిగం సురేష్‌లను అరెస్ట్ చేయడం కూడా జరిగింది. రెండు రోజుల క్రితమే ఎంపీ మిథున్ రెడ్డి సైతం జైలుకు వెళ్లారు. ఇప్పుడు ఈ లిస్ట్‌లో వైసీపీ ఫైర్ బ్రాండ్, మాజీ మంత్రి రోజా పేరు కూడా వినిపిస్తోంది. రోజా మంత్రిగా ఉన్న సమయంలో అవినీతి చేశారని ఫిర్యాదులు అందడంతో ఆమెపై చర్యలు తీసుకోవాలని కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారు.రోజా మంత్రిగా ఉన్న సమయంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర, సీఎం కప్, ఇతర క్రీడా కార్యక్రమాల్లో నిధుల గోల్‌మాల్‌పై చంద్రబాబు ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. దీనిలో భాగంగానే సీఐడీకి వివిధ క్రీడా సంఘాలు, సీనియర్ క్రీడాకారులు చేసిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడానికి రంగం సిద్ధమైంది. ఆటలకు సంబంధించిన నిధులు దుర్వినియోగం చేశారని ఆట్యాపాట్య సంస్థ సీఈవో ప్రసాద్ సీఐడీకి ఫిర్యాదు చేశారు. అప్పటి క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా, ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ అప్పటి అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మాన కృష్ణ దాస్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన సీఐడీ..ఈ ఫిర్యాదుపై తదుపరి చర్యలు తీసుకోవాలని విజయవాడ నగర పోలీస్ కమిషనర్‌ను ఆదేశించారు. ఇదే జరిగితే.. రోజా, కృష్ణదాస్‌లు విచారణకు సిద్ధం కావాల్సి ఉంటుంది. ఆడుదాం ఆంధ్ర వ్యవహారంపై విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రస్తుత క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై ఏపీ శాప్ చైర్మన్ రవి నాయుడు స్పందించారు. మాజీ మంత్రి ఆర్కే రోజా అరెస్టుకు వారెంట్ సిద్ధమవుతోందని శాప్ ఛైర్మన్ రవినాయుడు అన్నారు. ఆగస్టు 10లోగా ఆమె జైలుకెళ్లక తప్పదని ఆయన పేర్కొన్నారు. 'గతంలో స్పోర్ట్స్ మినిస్టర్‌గా రోజా చేసిన అవినీతి బయటపడుతోంది. 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంతో ఆమె కోట్లు దోచేశారు. దీనిపై విచారణ జరుగుతోంది. రోజా రోజులు లెక్క పెట్టుకోవాలి. ఆమె జైలుకెళ్లడం ఖాయం' అని శాప్ ఛైర్మన్ వ్యాఖ్యానించారు. తనని అరెస్ట్ చేస్తారని కూటమి నేతల చేస్తోన్న ప్రచారంపై రోజా ఎలా స్పందిస్తారో చూడాలి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3
హైదరాబాద్
మంగళవారం
22 । జులై । 2025

## బ్రిడ్జిపై రైలు వెళ్తుండగా కూలిన బేస్ భాగం.. తప్పిన పెను ప్రమాదం



**సిమ్లా-నవభూమి:** హిల్ స్టేట్ హిమాచల్ ప్రదేశ్ లో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. ఈ వర్షాలకు ప్రధాన నదులకు వరద పోటెత్తుతోంది. పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడుతున్నాయి. తాజాగా భారీ వర్షాల కారణంగా హిమాచల్‌లో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. కాంగ్రా లోని ధంగులో చక్కి నది పై ఉన్న రైల్వే వంతెన బేస్ ఒక్కసారిగా కూలిపోయింది . బ్రిడ్జిపై ఓ రైలు ప్రయాణిస్తున్న సమయంలోనే ఈ ఘటన చోటు చేసుకుంది. పఠాన్‌కోట్ మీదుగా ఢిల్లీ-జమ్ము మార్గంలో చక్కి నదిపై ఈ వంతెనను నిర్మించారు. అయితే భారీ వర్షాల కారణంగా నదికి వరద పోటెత్తింది. బ్రిడ్జి కింద ఉన్న పునాది భాగం ఒక్కసారిగా కూలిపోయింది. వందలాది ప్రయాణికులతో ఓ రైలు బ్రిడ్జిపై ప్రయాణిస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే, అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. దీంతో పెను ప్రమాదం తప్పినట్లైంది. ఈ ఘటనతో ఆ మార్గంలో రాకపోకలను అధికారులు నిలిపివేశారు. బ్రిడ్జి కింద బేస్ కూలుతున్న దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.

# యూఏఈలో వరకట్న వేధింపులు



**షార్జా-నవభూమి:** విదేశాల్లోనూ వరకట్న వేధింపులు ఆందోళనకు గురిచేస్తున్నాయి. తాజాగా, భారత్‌కు చెందిన మరో మహిళ వరకట్న దాహానికి బలైంది. అతుల్య శేఖర్ అనే కేరళ మహిళ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని షార్జాలో తన నివాసంలో శనివారం తెల్లవారుజామున విగతజీవిగా కనిపించడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ ఘటనలో ఆమె భర్త సతీష్‌పై కేరళ పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. గల్ఫ్ న్యూస్ తెలిపిన వివరాల ప్రకారం.. తన 30వ పుట్టిన రోజు నాడే అతుల్య మృతిచెందడం అత్యంత బాధాకరం. అంతేకాదు, ఆమె కొత్త ఉద్యోగంలో చేరిన మొదటి రోజే ఇలా జరిగింది. రోల్లా ప్రాంతంలోని తన ఫ్లాట్‌లో అతుల్య విగతజీవిగాపడి ఉండటాన్ని ఆమె సోదరి, బావ గుర్తించారు. ఈ ఘటనకు కొద్ది రోజుల ముందే కేరళకు చెందిన ఓ వివాహిత, తన 16 నెలల పాపను చంపి తర్వాత ఆమె కూడా ఆత్మహత్య చేసుకున్న ఘటన షార్జాలోనే చోటుచేసుకుంది. అతుల్య భర్త సతీష్‌పై ఆమె తల్లి కేరళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జులై 18, 19 మధ్య తన కుమార్తెను గొంతునులిపి ఊపిరాడకుండా చేసిన సతీష్, కడుపుపై కాలితో తన్ని, తలపై ప్లేట్‌తో కొట్టాడని ఆరోపించారు. ఇదే తన కుమార్తె మృతికి కారణమైందని ఆమె ఆరోపణలు గుప్పించారు. కుటుంబ సభ్యులు వెల్లడించిన సమాచారం ప్రకారం.. 2014లో అతుల్య, శేఖర్‌లకు వివాహం జరగ్గా.. పదేళ్ల పాప ఉంది. పెళ్లైనప్పటి నుంచి అథుల్యను అదనపుకట్నం కోసం వేధిస్తున్నారని తెలిపారు. పెళ్లి సమయంలో బైక్, 43 సవర్ల బంగారం ఇచ్చినప్పటికీ మరింత డబ్బు ఇవ్వలేదని వేధించారని చెప్పారు. భారత్‌లోనే కాదు విదేశాల్లోనూ వరకట్న వేధింపులతో భారతీయ మహిళలు ఆత్మహత్యకు పాల్పడటం కలవరానికి గురిచేస్తోంది. ఇటీవల యూపీలో అత్తింటి వేధింపులతో ఓ వివాహిత ఒంటిపై సూసైడ్ నోట్ రాసుకుని ఆత్మహత్య చేసుకుంది.

ఈ ఘటనపై బీఎన్ఎస్1961 వరకట్న నిషేధ చట్టం తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు అయ్యాయి. అయితే, తనపై వచ్చిన ఆరోపణలను ఆమె భర్త సతీశ్ ఖండించారు. 'ఆమె ఆత్మహత్యకు పాల్పడిందంటే నాకే నమ్మబుద్ధి కావడం లేదు. నన్ను జైలుకు పంపడానికి కుట్ర చేస్తున్నారు.. నిజాలు వెలుగులోకి రావాల్సిందే' అని అన్నారు. పెళ్లి సమయంలో భారీగా బంగారం, డబ్బు ముట్టజెప్పినా.. అది సరిపోదని ఇంకా కావాలని అత్తింటివాళ్లు వేధింపులకు గురిచేస్తోన్న ఘటనలు సర్వసాధారణం అయిపోయాయి. అతుల్య తండ్రి మాత్రం తన కుమార్తె ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదన్నారు. ఆమె మరణం కూడా అనుమానాస్పదంగా ఉందని, గతంలోనూ వేధింపులు ఎదుర్కొందని, పోలీసులకు ఫిర్యాదు చేశామని అన్నారు. అథుల్య గాయాలతో ఉన్న దృశ్యాలు, భర్త ఒక ప్లాస్టిక్ స్టూల్‌తో ఆమెను కొట్టేందుకు ప్రయత్నిస్తున్న వీడియోలను కూడా కుటుంబం విడుదల చేసింది.

## ఆపరేషన్ సిందూర్‌పై చర్చించాలని ఖర్గే డిమాండ్..

### స్వాతంత్ర్యం తర్వాత ఇలాంటి ఆపరేషన్ జరుగలేదన్న కేంద్రమంత్రి..!



**న్యూఢిల్లీ-నవభూమి:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజునే సమావేశాల్లో తీవ్ర గందరగోళం నెలకొన్నది. ఆపరేషన్ సిందూర్‌పై చర్చించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశారు. ఈ అంశంపై రాజ్యసభలో తీవ్ర గందరగోళం నెలకొంది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రదాడి అంశంపై ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టేందుకు ప్రయత్నించారు. అయితే, బీజేపీ జాతీయ అధ్యక్షుడు, సభా నాయకుడు జేపీ నడ్డా గట్టిగానే సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే రాజ్యసభలో మాట్లాడుతూ పహల్గాం ఉగ్రవాద దాడి నిందితులను ఇంకా పట్టించుకోలేదన్నారు.

## ప్రతిపక్ష నేతగా పార్లమెంట్‌లో మాట్లాడే అవకాశం నాకు ఇవ్వట్లేదు : రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ-నవభూమి:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఇవాళ ఉదయం ప్రారంభమైన విషయం తెలిసిందే. అయితే, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉన్నప్పటికీ తనను మాట్లాడనివ్వట్లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ సమావేశాల్లో అధికార పక్షం పక్షపాతంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. రక్షణ మంత్రి, ప్రభుత్వంలోని ఇతర మంత్రులకు మాట్లాడటానికి అనుమతి ఇచ్చారని.. తనకు మాత్రం ఆ అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. 'పార్లమెంట్ సమావేశాల్లో ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోంది. రక్షణ మంత్రి, ప్రభుత్వంలోని ఇతర మంత్రులకు మాట్లాడేందుకు అనుమతి ఇచ్చారు. ప్రతిపక్ష నాయకులకు మాత్రం మాట్లాడేందుకు అనుమతి ఇవ్వడం లేదు. నేను లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడిని. ప్రతిపక్ష నేతగా మాట్లాడే హక్కు నాకు ఉంది. కానీ వారు నన్ను మాట్లాడనివ్వట్లేదు. అభిప్రాయాలను తెలియజేసే అవకాశం నాకు ఇవ్వట్లేదు' అని విమర్శించారు.

## రాజకీయ పోరాటాలు మీకెందుకు.. ఈడీపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు..!



**న్యూఢిల్లీ-నవభూమి:** కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కేసులో కర్నాటక సీఎం సిద్ధరామయ్య సతీమణి బీఎం పార్వతి, రాష్ట్రమతి బైరతి సురేశ్‌లకు జారీ చేసిన సమన్లు కర్నాటక హైకోర్టు రద్దు చేసింది. హైకోర్టు ఆదేశాలను ఈడీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. పిటిషన్‌ను పరిశీలించిన సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసును విచారించడం ఏమాత్రం ఇష్టం లేదని బెంచ్ స్పష్టం చేసింది. ఈడీని ఎందుకు రాజకీయ పోరాటలకు ఉపయోగిస్తున్నారంటూ ఘాటుగా ప్రశ్నించింది. రాజకీయ యుద్ధాలను ఓటర్ల ముందు జరగనివ్వాలి అని సొలిటర్ జనరల్‌తో సీజేఐ అన్నారు. 'మిస్టర్ రాజు దయచేసి మమ్మల్ని నోరు తెరవమని అడకండి. లేకపోతే మేం ఈడీ గురించి కొన్ని కఠినమైన వ్యాఖ్యలు చేయాల్సి వస్తుంది. దురదృష్టవశాత్తు నాకు మహారాష్ట్రలో కొంత అనుభవం ఉంది. మీరు దేశవ్యాప్తంగా ఈ హింసను కొనసాగించరు. ఓటర్ల ముందు ఈ రాజకీయ యుద్ధాలు జరగనివ్వండి. మిమ్మల్ని (ఈడీ) ఎందుకు.. ఉపయోగిస్తున్నారు? సింగిల్ జడ్జి అనుసరించిన నిర్ణయంలో ఎలాంటి లోపాలు కనిపించడం లేదు. విచిత్రమైన వాస్తవాలు, పరిస్థితుల్లో దాన్ని తోసిపుచ్చుతున్నాం' అంటూ సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

## మాతా వైష్ణో దేవి యాత్ర మార్గంలో విరిగిపడ్డ కొండచరియలు.. పలువురికి గాయాలు



**రియాసి-నవభూమి:** జమ్ము కశ్మీర్ లోని రియాసి జిల్లాలో గల పవిత్ర మాతా వైష్ణో దేవి ఆలయానికి వెళ్లే మార్గంలో సోమవారం ఉదయం భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో పలువురు భక్తులు గాయపడ్డారు. బంగంగా ప్రాంత సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. జమ్ము కశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు కత్రా నుంచి భవన్‌కు వెళ్లే పాత యాత్ర మార్గంలోని బంగంగా ప్రాంతం గుల్షన్ కా లంగర్ వద్ద ఉదయం 8 గంటల సమయంలో కొండచరియలు ఒక్కసారిగా విరిగిపడ్డాయి. ఈ ఘటనలో దాదాపు 10 మంది భక్తులు గాయపడ్డారు. ఈ మార్గం యాత్రికులకు అత్యంత ప్రజాదరణ పొందిన, పురాతనమైన మార్గాల్లో ఒకటి. రోజూ వేలాది మంది యాత్రికులు ఈ మార్గం గుండా ప్రయాణిస్తారు. ఈ ఘటన తర్వాత ఈ మార్గంలో రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రమాద సమాచారం అందుకున్న రెస్క్యూ టీమ్ వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టింది. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించింది.

## ల్యాండింగ్ సమయంలో రన్‌వేపై

### అదుపుతప్పిన ఎయిరిండియా విమానం



**ముంబై-నవభూమి:** ఎయిరిండియాకు చెందిన మరో విమానానికి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. సోమవారం ఉదయం కొచ్చి నుంచి ముంబయికి చేరుకున్న ఎయిరిండియా విమానం 2744 విమానాశ్రయంలో ల్యాండ్ అవుతుండగా పక్కకు జారిపోవడంతో కలకలం రేపింది. భారీ వర్షం కారణంగా రన్‌వేపై నుంచి విమానం అదుపు తప్పింది. ఈ ఘటనలో విమానానికి నష్టం వాటిల్లింది. ప్రయాణికులు, సిబ్బంది మాత్రం సురక్షితంగా బయటపడ్డారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. భారీ వర్షం కురుస్తుండటంతో విమానం రన్‌వేపై అదుపు తప్పింది. వెంటనే స్పందించిన సహాయక బృందాలు హుటాహుటిన అక్కడకు చేరుకుని ప్రయాణికులను, సిబ్బందిని క్షేమంగా కిందకు దించాయి. ఈ ప్రమాదంలో విమానం ఇంజిన్, మూడు టైర్లు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. అలాగే, రన్‌వే కొంతమేర ధ్వంసం అయింది. దీంతో ఇతర విమానాల ల్యాండింగ్ కోసం సెకండరీ రన్‌వేను ఉపయోగిస్తున్నారు. ప్రమాదం జరిగిన ఎయిరిండియా విమానాన్ని తనిఖీల కోసం వేరే చోటికి తరలించారు. విమానంలో ఎంతమంది ప్రయాణికులు ఉన్నారనే విషయం ఇంకా తెలియాల్సి ఉంది. ధ్వంసమైన రన్‌వేను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వెల్లడించారు. "భారీ వర్షం కురవడంతో విమానం ల్యాండ్ అవుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది" అని అధికారులు పేర్కొన్నారు. రన్‌వేను త్వరగా మరమ్మతు చేసి విమానాల రాకపోకలను సాధారణ స్థితికి తీసుకువస్తామని అధికారులు తెలిపారు. గత నెలలో అహ్మదాబాద్ లండన్ విమాన ప్రమాదం తర్వాత ఎయిరిండియా విమానాల్లో వరుస ఘటనలు ఆందోళనకు గురిచేస్తున్నాయి.

"కొచ్చి నుంచి వచ్చిన విమానం ఉదయం 9:27 గంటలకు ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రన్‌వే నుంచి పక్కకు జారింది.. వెంటనే ఎమర్జెన్సీ రెస్పాన్స్ బృందాలు రంగంలోకి దిగాయి. విమానంలోని ప్రయాణికులు, సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారు" అని తెలిపింది. ప్రయాణికుల భద్రతే మా తొలి ప్రాధాన్యత అని విమానాశ్రయ అధికారులు పునరుద్ఘాటించారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదం తర్వాత.. దేశంలోని విమానాశ్రయాల్లో రన్‌వేలు, భద్రత ప్రమాణాలపై డీజీసీఏ తనిఖీలు చేపట్టిన విషయం తెలిసిందే. మరోవైపు ఉదయం నుంచి కుండపోత వర్షాలతో ముంబయి నగరం అతలాకుతలమవుతోంది. పలు ప్రాంతాలు జలమయమవ్వడంతో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. దీంతో విమాన ప్రయాణికులకు ముందస్తు హెచ్చరిక జారీ చేసింది. "ఈ రోజు (జులై 21న) వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రయాణికులు తమ విమానాల సమాచారం ముందుగానే తమ సంస్థలతో సంప్రదించి తెలుసుకొని, సాధారణ సమయానికి కంటే ముందుగానే విమానాశ్రయానికి చేరుకోవాలని సూచిస్తున్నాం" అని స్పష్టం చేసింది.

## మేం నిజం వైపు మాత్రమే నిలబడతాం


### ఎయిరిండియా విమాన ప్రమాదంపై పార్లమెంటులో కేంద్రమంత్రి



**న్యూఢిల్లీ-నవభూమి:** అహ్మదాబాద్‌లో గత నెలలో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై దర్యాప్తు నిష్పక్షపాతంగా, నిబంధనల ప్రకారమే జరుగుతోందని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పార్లమెంటులో స్పష్టం చేశారు. ఈ ఘటనపై విదేశీ మీడియాలు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టం వచ్చినట్లుగా సొంత కథనాలను ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. విమాన ప్రమాదాలపై దర్యాప్తు ప్రక్రియ, అంతర్జాతీయ నిబంధనలు, ప్రమాణాలు, ప్రొటోకాల్స్‌కు అనుగుణంగానే జరుగుతుందని మంత్రి నొక్కి చెప్పారు. ముఖ్యంగా తమ దర్యాప్తు పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా సాగుతోందన్నారు. ఇందులో ఎలాంటి పక్షపాతం లేదుని ఆయన ప్రకటించారు. ప్రాథమిక నివేదిక అందినట్లు, దానిని సమీక్షిస్తున్నట్లు తెలిపారు. తుది నివేదికలో మరింత సమాచారం వెల్లడవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విచారణ ప్రక్రియ జరుగుతుండగానే విదేశీ మీడియా సంస్థలు తమ వ్యక్తిగత అభిప్రాయాలను, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం సరికాదని మంత్రి హితవు పలికారు. ఇలాంటి సున్నితమైన విషయాలపై అసంబద్ధమైన వ్యాఖ్యలు చేయడం, నిర్ధారణకు రాని విషయాలను వ్యాప్తి చేయడం తగదని పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో విమానంలోని బ్లాక్ బాక్స్‌కు నష్టం వాటిల్లినప్పటికీ.. అందులోని డేటాను విజయవంతంగా తిరిగి పొందామన్నారు. అలాగే డీకోడ్ కూడా చేయగలిగామని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. భారత దేశంలో ఈ తరహా సాంకేతిక విజయం సాధించడం ఇదే మొదటి సారి అని అన్నారు. ఇది దర్యాప్తు బలాన్ని పెంచుతుందని సూచించారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా నివారించడానికి ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు. దేశంలోని విమానాశ్రయాలను అభివృద్ధి చేయడంతో పాటు విస్తరణ పనులను కూడా చేపడుతున్నట్లు తెలిపారు. అంతేకాకుండా విమానయాన రంగంలో ఉన్న సిబ్బంది కొరతను అధిగమించేందుకు.. అనేక చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులలో దాదాపు 90 శాతం వరకు భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి రామ్మోహన్ నాయుడు పార్లమెంటుకు తెలియజేశారు.

## జస్టిస్ యశ్వంత్ వర్మ మీకేమైనా స్నేహితుడా

### న్యాయవాదిపై సుప్రీం ఫైర్, అసలేం జరిగిందంటే?




**న్యూఢిల్లీ-నవభూమి:** అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నగదు కట్టలు బయటపడటం దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం అందరికీ తెలిసిందే. అయితే దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న పిటిషన్‌ను సుప్రీం కోర్టు అత్యవసరంగా విచారించడానికి నిరాకరించింది. ముఖ్యంగా పిటిషనర్ తరపు న్యాయవాది జస్టిస్ యశ్వంత్ వర్మను.. వర్మ అని సంభోదించడాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. న్యాయమూర్తి స్థానంలో ఉన్న వ్యక్తిని ఏక వచనంతో సంభోదించడానికి ఆయన ఏమైనా మీ స్నేహితుడా అని ప్రశ్నించింది. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో పెద్ద ఎత్తు నగదు కట్టలు లభ్యం అయిన విషయం అందరికీ తెలిసిందే. దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో.. ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించడానికి సుప్రీం కోర్టు నిరాకరించింది. ఈ పిటిషన్‌ను లాయర్ మాథ్యూస్ నేడుంపరా దాఖలు చేశారు. ఇది జస్టిస్ వర్మకు వ్యతిరేకంగా ఆయన దాఖలు చేసిన మూడవ పిటిషన్ కావడం గమనార్హం. ఈ వ్యవహారంపై అత్యవసర విచారణ జరిపి, ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, దర్యాప్తు చేపట్టాలని నేడుంపరా పట్టుబట్టగా.. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడా ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా జస్టిస్ యశ్వంత్ వర్మను.. వర్మ అని సంబోధించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయమూర్తి స్థానంలో ఉన్న వ్యక్తిని ఏకవచనంతో సంభోదించడానికి ఆయన మీకేమైనా స్నేహితుడా అని ఆగ్రహం వ్యక్తం చేసింది. జస్టిస్ వర్మపై ఆరోపణలు ఉన్నందున న్యాయమూర్తి స్థానానికి ఆయన అర్హుడు కాదని లాయర్ వాదించగా.. సర్వోన్నత న్యాయస్థానానికి పాఠాలు చెప్పొద్దంటూ ధర్మాసనం మండిపడింది. అలాగే జస్టిస్ యశ్వంత్ వర్మపై పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న అభిశంసన తీర్మానంపై 100 మందికి పైగా ఎంపీలు సంతకం చేశారని ఆదివారం పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజుజు పేర్కొన్న విషయం తెలిసిందే. నేడు ప్రారంభం అయి పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లోనే ఈ తీర్మానాన్ని తెస్తామన్నారు. జస్టిస్ వర్మను తొలగించే విషయంలో అన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో ఉన్నాయని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఈ వివాదం వెనుక ఒక అంతర్గత విచారణ కమిటీ నివేదిక ఉంది. జస్టిస్ వర్మ ఆయన కుటుంబ సభ్యుల నియంత్రణలో ఉన్న స్టోర్‌రూమ్‌లో పెద్ద మొత్తంలో సగం కాలిన నగదు లభ్యమైందని ఈ కమిటీ నివేదించింది. ఈ సంఘటన జస్టిస్ వర్మ అవినీతికి పాల్పడ్డారని నిర్ధారించి, ఆయనను అభిశంసించాలని మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా సిఫార్సు చేయడానికి దారితీసింది.

## తమిళనాడు సీఎం స్టాలిన్‌కు అస్వస్థత.. చెన్నై అపోలో ఆసుపత్రిలో చికిత్స



**చెన్నై-నవభూమి:** తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఉదయం మార్నింగ్ వాక్ సమయంలో అస్వస్థతకు గురైనట్లు తెలిసింది. దీంతో కుటుంబ సభ్యులు సీఎంను అన్నా సలైలోని గ్రీమ్స్ రోడ్డులోని అపోలో హాస్పిటల్ కు తరలించారు. అక్కడ సీఎంకు చికిత్స కొనసాగుతోంది. %'సోమవారం ఉదయం మార్నింగ్ వాక్ చేస్తున్న సమయంలో సీఎంకు కళ్లు తిరగడంతో ఆసుపత్రికి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉంది. వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అవసరమైన అన్ని పరీక్షలు చేస్తున్నాం' అని అపోలో హాస్పిటల్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ బీజీ తెలిపారు. ఈ మేరకు సీఎం ఆరోగ్యంపై హెల్త్ బులెటిన్ విడుదల చేశారు.

## ఎట్టకేలకు బ్రిటన్ ఫైటర్ జెట్‌కు పూర్తైన మరమ్మతులు.. నేడు ట్రయల్ ఫ్లైట్‌కు ఏర్పాట్లు



**తిరువనంతపురం -నవభూమి:** సాంకేతిక సమస్యల కారణంగా కేరళ లోని తిరువనంతపురం ఎయిర్‌పోర్ట్ లో నెల రోజులుగా నిలిచిపోయిన బ్రిటిష్ రాయల్ నేవీ ఎఫ్-35బి స్టెల్త్ యుద్ధ విమానానికి ఎట్టకేలకు మరమ్మతులు పూర్తయ్యాయి. యుద్ధ విమానం హైడ్రాలిక్ సిస్టమ్‌లో తలెత్తిన లోపాన్ని బ్రిటిష్ ఇంజనీర్ల బృందం విజయవంతంగా సరిచేసింది. అనంతరం విమానాన్ని హ్యాంగర్ నుంచి బయటకు తీసుకొచ్చారు. మరమ్మతులు విజయవంతం కావడంతో నేడు ట్రయల్ ఫ్లైట్ నిర్వహించేందుకు నిపుణులు సన్నాహకాలు చేస్తున్నారు. అనంతరం ఇది యూకేకి ఎగిరిపోనుంది. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన యుద్ధ విమానాల్లో ఒకటైన బ్రిటన్ దేశానికి చెందిన ఎఫ్-35 బీ 40 రోజులుగా కేరళలోని తిరువనంతపురం ఎయిర్‌పోర్టులోనే నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఇండో-యూకే నేవీ విన్యాసాల్లో పాల్గొన్న ఈ ఎఫ్-35బి విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దాంతో ఆ విమానాన్ని జూన్ 14న అర్ధరాత్రి తర్వాత తిరువనంతపురం ఎయిర్‌పోర్టులో ల్యాండ్ చేశారు. తొలుత ప్రతికూల వాతావరణం, ఇంధన కొరత కారణంగా విమానాన్ని అత్యవసరంగా దించినట్లు వార్తలు వచ్చాయి. కానీ ఆ ఫైటర్ జెట్‌లో ఇంజినీరింగ్ సమస్య తలెత్తినట్లు ఆ తర్వాత యూకే అధికారులు వెల్లడించారు. విమానానికి మరమ్మతులు చేయడానికి అదేరోజు రాత్రి ఏడబ్ల్యూ 101 మెర్లిన్ హెలికాప్టర్‌లో నిపుణులు వచ్చారు. మరమ్మతులు చేసినా విమానం మొరాయించింది. అప్పటి నుంచి తిరువనంతపురం ఎయిర్‌పోర్టులోనే ఉంది. ఆ తర్వాత పరికరాలతో సహా 24 మంది స్పెషల్ ఎక్స్‌పర్ట్స్ బృందం వచ్చి విమానానికి మరమ్మతులు చేపట్టింది. వారు చేపట్టిన మరమ్మతులు విజయవంతం కావడంతో విమానాన్ని హ్యాంగర్ నుంచి బయలకు తరలించారు. ఇవాళ ట్రయల్ ఫ్లైట్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అనంతరం ఇది యూకేకు వెళ్లనుంది. ఈ విమానం షార్ట్ టేకాఫ్‌తోపాటు వర్టికల్ ల్యాండింగ్ అవుతుంది. అమెరికా సహా అతికొద్ది దేశాల ఎయిర్‌ఫోర్సుల వద్దే ఈ ఫైటర్ జెట్ ఉంది.

మహారాష్ట్రలో 'హనీ ట్రాప్' కుట్ర ఆరోపణలు..

## మంత్రులు, సీఎంవో అధికారిపై విపక్షాల దాడి!

### బీజేపీ కార్యకర్త ప్రఫుల్ లోధా దీనికి సూత్రధారి అని వాదన

**ముంబై-నవభూమి:** మహారాష్ట్ర రాజకీయాల్లో 'హనీ ట్రాప్' కుట్ర ఆరోపణలు కలకలం సృష్టిస్తున్నాయి. అధికార బీజేపీకి చెందిన సీనియర్ మంత్రి గిరీశ్ మహాజన్, ముఖ్యమంత్రి కార్యాలయ (సీఎంవో) అధికారి రమేశ్వర్ నాయక్ ఈ కుట్రలో భాగమని ప్రతిపక్ష నేతలు ఆరోపించారు. ఈ వ్యవహారం రాష్ట్రంలో రాజకీయ వేడిని రాజేసింది. ఎన్‌సీపీ (శరద్ పవార్ వర్గం) నాయకుడు ఏక్‌నాథ్ ఖడ్సే ఈ హనీ ట్రాప్ కుట్రకు బీజేపీ కార్యకర్త ప్రఫుల్ లోధా ప్రధాన సూత్రధారి అని సంచలన ఆరోపణలు చేశారు. లోధా గతంలో కాంగ్రెస్ సభ్యుడిగా ఉండి, ఆ తర్వాత అప్పటి ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సమక్షంలో, రమేశ్వర్ నాయక్ హాజరైన ఒక కార్యక్రమంలో బీజేపీలో చేరినట్టు ఖడ్సే వెల్లడించారు. ఈ కుట్రలో ఒక హోటల్ యజమాని, స్థానిక కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తి కూడా ఇరుక్కున్నారని ఆయన తెలిపారు. గత వారం రోజులుగా రాష్ట్రంలో హనీ ట్రాప్ కేసుల సంఖ్య పెరిగిందని కాంగ్రెస్ పదేపదే ప్రస్తావిస్తోంది. రాష్ట్రంలోని 72 మంది రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు ఈ కేసుల్లో ఇరుక్కున్నారని కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు చేసింది. శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాకరే వర్గం) ఎంపీ సంజయ్ రౌత్ ఈ ఆరోపణలకు మరింత బలం చేకూర్చారు. ప్రఫుల్ లోధాతో గిరీశ్ మహాజన్ ఉన్న ఫోటోను తన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పంచుకున్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 హైదరాబాద్
మంగళవారం
22 । జులై । 2025



## ముంబైని ముంచెత్తిన భారీ వర్షం.. నీట మునిగిన సబ్‌వేలు.. ఐఎండీ హెచ్చరికలు



**ముంబై-నవభూమి:** రాయ్‌గఢ్‌లో ఈరోజు భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. థానే, పాల్ఘర్‌లో కూడా భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఈ మేరకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది. రానున్న 24 గంటల పాటు ముంబై, కొంకణ్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఐఎండీ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. ముంబై సమీప ప్రాంతాల ప్రజలు సముద్ర తీరానికి వెళ్లొద్దని హెచ్చరించారు. అనవసర ప్రయాణాలను రద్దు చేసుకోవాలని సూచించారు.భారీ వర్షాలు విమాన రాకపోకలపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఇండిగో, స్పైస్‌జెట్ సహా పలు విమానయాన సంస్థలు తమ ప్రయాణికులకు కీలక అడ్వైజరీ జారీ చేశాయి. భారీ వర్షం కారణంగా నగరంలో ట్రాఫిక్ సమస్యలు ఉన్నాయని.. ప్రయాణికులు షెడ్యూల్ టైమ్ కంటే కాస్త ముందే ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోవాలని సూచించాయి.



## గ్రామ పంచాయతీ వ్యవస్థ గాడిన పడేనా

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అత్యంత కీలకమైన మన గ్రామ పంచాయతీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కర్ణుడి చావుకి అనేక కారణాలు అన్నట్లు దానికి అనేక కారణాలు ఉన్నాయి. 2018లో తెలంగాణ పంచాయతీరాజ్ యాక్ట్ (టీపీఆర్ఏ) రూపకల్పన చేసుకున్నాం. ఈ చట్టం ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 12,791 గ్రామ పంచాయతీలు కొత్తగా ఏర్పడ్డ పంచాయతీలతో సహా, 634 మండల పరిషత్‌లు, 31 జిల్లా పరిషత్తులకు ఎన్నికలు జరుపుకున్నాం. ఇక స్థానిక సంస్థల అభివృద్ధి మూడు పువ్వులు ఆరు కాయలుగా జరుగుతుందని భావించాం.కొత్తగా ఎన్నికైన సర్పంచులు కూడా పనులు చేయడంలో ఉత్సాహం చూపించారు. ఒక రకంగా మొదటి రెండు సంవత్సరాల కాలంలో అటు కేంద్రం విడుదల చేసే నిధులు, ఇటు రాష్ట్రం ఇవ్వాల్సిన గ్రాంట్లు సకాలంలో రావడంతో తెలంగాణలోని గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న భూములను వినియోగంలోకి తెచ్చారు. ప్రతి గ్రామ పంచాయతీలో వైకుంఠ ధామం, క్రీడా ప్రాంగణం, డంపింగ్ యార్డ్, పంచాయతీ భవనాలు, రైతు వేదికలు నిర్మాణం చేశారు. ప్రతి పంచాయతీ ఒక వాహనం కొనుగోలు చేయటంతో పాటు గ్రామ పారిశుధ్య నిర్వహణకు గాను స్వల్పవేతనాలపై సిబ్బందిని నియమించింది. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శిని నియమించింది. పంచాయతీ స్థాయిని బట్టి వాహనాన్ని, పారిశుధ్య సిబ్బందిని నియమించారు. ఈ వ్యవహారం, హడావిడి చూసిన సర్పంచ్‌లు నిధులు సకాలంలో అందకపోయినా అప్పులు తెచ్చి ఉరుకులు పరుగులపై పనులు చేయించారు. మరికొందరైతే మరోసారి మనమే ఎన్నిక కాలేమా! అన్న ధీమాతో ముందస్తు ఖర్చు పెట్టారు. వరుసగా రెండేళ్లు కేంద్రం 80శాతం, రాష్ట్రం 20శాతం నిధులతో పంచాయతీ పాలన పైలాపచ్చీసులా నడిచింది. ఇక రెండేళ్ల తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు చెడటంతో కేంద్రం నిధులు ఆలస్యంగా రావడం, రాష్ట్రం ఆ నిధులు దారి మళ్లించుకోవడం మూలంగా గ్రామపంచాయతీ పరిపాలన క్రమంగా అస్తవ్యస్తం అయ్యింది. నిధుల కొరత శాపంగా మారింది. పంచాయతీలకు రావాల్సిన 13వ ఆర్థిక సంఘం నిధులు, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన నిధులు (పీఎంజీఎస్‌వై), రూరల్ కమ్యూనిటీ ప్రోగ్రాం (ఆర్‌సీపీ) నిధులు అందకపోవడంతో పెద్ద పంచాయతీ అయితే రూ.30 లక్షలు, చిన్న పంచాయతీ అయితే రూ.10 లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉంది. పంచాయతీ నిధులు దారి మళ్లటం, కేంద్రం వాటా రాకపోవడంతో అప్పుల పాలైన కొందరు సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు చూశాం. మూడేళ్ల కాలంగా తాము ఖర్చు చేసిన నిధుల కోసం ఎదురు చూస్తున్న సర్పంచ్‌ల భవితవ్యం అగమ్య గోచరంగా ఉంది. గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పదవీకాలం 28 ఫిబ్రవరి 2024 నాటికి ముగిసింది. అంతకుముందు బీఆర్ఎస్ పరిపాలనలో రెండేళ్లు, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏడాదిన్నరగా సర్పంచ్‌లు అధికారుల చుట్టూ, రాజకీయ నాయకుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా ఒక్క పైసా బకాయిలు రాలలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఏడాదిన్నర కాలంగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడం వలన కేంద్రం నుంచి రావాల్సిన నిధులు విడుదల కావడం లేదు. ఎన్నికలు వివిధ కారణాలతో వాయిదా పడుతూ వచ్చాయి.ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాభివృద్ధి పద్దు క్రింద రూ.31,426 కోట్లు కేటాయించింది. ఇటీవలే పంచాయతీరాజ్ శాఖా మంత్రి ధనసరి సీతక్క 'పల్లెప్రగతి' పథకం కింద రూ. పదివేల కోట్లు గ్రామ పంచాయతీలకు విడుదల చేశారు. వీటిలో మాజీ సర్పంచ్‌ల బిల్లులు ఏ మేరకు చెల్లిస్తారో లేదో తెలియదు. కానీ, మళ్లీ తెలంగాణ కేబినెట్ ప్రకటనతో స్థానిక సంస్థల ఎన్నికల వాతావరణం వచ్చేసింది. అధికారులు బీసీలతో సహా రిజర్వేషన్ల తంతు పూర్తి చేస్తే, ఇక ఎన్నికల నిర్వహణ జరిగి, స్థానిక సంస్థలు బలపడతాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు వివాదాస్పదం అవుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో 'పీసా' చట్టం అమలు పరచకుండా అభయారణ్యం పేరుతో, నేషనల్ పార్క్ పేరుతో జీఓ 49 ప్రకారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 349 గ్రామాలను వాటి పరిధిలోకి తెస్తూ ప్రకటన చేయటం పట్ల అక్కడి గిరిజనుల నుంచి నిరసన వ్యక్తం అవుతున్నది. గత ప్రభుత్వ కాలంలోనే ఈ జీఓకు అంకురార్పణ జరిగినప్పటికీ, ఇప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరణలో అమలు జరుపుతున్నాయని గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఇక గ్రామ పంచాయతీల్లో పర్యావరణ పరిరక్షణ, గ్రామ పారిశుధ్య కార్యక్రమం నిర్వర్తించడం కోసం 'కార్బన హక్కులు' పేరుతో 'ఎకోలాజికల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్' అనే కేవలం లక్ష రూపాయల ఆర్థిక వనరు కలిగిన స్వచ్ఛంద సంస్థకు పంచాయతీ భూములను లీజు పేరుతో ఇవ్వాలనే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఈ ఆరోపణ నిజమే అయితే ఇది ఎంతమాత్రం అనుసరణీయం కాదు. గ్రామ పంచాయతీలలో స్వచ్ఛంద సంస్థల ప్రవేశం అంటే స్థానిక అధికార వికేంద్రీకరణలో ప్రభుత్వాలు వేలు పెట్టినట్టే. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇట్లాంటి వ్యవహారాలలో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలి. అంతేగాక, గత పరిపాలనా కాలంలో సర్పంచ్‌లకు చెల్లించాల్సిన నిధుల విషయంలో ప్రస్తుత పాలకులు పెద్ద మనసుతో ఆలోచన చేయాలి. అయితే మూడేళ్లుగా అస్తవ్యస్తంగా మారిన గ్రామ పంచాయతీ వ్యవస్థను గానీ, మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థను

## ముంబై రైలు పేలుళ్ల కేసులో బాంబే హైకోర్టు సంచలన తీర్పు



18 సంవత్సరాల జైలు శిక్ష తర్వాత, 7/11 ముంబై పేలుళ్ల కేసులో నిందితులుగా ఉన్న 12 మంది ముస్లిం పురుషులను బాంబే హైకోర్టు నిర్దోషులుగా ప్రకటించింది - జూలై 21, 2025.

దాదాపు రెండు దశాబ్దాలు జైలులో గడిపిన తర్వాత, 189 మంది మృతి చెంది, 800 మందికి పైగా గాయపడిన 7/11 ముంబై రైలు పేలుళ్లకు కారణమైన నిందితులైన 12 మంది ముస్లిం పురుషులను సోమవారం బాంబే హైకోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. "సహేతుకమైన సందేహాలకు మించి కేసును స్థాపించడంలో ప్రాసిక్యూషన్ పూర్తిగా విఫలమైంది" అని పేర్కొంది.ఆరు నెలల పాటు రాష్ట్రం మరియు దోషులు దాఖలు చేసిన అప్పీళ్లను విచారించిన న్యాయమూర్తులు అనిల్ కిలోర్ మరియు శ్యామ్ చందక్‌లతో కూడిన ప్రత్యేక ధర్మాసనం సోమవారం తన తీర్పును వెలువరించింది, 12 మంది నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ, వారి 18 సంవత్సరాల జైలు శిక్షకు ముగింపు పలికింది.పేలుళ్లు జరిగిన దాదాపు 100 రోజుల తర్వాత టాక్సీ డ్రైవర్లు లేదా రైలు ప్రయాణికులు నిందితులను గుర్తుంచుకోవడానికి ఎటువంటి ఆమోదయోగ్యమైన కారణం లేదని పేర్కొంటూ, దాదాపు అందరు ప్రాసిక్యూషన్ సాక్షుల సాక్ష్యాలు నమ్మదగనివిగా బాంబే హైకోర్టు గుర్తించింది.బాంబులు, తుపాకులు మరియు మ్యాప్‌ల వంటి ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కోర్టు, దాడులలో ఉపయోగించిన బాంబు రకాన్ని కూడా ప్రాసిక్యూషన్ నిర్ధారించడంలో విఫలమైనందున, అటువంటి రికవరీ కేసుకు సంబంధించినది కాదని పేర్కొంది.

?జూలై 2024 నుండి ఈ కేసులో అప్పీళ్లను కోర్టు విచారిస్తోంది.సెప్టెంబర్ 2015లో, మహారాష్ట్ర వ్యవస్థీకృత నేరాల నియంత్రణ చట్టం (%వీజూజాూ%) కింద ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టు 7/11 ముంబై రైలు పేలుళ్లకు సంబంధించి 12 మందిని దోషులుగా తేల్చి, వారిలో ఐదుగురికి మరణశిక్ష మరియు మిగిలిన ఏడుగురికి జీవిత ఖైదు విధించింది.బాంబులు అమర్చారనే ఆరోపణలపై కమల్ అన్సారీ, మొహమ్మద్ ఫైసల్ అతౌర్ రెహమాన్ షేక్, ఎహ్తేషామ్ కుతుబుద్దీన్ సిద్ధిఖీ, నవీద్ హుస్సేన్ ఖాన్ మరియు ఆసిఫ్ ఖాన్‌లకు మరణశిక్ష విధించబడింది.

మిగిలిన వారిలో తన్వీర్ అహ్మద్, మొహమ్మద్ ఇబ్రహీం అన్సారీ, మొహమ్మద్ మజీద్ మహ్మద్ షఫీ, షేక్ మొహమ్మద్ అలీ ఆలం షేక్, మొహమ్మద్ సాజిద్ మార్గుబ్ అన్సారీ, ముజమ్మిల్ అతౌర్ రెహమాన్ షేక్, సుహైల్ మెహమూద్ షేక్, జమీర్ అహ్మద్ లాతియుర్ రెహమాన్ షేక్ లకు జీవిత ఖైదు విధించబడింది.

విషాదకరంగా, నిందితులలో ఒకరైన కమల్ అహ్మద్ అన్సారీ 2021లో కోవిడ్-19 కారణంగా జైలులో ఉండగానే మరణించాడు.మరో నిందితుడు వాహిద్ షేక్‌ను తొమ్మిది సంవత్సరాలు జైలులో గడిపిన తర్వాత ట్రయల్ కోర్టు స్వయంగా నిర్దోషిగా ప్రకటించింది. రాష్ట్రం మరియు దోషులు ఇద్దరూ దాఖలు చేసిన అప్పీళ్లు 2015 నుండి బాంబే హైకోర్టు ముందు పెండింగ్‌లో ఉన్నాయి.జూలై 2024లో, కొంతమంది దోషులు త్వరగా తీర్పు ఇవ్వాలని కోరుతూ చేసిన విజ్ఞప్తిని అనుసరించి, ఈ విషయాన్ని విచారించడానికి న్యాయమూర్తులు అనిల్ కిలోర్ మరియు శ్యామ్ చందక్‌లతో కూడిన ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేశారు.ఒరిస్సా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి మరియు ప్రస్తుత సీనియర్ న్యాయవాది డాక్టర్ ఎస్. మురళీధర్, బెంగళూరుకు చెందిన ముజ్జామిల్ అతౌర్ రెహమాన్ షేక్ మరియు ముంబైలోని వర్లికి చెందిన జమీర్ అహ్మద్ లతీఫర్ రెహమాన్ షేక్ అనే ఇద్దరు దోషుల తరపున వాదించారు, వీరిద్దరూ జీవిత ఖైదులను సవాలు చేశారు.కోర్టుకు తన వివరణాత్మక సమర్పణలలో, డాక్టర్ ఎస్. మురళీధర్ దర్యాప్తు మరియు విచారణ ప్రక్రియ రెండింటిలోనూ గణనీయమైన లోపాలను ఎత్తి చూపారు.నిందితుల ఒప్పుకోలు వాంగ్మూలాలను నమోదు చేయడంలో దర్యాప్తు అధికారుల లోపాలను ఆయన దృష్టికి తెచ్చారు మరియు ఉగ్రవాద సంబంధిత లేదా హై-ప్రొఫైల్ కేసులలో మీడియా విచారణల ప్రభావం మరియు కోర్టుల ప్రవర్తన గురించి తీవ్రమైన ఆందోళనలను లేవనెత్తారు.7/11 పేలుళ్ల కేసులో దర్యాప్తు "పక్షపాతంతో" జరిగిందని, మొత్తం చట్టపరమైన ప్రక్రియ యొక్క న్యాయాన్ని రాజీ పడేస్తుందని మురళీధర్ నొక్కిచెప్పారు."అమాయకులను జైలుకు పంపుతారు మరియు తరువాత, సంవత్సరాల తరువాత, వారు విడుదలైనప్పుడు, వారి జీవితాలను పునర్నిర్మించుకునే అవకాశం లేదు" అని డాక్టర్ ఎస్. మురళీధర్ కోర్టుకు తెలిపారు, ఇద్దరు నిందితులను నిర్దోషులుగా విడుదల చేయాలని వాదించారు. "ఈ వ్యక్తులు గత 17 సంవత్సరాలుగా జైలులో ఉన్నారు. వారు ఒక్క రోజు కూడా బయటకు అడుగు పెట్టలేదు. వారి జీవితంలో ఎక్కువ భాగం గడిచిపోయింది" అని ఆయన అన్నారు. ప్రముఖ కేసులలో చట్ట అమలు సంస్థలు అనుసరించే విధానాన్ని ఆయన విమర్శించారు, "ప్రజా నిరసన ఉన్న సందర్భాల్లో, పోలీసుల విధానం ఎల్లప్పుడూ మొదట నేరాన్ని భావించి అక్కడి నుండి వెళ్లిపోవడం." మీడియా కవరేజ్ యొక్క హానికరమైన పాత్రను హైలైట్ చేస్తూ, "పోలీసు అధికారులు పత్రికా సమావేశాలు నిర్వహిస్తారు మరియు మీడియా కేసును నివేదించే విధానం, అది వాస్తవంగా ఒక వ్యక్తి యొక్క నేరాన్ని నిర్ణయిస్తుంది" అని ఆయన అన్నారు.

"ఇటువంటి అనేక ఉగ్రవాద కేసుల్లో, దర్యాప్తు సంస్థలు మమ్మల్ని ఘోరంగా విఫలమయ్యాయి" అని ఆయన అన్నారు.సరైన ఆధారాలు లేకుండా 12 మంది వ్యక్తులు 18 సంవత్సరాలు జైలులో గడిపారని వాదిస్తూ, న్యాయం చాలా కాలంగా నిరాకరించబడిందని, "ముంబై పశ్చిమ రైల్వే స్థానిక మార్గాన్ని చీల్చివేసిన ఆ పేలుళ్లలో చాలా మంది ప్రాణాలు కోల్పోయారని, ఆపై ఈ అమాయకులను అరెస్టు చేశారని" ఆయన అన్నారు. "సంవత్సరాలు గడిచిపోతున్నాయి, నిందితులు చివరకు నిర్దోషులుగా విడుదలయ్యారు, అయినప్పటికీ ఎవరూ ముగింపు కనుగొనలేదు. ఉగ్రవాద కేసుల దర్యాప్తులో మనకు వైఫల్యాల చరిత్ర ఉంది. కానీ ఇంకా ఆలస్యం కాలేదు, కోర్టు ఇప్పటికీ దానిని సరిదిద్దగలదు" అని ఆయన అన్నారు.కళంకం వల్ల కలిగే శాశ్వత నష్టాన్ని పరిగణనలోకి తీసుకోవాలని మురళీధర్ బెంచ్‌ను కోరారు, "నిందితులు మాత్రమే బాధపడరు. వారి పిల్లలు, వారి తల్లిదండ్రులు, వారి బంధువులు, వారందరూ కళంకం చెందుతారు" అని అన్నారు, "మరియు ఒకసారి కళంకం చెందిన మిలార్డ్స్, ఈ సమాజం వారి పట్ల చాలా క్రూరంగా ఉంటుంది. ఎవరూ వారితో సరిగ్గా వ్యవహరించరు. దయచేసి ఈ అంశాన్ని కూడా పరిగణించండి."? కేసు పూర్వాపరాలు.....2006, జూలై 11న ముంబై సబర్బన్ రైళ్లలో 11 నిమిషాల్లో ఆర్డీఎక్స్ పేలుళ్లు సంభవించాయి. ఈ ఉగ్రదాడిలో 189 మంది మరణించగా, 827 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఆరున్నర నెలల పాటు జరిగిన విచారణలో నిందితులకు ట్రయల్ కోర్ట్ మరణశిక్షతో పాటు యావజ్జీవ శిక్షలు విధించబడ్డాయి. ఈ కేసులో నిందితులు దాఖలు చేసిన మరణ నిర్ధారణ పిటిషన్లు, అప్పీళ్లపై బాంబే హైకోర్టు శుక్రవారం తన తీర్పుని రిజర్వ్ చేసింది. జూలై 2024 నుంచి ఈ కేసును ముగించడానికి డివిజన్ బెంచ్ విచారణ జరుపుతోంది.విచారణ చివరి రోజున నిందితులు తమ వాదనల్ని చెప్పుకోవడానికి జస్టిస్ అనిల్ కిలోర్, శ్యాం చందక్‌లతో కూడిన ధర్మాసనం 2 నిమిషాలు అనుమతించింది. నిందితులు పూణేలోని ఎరవాడ జైలు, అమరావతి, నాసిక్, నాగ్‌పూర్ సెంట్రల్ జైళ్ల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమ వాదనల్ని వినిపించారు. 12 నిందితుడిగా నాగ్‌పూర్ సెంట్రల్ జైలులో ఉన్న నవేద్ హుస్సేన్ మాట్లాడాడు. "తనపై ఉన్న కేసు తప్పుడు కేసు. నేను నిర్దోషిని. నేను ఎవరి కోసం మాట్లాడటం లేదు, నా కోసం మాత్రమే మాట్లాడుతున్నాను. ఈ కేసుతో నాకు సంబంధం లేదు. అరెస్టుకు ముందు నిందితుల్లో ఒకరితో తప్పా తనకు ఎవరితో సంబంధం లేదు. 19 ఏళ్లుగా బాధపడుతున్నాను. రైలు పేలుడులో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. కానీ ప్రతీకారం అంటే అమాయకులను ఉరితీయకూడదు" అని చెప్పాడు.నవాద్ హుస్సేన్ రైళ్లలో బాంబులు పెట్టిన వ్యక్తుల్లో ఒకడిగా ఆరోపించబడ్డాడు. ట్రయల్ కోర్టు ఇతడికి మరణశిక్ష విధించింది. హుస్సేన్ విచారణ సమయంలో నేరాన్ని ఒప్పుకున్నాడు. శుక్రవారం విచారణలో హుస్సేన్ తప్ప ఇంకెవరు నిందితులు మాట్లాడలేదు. జూలై 11, 2006న ముంబై సబర్బన్ రైళ్లలో ఏడు ప్రదేశాల్లో 11 నిమిషాల్లో బాంబు పేలుళ్లు జరిగాయి. ఈ కేసులో 13 మందిని అరెస్ట్ చేయగా, 15 మందిని వాంటెడ్‌గా ప్రకటించారు. కొందరు ఉగ్రవాదులు పాకిస్తాన్ నుంచి ఆపరేట్ చేశారు. నిందితులపై %వీజూజాూ , ఖూూూూ% కేసులు పెట్టి, నవంబర్ 2006 లో చార్జిషీట్ దాఖలు చేసింది.9 ఏళ్ల తర్వాత మరణశిక్షను ఎదుర్కొంటున్న దోషుల్లో ఒకరైన ఎతేషామ్ సిద్ధిఖీ హైకోర్టులో మరణశిక్షపై అప్పీల్ చేశాడు. దీనిని విచారించడానికి గతేడాది ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేశారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజా థాకరే ఈ కేసుని 'అత్యంత అరుదైన కేసుల్లో ఒకటి" అని వాదిస్తూ మరణశిక్షల్ని నిర్ధారించాలని కోర్టుని కోరారు.

## డ్రగ్స్ ఓ దాడి.. లక్ష్యం యువత భవిష్యత్తు!



భారతదేశంలో డ్రగ్స్ వినియోగం ఒక ప్రమాదకర సామాజిక సమస్యగా మారుతోంది, ముఖ్యంగా యువతను ఈ సమస్య తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. గంజాయి, హెరాయిన్, ఎండీఎంఏ, కొకైన్ వంటి మత్తు పదార్థాలు పట్టణాల నుండి గ్రామీణ ప్రాంతాల వరకు సులభంగా అందుబాటులోకి వస్తున్నా యి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) 2022 నివేదిక ప్రకారం, దేశవ్యాప్తంగా 1.15 లక్షల డ్రగ్ సంబంధిత కేసులు నమోదయ్యాయి, ఇందులో పంజాబ్ (12,442 కేసులు), కేరళ (26,619 కేసులు), మరియు మహారాష్ట్ర (13,830 కేసులు) అగ్రస్థానంలో ఉన్నాయి. తెలంగాణలో గంజాయి తరలింపు కేసులు గత రెండేళ్లలో గణనీయంగా పెరిగాయని రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తెలిపింది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాలు డ్రగ్ సరఫరా కేంద్రాలుగా మారుతున్నాయి. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ (ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్) నివేదిక ప్రకారం, డ్రగ్ వ్యసనం కారణంగా మానసిక వ్యాధులతో బాధపడుతున్నవారిలో గణనీయమైన శాతం 20-30 ఏళ్ల యువకులు.

మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ (ఎంఓఎస్‌జేఈ) 2019 నివేదిక ప్రకారం, దేశంలో 2.8% మంది (10-75 ఏళ్ల మధ్య) గంజాయి వినియోగిస్తున్నారు, 2.1% మంది ఓపియాయిడ్స్ (హెరాయిన్, ఫార్మాస్యూటికల్ ఓపియాయిడ్స్) ఉపయోగిస్తున్నారు. ఉత్తరప్రదేశ్, పంజాబ్, సిక్కిం, ఛత్తీస్‌గఢ్‌లో గంజాయి వినియోగం అధికంగా ఉంది. అలాగే, 2022లో దేశవ్యాప్తంగా 681 మంది డ్రగ్ ఓవర్‌డోస్ కారణంగా మరణించారు, ఇందులో పంజాబ్ (144 మరణాలు), రాజస్థాన్ (117), మరియు మధ్యప్రదేశ్ (74) అగ్రస్థానంలో ఉన్నాయి.

యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్ (యూఎన్ఓడీసీ) 2024 వరల్డ్ డ్రగ్ రిపోర్ట్ ప్రకారం, దక్షిణాసియాలో భారతదేశం ఓపియాయిడ్స్ వినియోగంలో అగ్రస్థానంలో ఉంది, 2022లో ప్రపంచవ్యాప్తంగా 292 మిలియన్ల మంది డ్రగ్స్ వినియోగించారని, ఇందులో గంజాయి (228 మిలియన్ల మంది) అత్యంత సాధారణంగా ఉపయోగించబడుతోందని తెలిపింది.

యువత ఉద్యోగ ఒత్తిడి, విద్యా పోటీ, సామాజిక అంచనాల కారణంగా మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటోంది, డ్రగ్స్ తాత్కాలిక ఉపశమనంగా కనిపిస్తున్నాయి. డార్క్ వెబ్, ఎన్‌క్రిప్టెడ్ చాట్ యాప్‌ల ద్వారా డ్రగ్స్ సరఫరా సులభతరమవుతోంది, సోషల్ మీడియా ద్వారా మార్కెటింగ్, హోమ్ డెలివరీ వ్యవస్థలు ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ఉదాహరణకు, 2023లో గోవాలో ఫార్మా పార్టీలను ప్రోత్సహించేందుకు ఇన్‌స్టాగ్రామ్‌ను వేదికగా వినియోగించిన ఒక డ్రగ్ నెట్‌వర్క్‌ను సైబర్ క్రైమ్ యూనిట్ గుర్తించింది. ఈ నెట్‌వర్క్ దాదాపు ఒక లక్ష మందికి పైగా యువతను లక్ష్యంగా చేసుకుని ప్రచారం జరిపిందని అధికారులు వెల్లడించారు. అంతర్జాతీయ డ్రగ్ ట్రాఫికింగ్ నెట్‌వర్క్‌లు, ముఖ్యంగా ఆఫ్ఘనిస్తాన్, మయన్మార్ నుండి హెరాయిన్, సింథటిక్ డ్రగ్స్ సరఫరా భారతదేశంలో పెరుగుతోంది, ఇండియా-మయన్మార్ సరిహద్దులలో భద్రతా సవాళ్లు ఈ సరఫరాను సులభతరం చేస్తున్నాయి. డ్రగ్ వినియోగం 17%-%28 ఏళ్ల మధ్య విద్యార్థులు, ఐటీ ఉద్యోగులపై తీవ్ర ప్రభావం చూపుతోంది, మానసిక అస్థిరత, కుటుంబ విచ్ఛిన్నం, ఆర్థిక సంక్షోభానికి దారితీస్తోంది. రేవ్ పార్టీలు, అర్బన్ లైఫ్‌స్టైల్ డ్రగ్ వినియోగాన్ని మరింత ప్రోత్సహిస్తున్నాయి.

డ్రగ్స్ సంక్షోభం వ్యవస్థాగత లోపాలను బహిర్గతం చేస్తుంది. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం యొక్క అమలులో లోపాలు, సమన్వయ లోపం డ్రగ్ సరఫరాను నియంత్రించడంలో అడ్డంకులుగా ఉన్నాయి.

సమస్యను పరిష్కరించడానికి సమగ్ర విధానం అవసరం. పాఠశాలలు, కళాశాలలలో డ్రగ్ అవేర్‌నెస్ విద్యను పాఠ్యాంశంలో భాగం చేయాలి, పంజాబ్‌లోని బడ్డీ ప్రోగ్రామ్ వంటి కార్యక్రమాలను తెలంగాణలో అమలు చేయవచ్చు. జిల్లా స్థాయిలో మానసిక ఆరోగ్య సేవలతో కూడిన డీ-అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం, ఉచిత కౌన్సెలింగ్ అందించడం అవసరం. డార్క్ వెబ్ ద్వారా డ్రగ్ లావాదేవీలపై ప్రత్యేక సైబర్ సెల్‌లను ఏర్పాటు చేసి, నిఘాను బలోపేతం చేయాలి. యువతకు ఉపాధి, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా సానుకూల దిశలో నడిపించాలి. ఎన్‌డీపీఎస్ చట్టాన్ని మరింత పటిష్టంగా అమలు చేయడం, డ్రగ్ ట్రాఫికింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవడం కీలకం. మానసిక ఆరోగ్య సేవలను అందరికీ అందుబాటులోకి తీసుకురావడం, డ్రగ్ వ్యసనంపై సామాజిక స్టిగ్మాను తగ్గించడం అవసరం.

డ్రగ్స్ వినియోగం యువతను నాశనం చేస్తున్న సమస్యగా మారుతోంది. ఈ సంక్షోభం సామాజిక ఒత్తిళ్లు, డిజిటల్ లభ్యత, వ్యవస్థాగత లోపాల ఫలితం. ప్రభుత్వం, సమాజం, కుటుంబాలు కలిసి పనిచేస్తేనే ఈ సమస్యను అధిగమించవచ్చు. అవగాహన కార్యక్రమాలు, కఠిన చట్ట అమలు, యువతకు సానుకూల అవకాశాలు అందించడం ద్వారా ఈ సమస్యను నిర్మూలించవచ్చు. యువత దేశ భవిష్యత్తు%ౌ%.వారిని రక్షించడం మనందరిది సామూహిక బాధ్యత. నశించే కలల చీకటి వెనుక వెలుగు చూపే అరుణోదయం కోసం, ప్రతి ఒక్కరూ తమ స్థాయిలో మేల్కొనాలి.

మౌనం గెలిచే రోజు - మత్తు చెలరేగుతుంది. చైతన్యం గెలిచే రోజు - యువత వెలుగులోకి వస్తుంది.యువతను రక్షించడమే నిజమైన దేశ భక్తి.

చీకటి మత్తును తొలగించే వెలుగు కావాలి...ఆ వెలుగే మన అరుణోదయం కావాలి!...

**మహమ్మద్ అక్బర్**
**జర్నలిస్ట్, నవభూమి దినపత్రిక**
**మహబూబాబాద్ టౌన్**

## వర్షపు విపత్తులు


జూలై-ఆగస్టు నెలలు భారతదేశంలో వర్ష కాలంగా గుర్తించబడతాయి. ఈ కాలంలో గగనతలాన్ని కమ్మేసే మేఘాలు, పెనుభారాన్ని మోసుకొచ్చే గాలులు, కురిసే వర్షాలు - ఇవన్నీ ప్రకృతితో మన అనుబంధాన్ని తెలియజేస్తాయి. కానీ అదే సమయంలో... ఇదే వర్షం కొన్నిసార్లు ఊహించని విధంగా విధ్వంసాన్ని తెచ్చిపెడుతుంది. గ్రామీణం నుంచి నగరాల దాకా సమగ్ర ప్రభావాన్ని చూపే భారీ వర్షాలు, వరదలు మన జీవితాల్లో ఎన్నో సమస్యలకు దారితీస్తున్నాయి. ఈ నేపథ్యంలో "జాగ్రత్తలు" అనేవి కాలానుగుణంగా అత్యవసరమైన పదంగా మారింది.

పెరుగుతున్న వాతావరణ మార్పుల కారణంగా భారత్‌లో మాన్సూన్ వ్యవస్థలో గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయి. సాధారణంగా జూన్ నుంచి సెప్టెంబర్ వరకు వర్షాలు కురవాల్సి ఉండగా, ఇటీవల కొన్ని రాష్ట్రాల్లో అకస్మాత్తుగా భారీ వర్షాలు పడి జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణ భారత రాష్ట్రాల్లో - తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ - గత ఐదేళ్లలో కంటే అధిక వర్షపాతం నమోదవుతోంది. ఇది ప్రాణనష్టానికి, ఆస్తినష్టానికి దారితీస్తోంది. నదులు పొంగిపొర్లటం, చెరువులు వర్షాన్ని మింగలేక పొంగిపడటం, రహదారులు కుప్పకూలటం, కరెంటు సరఫరాలో అంతరాయం ఇవన్నీ వర్షాల వల్ల కలిగే ప్రత్యక్ష దుష్పరిణామాలు.నగరాల్లో వర్షాలు పడితే తడవాల్సింది భూమి కాదు జనతా జీవితం. వర్షపు నీరు నిలవడానికి డ్రైనేజీలు బేసిక్లే బహుళమైన నగరాల్లో, తక్కువ సమయంలో పడే భారీ వర్షం మానవ నిర్మిత వ్యవస్థలను శాసిస్తుంది. ముఖ్యంగా హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాల్లో ఏటా వర్షాకాలం వచ్చిందంటే వాహనదారులకు నిద్ర లేకుండా ఉంటుంది. గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లు, రోడ్లపై నిలిచిపోయే వాహనాలు, నీటిలో చిక్కుకునే ప్రజలు - ఇవన్నీ మనం ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నాం. పూర్వంగా ప్రణాళికలు లేకుండా మురుగు కాల్వలపై నిర్మించిన రహదారులు, నివాస సముదాయాలు ఇప్పుడు ప్రమాదానికి పునాది అవుతున్నాయి.

**సహాయ మీడియా**

భక్తి

## అత్తాకోడళ్ల కథ



బైబిల్‌లో రూతు కథ ఆసక్తికరంగా ఉంటుంది. అత్తాకోడళ్ళకు సరిపడదనేది లోకంలో స్థిరపడిన సాధారణమైన అభిప్రాయం. అందుకు భిన్నంగా... 'అత్తా కోడళ్ళంటే ఇలా ఉండాలి' అనేలా నయోమి, రూతు దర్శనమిస్తారు. కోడలిలో అత్తకు బాధ్యత కలిగిన...

బైబిల్‌లో రూతు కథ ఆసక్తికరంగా ఉంటుంది. అత్తాకోడళ్ళకు సరిపడదనేది లోకంలో స్థిరపడిన సాధారణమైన అభిప్రాయం. అందుకు భిన్నంగా... 'అత్తా కోడళ్ళంటే ఇలా ఉండాలి' అనేలా నయోమి, రూతు దర్శనమిస్తారు. కోడలిలో అత్తకు బాధ్యత కలిగిన కుమార్తె కనిపిస్తే, కోడలికి అత్తలో ప్రేమమయి అయిన తల్లి గొంతు వినిపిస్తుంది.బెత్లెహేములో నివసించే నయోమి యూదు మతాన్ని అనుసరించే వ్యక్తి. ఆమెకు ఇద్దరు కుమారులు. భర్త మరణంతో, అనంతరం తమ ప్రాంతంలో కరువు ఏర్పడడంతో... బిడ్డలతో పాటు మోయబ్ ప్రాంతానికి బతుకుతెరువు కోసం నయోమి పయనమైంది. అక్కడే తన పిల్లలకు పెళ్ళిళ్ళు చేసింది. ఆమె కోడళ్ళు ఇద్దరూ యూదులు కాదు. అన్యమతస్తులు. కాగా... కొన్నాళ్ళకు నయోమి కుమారులు ఇద్దరూ మరణించారు. వారికి పిల్లలు లేరు. ఈ పరిస్థితుల్లో... తన సొంత ప్రాంతమైన బెత్లెహేముకు తిరిగి వెళ్ళాలని నయోమి నిర్ణయించుకుంది. కోడళ్ళను పిలిచి... "మీరు ఇక్కడే... మీ తల్లితండ్రుల దగ్గర ఉండిపోండి" అని చెప్పింది. ఒక కోడలు సరేనంది. మరో కోడలైన రూతు "నీవే నాకు తల్లివి, తండ్రివి. వయసు ఉడిగిపోయి, కష్టపడలేని సమయంలో నిన్ను ఇలా విడవడం నాకు భావ్యం కాదు. నిన్ను ఒక్కదాన్నీ విడిచిపెట్టి నేను ఎలా సంతోషంగా ఉండగలను? నీతోనే నా పయనం, నా జీవనం. నీ దేవుడే నా దేవుడు" అని చెప్పింది.

అలా అత్తగారితోనే ఉండిపోయిన రూతు... క్రమంగా అత్త కొలిచే దేవుణ్ణి ఇష్టపడింది. నయోమిని తన తల్లిలా ప్రేమించింది. నయోమి కూడా తన కోడలు గురించి, ఆమె భవిష్యత్తు గురించి ఆలోచించడం మొదలుపెట్టింది.బెత్లెహేముకు తిరిగి వచ్చిన తరువాత... తన దగ్గర బంధువైన బోయజు అనే పెద్ద భూస్వామి పొలంలో పరిగె ఏరుకోవడానికి రూతును నయోమి పంపింది. రూతు అందం, వినయం, అత్తగారికి చేసే సేవలు చూసి మనసు పడిన బోయజు... ఆమెను తన భార్యగా స్వీకరించాడు. వారికి ఒక కుమారుడు. ఆ రూతు... క్రీస్తు వంశానికి పూర్వీకురాలు. ఆ అత్తాకోడళ్ళ మధ్య ప్రగాఢంగా అల్లుకుపోయిన బంధాలు ప్రతి కుటుంబంలో నెలకొనవలసిన విలువైన ఆదర్శంగా ఎప్పటికీ నిలుస్తాయి.



# ఈస్ట్ పాకిస్థాన్ శరణార్థులకు భూ యాజమాన్య హక్కులు... యోగి సంచలన నిర్ణయం



**నొయిడా-నవభూమి:** ఈస్ట్ పాకిస్థాన్ (ప్రస్తుత బంగ్లాదేశ్) నుంచి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి దశాబ్దాల కింద శరణార్థులుగా వచ్చి ఇక్కడే స్థిరపడిన వారికి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ శుభవార్త చెప్పారు. వారికి భూ యాజమాన్య హక్కులు మంజూరు చేయాలంటూ అధికారులను ఆదేశించారు. సోమవారంనాడు జరిగిన అత్యున్నత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇది కేవలం భూ బదలాయింపు కాదని, శరణార్థి కుటుంబాల దశాబ్దాల పోరాడానికి గుర్తించేందుకు నైతక, జాతీయ భాధ్యతతో తీసుకున్న నిర్ణయమని అభివర్ణించారు. రాష్ట్రంలోని పిలిభిత్, లఖింపూర్ ఖేరి, బిజ్నూర్, రాంపూర్ జిల్లాల్లో సుమారు 10,000 మంది బంగ్లా శరణార్థులు ఉన్నారు. ఈస్ట్ పాకిస్థాన్ నుంచి 1960-1975 మధ్య కాలంలో వేలాది మంది శరణార్థులుగా వచ్చి యూపీలో పునరావాసం పొందుతున్నట్టు అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. ట్రాన్సిట్ శిబిరాలకు వారిని తరలించిన తర్వాత చాలామందికి వ్యవసాయ భూములను కేటాయించామని, అయితే చట్టబద్ధమైన యాజమాన్య హక్కులు కల్పించేందుకు లీగల్ చిక్కులు, అసంపూర్తి పేపర్ వర్క్, నిర్వహణా లోపాలు అడ్డుపడుతున్నాయని వివరించారు. కాగా, యాజమాన్య హక్కులను రెగ్యులరైజ్ చేసేందుకు అవసరమైన కొత్త లీగల్ మెకానిజం కనుగొనాలని అధికారులను సీఎం ఆదేశించారు. చిరకాలంగా స్థిరపడిన కుటుంబాల పేర్లను నిర్దిష్ట సమయంలోగా రెవెన్యూ రికార్డుల్లో చేర్చాలని జిల్లా మెజిస్ట్రేట్లకు సూచించారు. భూములు అందుబాటులో లేకుంటే ప్రత్యామ్నాయ స్థలాలను చూపించి శరణార్థులు గౌరవప్రదంగా జీవించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9
హైదరాబాద్
మంగళవారం
22 । జులై । 2025

## పహల్గాం ఉగ్రదాడిపై చర్చకు విపక్షాల పట్టు.. లోక్‌సభ వాయిదా

**పహల్గాం-నవభూమి:** ఉగ్రదాడి ఘటన పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ను కుదిపేస్తోంది. ఈ ఘటనపై చర్చించాలంటూ విపక్షాలు లోక్‌సభలో నిరసనకు దిగారు. దీంతో దిగువ సభలో గందరగోళం నెలకొంది. స్పీకర్ ఎంత చెప్పినా సభ్యులు వినకపోవడంతో లోక్‌సభను వాయిదా వేయాల్సి వచ్చింది. నేటి నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఉదయం 11 గంటలకు ఉభయ సభలు సమావేశమయ్యాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత మొదటిసారిగా ఉభయ సభలు సమావేశమయ్యాయి. విపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు పలు వాయిదా తీర్మానాలు ప్రవేశపె ట్టారు. పహల్గాం ఉగ్రదాడి ఆపరేషన్ సిందూర్‌పై చర్చించాలం టూ పట్టుబ ట్టారు. అయితే, ప్రశ్నోత్తరాల తర్వాత వాయిదా తీర్మానాలపై చర్చ చేపడదామని స్పీకర్ ఓంబిర్లా నచ్చజెప్పారు. అయినా ఎంపీలు వినిపిం చుకోలేదు. సభలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. విపక్షాల నిరసనల మధ్యే లోక్‌సభ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

## చిన్నపిల్లలు ఉంటే రెట్టింపు జరిమానా..

### ట్రాఫిక్ ఉల్లంఘనలపై కేంద్ర రవాణా శాఖ ప్రతిపాదన



**న్యూఢిల్లీ-నవభూమి:** చిన్న పిల్లలతో కలిసి వెళ్తూ ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడే వాహనదారులకు రెట్టింపు జరిమానా విధించాలని రోడ్డు రవాణా శాఖ ప్రతిపాదించింది. వాహనదారుల భద్రతను, జవాబుదారీ తనాన్ని పెంపొందించేందుకు ఈ ప్రతిపాదన చేసింది. అంతేకాకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటింపు లేదా ఉల్లంఘన ఆధా రంగా డ్రైవర్లకు 'మెరిట్ అండ్ డీమెరిట్' (పాజి టివ్, నెగెటివ్) పాయింట్ సిస్టమ్ను కూడా ప్రతిపాదించింది. మోటార్ వాహనాల చట్టం సవరణల్లో భాగంగా ప్రతిపాదించిన ఈ మార్పులపై అన్ని మంత్రిత్వ శాఖలు తమ అభిప్రాయాన్ని తెలియజేయాలని రోడ్డు రవాణా శాఖ కోరినట్టు తెలుస్తున్నది. వాహనాల్లో చిన్నపిల్లలను తీసుకెళ్లే అనేక మంది తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, పాఠశాలల బస్సు డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోవడాన్ని దృష్టిలో పెట్టుకుని జరిమానాను రెట్టింపు చేయాలని ప్రతిపాదించినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే ట్రాఫిక్ నేరాల జాబితాలోని ఏదైనా అంశాన్ని నిష్పాక్షికంగా అమలు చేయకపోతే అది కేవలం ఓ 'మెరుగైన' శాసన కసరత్తుగా, అవినీతికి మరొక మార్గంగా మిగిలిపోతుందని రోడ్డు భద్రతా నిపుణుల్లో ఓ వర్గం భావిస్తున్నది. మోటార్ వాహనాల చట్టం 100కుపైగా నేరాలను కవర్ చేస్తున్నప్పటికీ వేగంగా వాహనాలు నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, రెడ్ సిగ్నల్ జంపింగ్, ఫోన్లను ఉపయోగించడం, సీట్ లేదా హెల్మెట్ ధరించకపోవడం లాంటి అరడజను నేరాల్లో మాత్రమే ట్రాఫిక్ పోలీసులు డ్రైవర్లను పట్టు కొని శిక్షించగలుగుతున్నారని వారు గుర్తు చేస్తున్నారు.

## రాజకీయ పోరాటాలతో మీకేం పని.. ఈడీకి సుప్రీంకోర్టు హెచ్చరిక



**న్యూఢిల్లీ-నవభూమి:** వివాదాస్పద మైసూరు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతికి ఈడీ జారీ చేసిన సమన్లను హైకోర్టు కొట్టివేయడాన్ని సుప్రీంకోర్టు సోమవారంనాడు సమర్థించింది. హైకోర్టు నిర్ణాయాన్ని సవాలు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌పై తీవ్ర అగ్రహం వ్యక్తం చేసింది. రాజకీయ ప్రయోజనాల కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడవద్దని హెచ్చరించింది. ట్రయిల్ కోర్టు తీర్పును హైకోర్టు సింగిల్ జడ్జి సమర్థించారని, అంటే ఈ కేసులో ఇప్పటికే రెండు స్థాయిల్లో తీర్పులు వచ్చాయని, వాటిని ఈడీ తిరగరాసే ప్రయత్నం చేయడం అనవసరమని సీజేఐ బీఆర్ గవాయ్, జస్టిస్ కె వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. రాజకీయ పోరాటాలతో మీకేం పని అని ఈడీని నిలదీసింది. 'రాజకీయ పోరాటాలు ప్రజల మధ్య జరగనీయండి. మీకేం పని?' అని అని ధర్మాసనం ప్రశ్నించింది. దీంతో తమ పిటిషన్‌ను వెనక్కి తీసుంటామని ఈడీ తరపు హాజరైన సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు ధర్మాసనానికి తెలిపారు. దీంతో పిటిషన్‌ను కొట్టేస్తున్నట్టు సీజేఐ ప్రకటించారు. కర్ణాటకలోని 14 ప్లాట్లను ముడా కేటాయించడంలో అవకతవకలు జరిగాయన్నది ఈడీ ఆరోపణగా ఉంది. మనీలాండరింగ్ విచారణలో భాగంగా పార్వతి సిద్ధరామయ్య, రాష్ట్ర మంత్రి బి.సురేష్‌కు ఈడీ సమన్లు జారీ చేసింది. భూముల లావాదేవీల ద్వారా అధికార దుర్వినియోగం, అక్రమ ప్రయోజనాలు పొందారని ఈడీ అనుమానిస్తోంది. అయితే ఈడీ సమన్లను 2025 మార్చిలో కర్ణాటక హైకోర్టు కొట్టివేసింది. పీఎంఎల్ఏ కింద ప్రొసీడింగ్‌కు అవసరమైన సాక్ష్యాలు, లీగల్ గ్రౌండ్స్ లేవని కోర్టు తన తీర్పులో పేర్కొంది. రాజకీయ ప్రయోజనాల్లేవు, భూములు సరెండర్ చేశాం.. హైకోర్టు ముందు విచారణలో పార్వతి సిద్ధరామయ్య తమ వాదనను వినిపించారు. స్వచ్ఛందంగా 14 భూములను తాను వదులుకున్నానని, తాను ఎలాంటి నేరపూరిత ప్రయోజనాలు పొందలేదని చెప్పారు. ఆమె లీగల్ టీమ్ సైతం ఎలాంటి అక్రమాలు జరగలేదని, ఈడీ సమన్లు నిరాధారమని కోర్టుకు విన్నవించింది. ఈ అభిప్రాయాలతో హైకోర్టు ఏకీభవించింది. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సైతం సమర్ధించింది. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పులో ఎలాంటి తప్పిదం కనిపించడం లేదని పేర్కొంటూ పిటిషన్‌ను సీజేఐ కొట్టివేశారు.

## త్వరలో స్వదేశీ మలేరియా వ్యాక్సిన్

**న్యూఢిల్లీ-నవభూమి:** మలేరియా రహిత భారత్ దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. ప్రాణాంతక మలేరియాను రూపుమాపడానికి స్వదేశీ వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు భారత్ ప్రయత్నాలు చేస్తోంది. ఐసీఎంఆర్, భువనేశ్వర్‌లోని ప్రాంతీయ వైద్య పరిశోధన కేంద్రం (ఆర్ఎంఆర్‌సీబీబీ), జాతీయ మలేరియా పరిశోధన సంస్థ (ఎన్ఐఎంఆర్)... నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునాలజీ బయోటెక్నాలజీ విభాగం (డీబీటీ-ఎన్ఐఐ) భాగస్వామ్యంతో అడ్‌ఫాల్సీవ్యాక్స్ అనే రీకాంబినెంట్ చిమెరిక్ మలేరియా వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేస్తోంది. అడ్‌ఫాల్సీవ్యాక్స్ అనేది.. మలేరియాకు కారణమయ్యే ప్లాస్మోడియం పరాన్నజీవిలోని రెండు క్లిష్ట దశలను లక్ష్యంగా చేసుకోవడానికి ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తున్న స్వదేశీ మలేరియా వ్యాక్సిన్. ఐసీఎంఆర్ అభివృద్ధి చేస్తున్న ఈ వ్యాక్సిన్ ప్రీక్లినికల్ దశలో అద్భుత ఫలితాలు అందించిందని, ఇప్పటికే ఉన్న సింగిల్ స్టేజ్ వ్యాక్సిన్ల కంటే అడ్‌ఫాల్సీవ్యాక్స్‌తో మరిన్ని ప్రయోజనాలు కలుగుతాయని డేటా వెల్లడిస్తోంది.

# 'ధర్మస్థల' కేసు ఏంటి? ఎవరిని కాపాడాలని చూస్తున్నారు?



**ధర్మస్థల-నవభూమి:** "మహిళల మృతదేహాలు చాలా వరకు లో దుస్తులు కూడా లేకుండా ఉన్నాయి. అందులో చాలా మంది అమ్మాయిలు, మహిళలే ఉన్నారు. కొన్ని మృతదేహాలపై లైంగిక దాడి, హింసకు సంబంధించిన గాయాలున్నాయి. వారిపై హత్యాచారం జరిగినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. ఇలాంటి 100కు పైగా మృతదేహాలను నేను పూడ్చిపెట్టాను." ఒక్కసారిగా దేశం మొత్తాన్ని ఉలిక్కిపాటుకు గురి చేసిన మాటలివి. కర్ణాటకలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మస్థలలో.. గతంలో పని చేసిన ఓ పారిశుద్ధ్య కార్మికుడు (విజిల్‌బ్లోయర్) జూన్ 3న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అందులో తాను 1998 నుంచి 2014 వరకు వందకుపైగా మృతదేహాలను పూడ్చిపెట్టినట్లు పోలీసులకు చెప్పాడు. అందుకు సంబంధించిన కొన్ని ఫొటోలు కూడా సమర్పించాడు. అయితే ఈ విజిల్‌బ్లోయర్ వాంగ్మూలంపై అనేక ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

సిట్ విచారణ..ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ దారుణానికి పాల్పడ్డవారిని కఠినంగా శిక్షించాలని ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరిపించాలనే డిమాండ్లు ఊపందుకున్నాయి. ఈ క్రమంలో ఈ కేసును డీజీపీ ప్రనభ్ మొహంతీ నేతృత్వంలో ఐపీఎస్ అధికారులు ఎంఎన్ అనుచెత్, సౌమ్యలత, జితేంద్ర కుమార్ దయమ విచారణ చేపట్టారు. అయితే చనిపోయినవారంతా ఎవరు? ఏమాత్రం అనుమానం రాకుండా 100 మందికి పైగా మృతదేహాలను ఎలా ఖననం చేశారు? ఇన్ని రోజులు మౌనంగా ఉండి పారిశుద్ధ్య కార్మికుడు ఇప్పుడే ఎందుకు చెప్పాడు? ధర్మస్థల క్షేత్ర పవిత్రతను దెబ్బతీయడానికే ఇదంతా చేస్తున్నారనే వాదనేంటి? ప్రభుత్వం ఎవరిని రక్షిస్తోంది? అనే ప్రశ్నలు ఈ కేసులో వ్యక్తమవుతున్నాయి.

**పాఠశాల దుస్తుల్లో బాలికలు**

ఈ కేసులో శానిటేషన్ వర్కర్ (విజిల్‌బ్లోయర్) చేసిన ఫిర్యాదు.. అందులో అతడు చెప్పిన విషయాలే కీలకంగా మారాయి. తాను చాలా మంది ఆడపిల్లల మృతదేహాలు నేత్రావతి నది సమీప ప్రాంతాల్లో ఖననం చేశాని.. అందులో మైనర్లు కూడా ఉన్నట్లు చెప్పాడు. కొంతమంది బాలికలు పాఠశాల దుస్తుల్లో కనిపించినట్లు.. ఇంకొంత మంది మృతదేహాలు.. లో దుస్తులు కూడా లేకుండా, శరీరాలపై లైంగిక దాడుల, కొట్టినట్లు ఆనవాళ్లు కనిపించాయని చెప్పాడు. మహిళలపై ఎంత ఘోరమైన దాడులకు పాల్పడ్డారో దీన్ని బట్టే అర్థం చేసుకోవచ్చు.

**చనిపోయింది ఎవరు?**

మృతదేహాలను ఖననం చేసిన ప్రదేశాల నుంచి విజిల్ బ్లోయర్.. పుర్రె వంటి శరీర అవశేషాలను బయటకు తీశాడు. ఇంకొన్ని ప్రదేశాలకు కూడా విచారణ అధికారులను తీసుకెళ్తానని చెప్పాడు. అయితే ఇప్పటివరకు చనిపోయింది ఎవరో, మృతదేహాల అవశేషాలు ఎవరివో తెలిసిరాలేదు. వీటిపై సిట్ అధికారులు డీఎన్ఏ అనాలసిస్, స్కెలిటల్ ఫోరెన్సిక్ ( పరీక్షలు చేసి.. మృతదేహాలు ఎవరివి, వాళ్లు ఎలా చనిపోయి ఉంటారని అంచనాకు రావాలి. అప్పుడే చనిపోయింది ఎవరో కచ్చితంగా చెప్పేందుకు అవకాశం లభిస్తుంది. ఇంకా పూర్తిగా మృతదేహాలను వెలికి తీయకపోవడం.. అప్పుడే విజిల్‌బ్లోయర్ ఇచ్చిన స్టేట్‌మెంట్లు బయటకు లీక్ కావడంతో.. విచారణలో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చనిపోయింది ఎవరో కచ్చితంగా తెలియకున్నా.. అందులో తమవారు ఉంటారని మిస్సైన కొందరి వ్యక్తుల కుటుంబ సభ్యులు అనుకుంటున్నారు. 2003లో ఫ్రెండ్స్‌తో కలిసి ధర్మస్థలకు వెళ్లిన ఓ ఎంబీబీఎస్ విద్యార్థిని అనన్య భట్ తిరిగిరాలేదు. ఇప్పుడు ఆమె కుటుంబ సభ్యులు.. అనన్య కేసును కూడా విచారించాలని కోరుతున్నారు. ఇలాగే ఇంకొన్ని బాధిత కుటుంబాలు కూడా విజ్ఞప్తి చేస్తున్నాయి. అయితే ఈ కేసులో ఎక్కువ మంది మహిళలు ఉండటంతో ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయాలని డిమాండ్లు పెరిగాయి. మొదట్లో సిట్ విచారణపై కర్ణాటక ప్రభుత్వం ఆసక్తి చూపలేదు. కానీ తర్వాత ప్రజల నుంచి ఒత్తిడి పెరగడంతో సిట్ ఏర్పాటు చేసింది.

**విజిల్‌బ్లోయర్ టైమింగ్‌పై అనుమానాలు..!**

ఈ ఘటనలు జరిగి ఇన్నేళ్లు అయితే.. విజిల్‌బ్లోయర్ ఇప్పుడే ఎందుకు తన తప్పును ఒప్పుకోవాల్సి వచ్చింది అనే ప్రశ్నలు అందరి మదిలో వ్యక్తమవుతున్నాయి. అయితే తాను వందకు పైగా మృతదేహాలను దహనం చేయడం, పాతిపెట్టాల్సి వచ్చిందని.. అలా చేయమని తనపై ఒత్తిడి తెచ్చారని విజిల్‌బ్లోయర్ తెలిపాడు. చనిపోయిన వారికి గౌరవం, వారి ఆత్మలకు శాంతి చేకూర్చడానికి.. తన ప్రాణాలను పణంగా పెట్టి ఇప్పుడు చెబుతున్నానని అన్నాడు. తన కుటుంబంలోని ఓ బాలికను ఉన్నతాధికారులు వేధించారని.. అందుకే 2014లో ధర్మస్థల నుంచి వెళ్లిపోయానని తెలిపాడు. తప్పు చేశాననే భావన తనను మనశ్శాంతిగా ఉండనివ్వడం లేదని పేర్కొన్నాడు.

**శానిటేషన్ వర్కర్‌కు ఇలా చేయమని చెప్పిందెవరు?**

జులై 11న విజిల్‌బ్లోయర్ బెల్తంగడి కోర్టులో హాజరై వాంగ్మూలం ఇచ్చాడు. గతంలో ఓ ప్రాంతంలో తాను ఖననం చేసిన మృతదేహం అవశేషాలు సహా.. దానికి సంబంధించిన ఫొటోలను కోర్టుకు సమర్పించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఆ సమయంలో కొందరి పేర్లు కూడా బయటపెట్టినట్లు సమాచారం. ఆ హత్యలు చేసింది వారేనని ఆరోపించినట్లు తెలుస్తోంది. దీంతో వారెవరై ఉంటారనే ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది.

**ఏమాత్రం అనుమానం రాకుండా మృతదేహాలను ఎలా పాతిపెట్టాడు?**

"మేము నిన్ను ముక్కలుగా నరికేస్తాం. నీ శరీరాన్ని మిగిలిన వారిలాగే కప్పిపెడతాం" అంటూ తనను బెదిరించారని శానిటేషన్ వర్కర్ చెప్పాడు. ఈ భయంతో తాను ఎవరికీ చెప్పలేదన్నాడు. మరో విషయం ఏంటంటే.. మృతదేహాలను పాతిపెట్టడానికి నేత్రావతి నది సమీపంలోని ప్రాంతాలను సెలెక్ట్ చేసుకున్నాడీ విజిల్‌బ్లోయర్. అక్కడైతేనే డెడ్ బాడీలు త్వరగా, గుర్తుపట్టలేకుండా కుళ్లిపోతాయని. అంతేకాకుండా నిందితులు చంపేసి.. మృతదేహాలను గుర్తుపట్టరాకుండా చేశారట. అందుకే మృతదేహాల ముఖాలపై యాసిడ్ పోసిన, బట్టలు చింపేసిన ఆనవాళ్లు కనిపించాయి. ఇక ఆ శానిటేషన్ వర్కర్ దళిత వర్గానికి చెందినవాడు కాబట్టి.. లో ప్రొఫైల్ ఉండటం వల్ల అతడు ఏం చేస్తున్నాడో ఎవరూ గమనించలేకపోయారని తెలుస్తోంది.

**ఈ కేసులో ప్రభుత్వం ఎవరిని కాపాడుతోంది?**

ఈ కేసులో ధర్మస్థల క్షేత్రానికి సంబంధించిన కొందరు శక్తిమంతమైన వ్యక్తులు.. ఈ హత్యలకు కారణమని, విచారణను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విచారణ అధికారులపై కూడా ఒత్తిడి తెస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. వీరిని ప్రభుత్వం కాపాడుతోందని కూడా ఆరోపణలు చేస్తున్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా రిపోర్ట్ ప్రకారం.. ఈ ఆరోపణలపై కర్ణాటక ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండు స్పందించారు. ఈ కేసులో తాము ఎవరినీ రక్షించడం లేదని చెప్పారు. దీన్ని సంచలనాత్మకం చేయాలని తాము అనుకోవడం లేదని.. కానీ ఈ కేసులో నిజాలు బయటకు రావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. శానిటేషన్ వర్కర్ చెప్పిన విషయాలు షాక్‌కు గురిచేశాయని.. ఇవి నిజమని తేలితే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

**ధర్మస్థల శక్తిని తక్కువ చేయడానికి ఇదంతా చేస్తున్నారా?**

ధర్మస్థల ప్రైంత్‌ను తక్కువచేయడానికే ఇలా టార్గెట్ చేస్తున్నారని బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవి అన్నారు. ఈ ప్రాంతం ఓ మతానికి సంబంధించి పవిత్రమైన ప్రదేశమని, ప్రజలు విశ్వసించే స్థలమని అన్నారు. ఆలయాలు దశాబ్దాల నుంచి ఎవరిపై వివక్ష చూపడం లేదని.. దీన్ని అవమానించే చర్యలు ఏళ్ల నుంచి జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ ప్రాంతం.. ప్రజల్లో సోదరభావాన్ని, భక్తి, సమానత్వాన్ని పెంపొందిస్తున్నందుకే.. ఇలా కుట్రలో భాగంగా టార్గెట్ చేశారని ఆరోపణలు గుప్పించారు. విజిల్‌బ్లోయర్‌గా మారిన శానిటేషన్ వర్కర్ చెప్పిన విషయాలన్నీ నిజమైతే.. దేశ చరిత్రలో జరిగిన అత్యంత దారుణమైన ఘటనల్లో ఇది ఒకటిగా నిలిచిపోతుంది. మహిళలపై ఇంతటి దారుణాలకు ఒడిగట్టిన వారిని అత్యంత కఠినంగా శిక్షించాలి. ఈ కేసులో సిట్ విచారణ జరుగుతున్నా కొద్దీ.. మరిన్ని విషయాలు బయటపడతాయి. సాక్షులు ప్రభావితం అయితే కేసు నీరుగారిపోతుంది. కాబట్టి ఆ వర్కర్‌కు పటిష్ఠమైన భద్రత కల్పించాల్సిన బాధ్యత కర్ణాటక ప్రభుత్వానిదే. విచారణ అధికారులపై ఒత్తిడి లేకుండా చూసుకోవాలి. నిస్పక్షపాతంగా విచారణ జరగాలి. లేకపోతే.. ప్రజాగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదు.

## 15ఏళ్ల బాలికను కట్టేసి.. పెట్రోల్ పోసి నిప్పు



**పూరీ-నవభూమి:** ప్రొఫెసర్ లైంగిక వేధింపులను భరించలేక ఓ విద్యార్థిని ఆత్మాహుతికి పాల్పడిన ఘటన మరువక ముందే ఒడిశాలో మరో దారుణం జరిగింది. 15 ఏళ్ల బాలికపై ముగ్గురు దుండుగులు పెట్రోల్ పోసి, నిప్పంటించారు. పూరీ జిల్లాలోని బయబర్ గ్రామంలో శనివారం ఈ ఘటన జరిగింది. 70% కాలిన గాయాలతో సదరు బాలిక ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. బాలికకు మెరుగైన వైద్యం కోసం ఆదివారం ఆమెను భువనేశ్వర్ ఎయిమ్స్ నుంచి ఢిల్లీ ఎయిమ్స్‌కు విమానంలో తరలించారు. శనివారం ఉదయం బాలిక తమ ఇంటి నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్తుండగా ముగ్గురు దుండగులు ఆమెను అడ్డగించారు. కిడ్నాప్ చేసి భార్గవ నది ఒడ్డుకు తీసుకువెళ్లారు. అక్కడ ఆమెను కట్టేసి, ఆమె ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. బాలిక గట్టిగా కేకలు వేయడంతో భయపడి పారిపోయారు. పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన ఒడిసాలో సంచలనం సృష్టించింది. ఘటనపై ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ స్పందిస్తూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయన్నారు.

# నిబద్ధత కలిగిన మార్గదర్శకుడు కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్



**తిరువనంతపురం-నవభూమి:** కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం సీనియర్ నేత వీఎస్ అచ్యుతానందన్(101) కన్నుమూశా రు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తిరువనంతపురం మెడికల్ కాలేజీలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. కమ్యూనిస్టు ఉద్యమాల్లో ఆయన చేసిన సేవలకు గుర్తుగా నిలిచారు. అచ్యుతానందన్ మృతికి రాజకీయ ప్రముఖులు సంతాపం తెలిపారు, ఆయన ప్రజాస్వామ్యం పట్ల అపార నిబద్ధత కలిగిన వ్యక్తి అని కొనియాడారు. అచ్యుతానందన్ ఉద్యమ ప్రస్థానంలో కీలకమైందిన పునప్రా- వేలయార్ ఉద్యమం. కేరళ మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్ట్ నేత వీఎస్ అచ్యుతానందన్ సోమవారం కన్నుమూశారు. ప్రస్తుతం ఆయన వయసు 101 ఏళ్లు కాగా.. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జూన్ 23న గుండెపోటుకు గురికావడంతో చికిత్స కోసం ఆయనను కుటుంబసభ్యులు తిరువనంతపురం మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆయన ఐసీయూలోనే ఉన్నారు. వైద్యుల చికిత్స చేస్తున్నా.. రోజు రోజుకూ ఆయన ఆరోగ్యం క్షీణిస్తూ వచ్చింది. ఏడుగురు వైద్యుల బృందం ఆయనను నిరంతరం పర్యవేక్షించింది. అయితే, చివరకు పరిస్థితి విషమించి సోమవారం మధ్యాహ్నం అచ్యుతానందన్ తుదిశ్వాస విడిచారు. వీఎస్ అచ్యుతానందన్ 2006 నుంచి 2011 వరకూ కేరళ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ..కమ్యూనిస్టు ఉద్యమానికి జీవితం అంకితం చేసిన నేతగా, ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాట యోధునిగా గుర్తింపు పొందారు. 1923లో అలప్పూజ జిల్లా పునప్రాలోని ఒక సాధారణ వ్యవసాయ కూలీ కుటుంబంలో జన్మించిన అచ్యుతానందన్, బాల్యంలో కార్మిక హక్కుల కోసం పోరాడే కమ్యూనిస్ట్ ఉద్యమంలోకి ప్రవేశించారు. ట్రావెన్‌కోర్ దివాన్.. అమెరికన్ మోడల్ ప్రభుత్వ ఏర్పాటు ప్రయత్నాలకు వ్యతిరేకంగా జరిగిన పునప్రా-వేలయార్ ఉద్యమానికి అచ్యుతానందన్ నాయకత్వం వహించారు. 'కేరళ అక్టోబర్ విప్లవం'గా గుర్తింపు పొందిన ఈ ఉద్యమంలో అచ్యుతానందన్ క్షేత్రస్థాయిలో పనిచేస్తూ ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. దీంతో ఆయనను అరెస్ట్ చేసిన పోలీసులు.. కస్టడీలో చిత్రహింసలకు గురిచేశారు. ఈ సంఘటన అచ్యుతానందన్ జీవితాన్ని మలుపు తిప్పింది. 1964లో భారత కమ్యూనిస్టు పార్టీ (%జూ×%) జాతీయ కౌన్సిల్ నుంచి నిష్క్రమించారు. అనంతరం కొత్తగా ఏర్పడిన మార్క్సిస్టు పార్టీ %జూ×(వీ%)కు సహ-వ్యవస్థాపకుడిగా వ్యవహరించారు. అసమానంగా సాగిన ఆయన రాజకీయ జీవితంలో పార్టీ కార్యదర్శిగా, విపక్ష నేతగా, అనంతరం కేరళ ముఖ్యమంత్రిగా సేవలందించారు. అచ్యుతానందన్ మృతిపై రాజకీయ నేతలు, ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు. 'అచ్యుతానందన్ కేవలం రాజకీయ నేతే కాదు, ప్రజాస్వామ్యం పట్ల అపార నిబద్ధత కలిగిన మార్గదర్శకుడు' అని కొనియాడుతున్నారు.

## ముంబై రైలు పేలుళ్ల కేసులో బాంబే హైకోర్టు సంచలన తీర్పు

**ముంబై-నవభూమి:** రైలు పేలుళ్ల ఘటనలో బాంబే హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో శిక్ష పడిన 12 మందిని నిర్దోషులుగా ప్రకటిం చింది. వీరిలో ఉరిశిక్ష పడిన ఖైదీలు కూడా ఉండటం గమనార్హం. శిక్ష పడిన ఈ 12 మందిపై అభియోగాలను నిర్ధారించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైనందున వారిని నిర్దోషులుగా తేల్చినట్లు కోర్టు తన తీర్పులో వెల్లడించింది.



## కావడి యాత్రలో ఆరుగురు యాత్రికుల మృతి



**ముజఫరాబాద్-నవభూమి:** కావడి యాత్రలో భక్తుల రద్దీ పెరగడంతో జరిగిన వేరు వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు భక్తులు మరణించారు. ఇరవైకి పైగా భక్తులు గాయపడ్డారు. యాత్ర 23న ముగుస్తుండడంతో యాత్రలో ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యాత్ర ప్రధాన మార్గాలైన ఢిల్లీ- డెహ్రాడూన్ రహదారి, గంగా కాలువ రోడ్డు భక్తులతో నిండిపోయాయి. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ నుంచి పవిత్ర గంగా జలాలతో వస్తున్న వేల మంది భక్తులకు ముజఫరాబాద్‌లో యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ హెలికాప్టర్ నుంచి పూల వర్షం కురిపించి ఆహ్వానించారు. కావడి యాత్రకు అప్రతిష్ఠపాలు చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని అన్నారు. మీర్జాపూర్ రైల్వేస్టేషన్‌లో ఓ సీఆర్‌పీఎఫ్ జవానుపై కావడి యాత్రికులు దాడి చేశారు. బ్రహ్మపుత్ర రైలు ఎక్కిన యాత్రికులను జవాను టికెట్ అడగడంతో వారు అతడిపై దాడికి పాల్పడ్డారు. ప్లాట్‌ఫారంపై పడిపోయిన జవానుపై ప్రయాణికులందరి ముందే పిడిగుద్దులు కురిపించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. రైల్వే భద్రత దళం (ఆర్పీఎఫ్) సిబ్బంది వెంటనే స్పందించి, దాడికి పాల్పడిన ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశారు. మరోవైపు, ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ జిల్లాలో ఢిల్లీ-హరిద్వార్ జాతీయ రహదారిపై అకారణంగా గొడవలకు దిగి రోడ్డును బారికేడ్లతో మూసివేసిన రెండు వేరు వేరు ఘటనల్లో నలుగురు కావడి యాత్రికులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## థరూర్ మాతో లేరు.. కాంగ్రెస్ కార్యక్రమాలకు పిలవం



**తిరువనంతపురం-నవభూమి:** కాంగ్రెస్ పార్టీ వైఖరికి భిన్నంగా వెళ్తున్న తిరువనంతపురం ఎంపీ శశిథరూర్‌పై కేపీసీసీ మాజీ అధ్యక్షుడు కె.మురళీధరన్ విరుచుకుపడ్డారు. థరూర్ తమతో లేడని, ఇకపై కేరళలో జరిగే కాంగ్రెస్ కార్యక్రమాలకు ఆయన్ను పిలవబోమని స్పష్టం చేశారు. థరూర్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడని, ఆయనపై ఏ చర్యలు తీసుకోవాలనేది అధిష్టానమే నిర్ణయించాలని మురళీధరన్ చెప్పారు. కేరళలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం అభ్యర్థిగా శశిథరూర్ ఉత్తమమంటూ ఇటీవల ఓ సర్వేలో వెల్లడైనప్పుడు కూడా మురళీధరన్ ఘాటుగా స్పందించారు. అసలు థరూర్ ఏ పార్టీలో ఉన్నారో ముందుగా చెప్పాలని ఎద్దేవా చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో థరూర్ కేంద్రాన్ని సమర్థించారు. జాతీయ భద్రత విషయంలో పార్టీలకు అతీతంగా స్పందించాలని అన్నారు. అప్పటి నుంచి కాంగ్రెస్ నేతల విమర్శలు మొదలయ్యాయి.



# సౌందర్యానికి చల్లటి తైలం



డ్రై, సెన్సిటివ్ చర్మాలకు ప్రత్యేక కేర్ అవసరం. ఈ చర్మాలకు కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్స్ తగినంత రక్షణ అందిస్తాయి. మృదుత్వాన్ని కాపాడుతూ తేమ కోల్పోకుండా సంరక్షించటంలో కోల్డ్ ప్రెస్డ్ అయిల్స్‌కు మించిన సౌందర్య సాధనం మరొకటి లేదు.

**కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్స్ అంటే?:** చల్లని వాతావరణంలో విత్తనాలు, నట్స్ నుంచి తీసే నూనెను కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్ అంటారు. ఈ నూనెల్లో ట్రాన్స్ ఫ్యాట్స్ ఉండవు. ఇతరత్రా విషపూరిత రసాయనాలు కూడా ఉండవు. రసాయనాలు ఉపయోగించకుండా నూనె తీసే పద్ధతి ఉపయోగించటం వల్ల ఈ నూనెల ధర కూడా ఎక్కువగానే ఉంటుంది.

**ఈ నూనెలు మేలైనవి**

క్లిష్టమైన పద్ధతులు ఉపయోగించటం వల్ల తయారయ్యే నూనె తక్కువ మొత్తంలో ఉన్నా ఎంతో నాణ్యత కలిగి ఉంటుంది. సహజసిద్ధమైన పోషకాలు, యాంటి ఆక్సిడెంట్లు, సువాసనలు ఈ నూనెల్లో పుష్కలంగా ఉంటాయి. ఈ పద్ధతిలో కాకుండా రసాయనాలు, వేడి ఉపయోగించి తీసే నూనెల్లో సహజ గుణాలు లోపిస్తాయి. ఈ నూనెలు తక్కువ కాలం నిల్వ ఉంటాయి. కాబట్టి ఎండ తగలని ప్రాంతంలో నిల్వ ఉంచి సాధ్యమైనంత త్వరగా ఉపయోగించాలి.

# ఏం తిన్నారో కాదు.. ఏం చదివారో చెబుతాం



బడిలో ఇచ్చే 'ప్రోగ్రెస్ కార్డుల' గురించి తెలుసు మనకు.
చదువులో, నడతలో వారి ప్రగతిని చెబుతాయివి.. కదా!
మరి ఆరోగ్యపరంగా వాళ్లు ఎలాంటి ప్రగతి సాధిస్తున్నారు?
పిల్లల దేహదారుఢ్యం సంగతేమిటీ?
వాళ్లకి రోజువారి పోషకాలు అందుతున్నాయా? అందినా వాళ్ల శరీరం వాటిని తీసుకోగలుగుతోందా?
వీటన్నింటిని వివరించే 'ఆరోగ్య ప్రగతి కార్డు' అందిసుం?తది ఈ డాక్టరమ్మ!
ఇందుకోసం పరీక్షలు చేసి, సమస్యలని సవరించి, పిల్లలందరినీ ఆరోగ్య హీరోలుగా మారుస్తోంది. ఇదేదో కార్పొరేట్ బడులకే పరిమితం కాదండోయ్. ప్రభుత్వ బడులకీ ఈ సేవలనందిస్తోంది డాక్టర్ కంభం మేఘన!
ఈ ఆలోచన తనకెలా వచ్చిందో వివరిస్తోందిలా..

'మా పాప అస్సలు తినదు', 'సెలవులొస్తే చాలు.. మా బాబు టీవీ రిమోట్ వదలడు..', 'మా పింకీ ఎవరితోనూ కలవదు..' ఈ రోజుల్లో పిల్లల విషయంలో ఇలాంటి ఫిర్యాదులు చాలానే ఉంటాయి. ఇవన్నీ భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలుగా తలెత్తే ప్రమాదమూ లేకపోలేదంటున్నాయి పలు అధ్యయనాలు. పిల్లల్లోని అలాంటి అలవాట్లను మార్చడమే మా 'కేర్ అండ్ గ్రో' సంస్థ లక్ష్యం. దాన్నెందుకు మొదలుపెట్టామంటే.. మాది నెల్లూరు. కానీ పెరిగిందంతా వైజాగ్‌లో. నాకు రెండేళ్లున్నప్పుడే నాన్న చనిపోయారు. అమ్మ మానసిక నిపుణురాలు. అప్పటి నుంచీ అన్నీ తానై నన్ను పెంచింది. మనం.. మన ప్రపంచం మాత్రమే అనుకుని గిరిగీసుకుంటే మన చుట్టూ ఎవరూ ఉండరని అమ్మ నాకు చెప్పడమే కాదు.. ఆచరణలోనూ పెట్టేది. మా అమ్మ ఓ పాఠశాల నడుపుతుంది. అందులో పరిపాలనా విభాగంలో అంతా వితంతువులూ, ఏ అండాలేని మహిళలకే ఉద్యోగం ఇచ్చింది. అవన్నీ చూశాక నేనూ సేవ గురించి ఆలోచించేదాన్ని. ఆ అవకాశం వైద్య వృత్తిలో ఎక్కువగా ఉంటుందని దాన్నే ఎంచుకున్నా. డబ్బులడిగేవారు.. మెడిసిన్‌కోసం ఆంధ్ర మెడికల్ కాలేజీలో చేరా. హౌస్ సర్జన్‌గా వైజాగ్‌లోని కేజీహెచ్‌లో పని చేస్తున్నప్పుడు రోగులు చిన్న సమస్య కోసం దూర ప్రాంతాలనుంచి రావడం, తిరిగివెళ్లేందుకూ చేతిలో డబ్బులు లేక ఇబ్బందులు పడటం గమనించేదాన్ని. ఓసారి రక్తపోటు సమస్యను చూపించుకోవడానికి ఒకావిడ వచ్చింది. తిరిగి వెళ్లడానికి కనీసం బస్సు ఛార్జీలు కూడా లేక మా అందరి దగ్గరా తలా కొంత అడిగింది. ఇలాంటివాటికి పరిష్కారం ఏంటా అని ఆలోచించా. అనారోగ్యాల్ని అదుపు చేయాలంటే తగిన శారీరక దార&ఢ్యం, మానసిక ప్రశాంతత, పోషకాహారం అవసరం. ఆ పునాది చిన్నతనం నుంచే పడాలి. అందుకే స్కూలు స్థాయి నుంచే మార్పు తేవాలనుకున్నా. ప్రతిఏటా వాళ్ల ఆరోగ్య పురోగతినీ నమోదు చేసే పురోగతి రికార్డులను అందించే ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నా. అది సాధ్యం కావాలంటే ఎప్పటికప్పుడు వారి శారీరక, మానసిక, ప్రవర్తనాపరమైన పరిస్థితులను పరీక్షల ద్వారా గుర్తించి వారికి తెలియజేయాలనుకున్నా. అంటే.. పోషకాహారం మొదలు జీవనశైలీ, ప్రవర్తనలో మార్పులు చేసుకోవడం, శారీరకదార&ఢ్యం పెంచుకోవడం వంటివన్నీ కూడా వివరించాలనుకున్నా. శిక్షణ తీసుకున్నా.. వైద్యం పూర్తయ్యాక చాలామందిలా ప్రాక్టీస్ మొదలుపెట్టలేదు. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ బిజినెస్ స్కూలు నుంచి ఏడాదిపాటు సోషల్ ఎంటర్‌ప్రైజెస్ కోర్సు పూర్తిచేశా. దాంతోపాటూ ఇన్‌సీడ్ అనే విద్యాసంస్థలో ఇలాంటి శిక్షణ ఉందని తెలిసి దరఖాస్తు చేసుకున్నా. నాలాంటి మూడులక్షలమంది నుంచి ప్రతిపాదనలు వస్తే.. అందులోంచి వందమందిని ఎంపికచేశారు. వారిలో నేనూ ఉన్నా. అక్కడున్నప్పుడే నా ఆలోచనను ఓ ప్రదర్శనలో వివరిస్తే.. మరో ఇద్దరు ఆసక్తి చూపించి తామూ భాగస్వాములం అవుతామని ముందుకొచ్చారు. అలా రెండేళ్ల క్రితం 'కేర్ అండ్ గ్రో'ని ప్రారంభించాం. అయితే అంతకన్నా ఏడాది ముందు దీన్ని ప్రయోగాత్మకంగా బెంగళూరు, ఒడిశా, పశ్చిమబంగ వంటి
చోట్ల రెండువేల మంది చిన్నారుల్లో ఉండే పోషకాహారలేమి, రక్తహీనత సమస్యల్ని గుర్తించి, ఎలా పరిష్కరించుకోవాలో చెప్పి విజయం సాధించా.

పాఠశాలలతో ఒప్పందం.. నిజానికి ఇలాంటివి యూరప్, యూకే వంటి చోట సుపరిచితమే. మనదగ్గర మాత్రం అరుదనే చెప్పొచ్చు. వందల సంఖ్యల్లో తెలుగు రాష్ట్రాల్లోని పలు కార్పొరేట్, ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలకు మా ప్రతిపాదన చెప్పాం. కలిసి పనిచేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాం. పాఠశాలల్ని బట్టి హయ్యర్ గ్రేడ్, మిడిల్, ప్రైమరీ అని విభజించుకున్నా. మొదటిదానికి ప్రత్యేక ప్యాకేజీలూ, ఏడాదికి నిర్ణీత రుసుమూ తీసుకుంటే, రెండోదానికి ఏడాదికి ఆరు నుంచి ఎనిమిది వందల రూపాయలూ, మూడో దానికి పూర్తిగా ఉచితంగా మా సేవలు అందించడానికి సిద్ధమయ్యాం. మొదటి రెండు విభాగాల పాఠశాలల నుంచి తీసుకున్న డబ్బును ప్రైమరీ అంటే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కేటాయిస్తాం. ఏటా రెండుసార్లు మా పారామెడికల్ సిబ్బందీ మాతో ఒప్పందం కుదుర్చుకున్న పాఠశాలల్లోని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తారు. దీనికోసం ఓ ఫార్మాల్యాబ్‌తోనూ ఒప్పందం కుదుర్చుకున్నాం. ఆరోగ్య పరీక్షలతోపాటూ వాళ్లేమయినా ఒత్తిడికి గురవుతున్నారా.. వాళ్ల ప్రవర్తన ఎలా ఉందీ.. ఆహారపుటలవాట్లు.. ఇలా అన్నింటినీ గమనించి వాళ్ల వివరాలన్నింటినీ కంప్యూటరులో నమోదు చేస్తాం. ఇందుకోసం మేం ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్‌ని రూపొందించాం. తరవాత ఆ వివరాలన్నింటినీ కార్డులుగా రూపొందించి పిల్లలకు అందిస్తాం. వారి సమస్యల ఆధారంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలూ, ఆహారపరంగా చేసుకోవాల్సిన మార్పుల్ని వివరిస్తాం. వాళ్లు ఆచరణలో పెట్టేలా కూడా ప్రణాళికలు రూపొందిస్తాం. వ్యాయామం చేయిస్తాం.. పిల్లల ఆరోగ్య పరిస్థితి ఆధారంగా రాబోయే ఆరునెలల్లో వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో వివరిస్తాం. ఉదాహరణకు పిల్లల్లో పోషకాహార లోపం ఉందనుకోండి.. తదనుగుణంగా మార్పులు చెబుతాం. పిల్లలతో మీరే స్వయంగా పెసల మొలకలు చేసుకుని రండి.. సలాడ్‌ని చేయించుకుని తీసుకుని రండి అని సూచిస్తాం. వాళ్లు ఉత్సాహంగా చేసుకుని వచ్చాక.. కలిగే లాభాలేంటో వివరించే ప్రయత్నం చేస్తాం. ఈ విషయంలో వారి తల్లిదండ్రుల సహకారమూ తీసుకుంటాం. ఇవన్నీ పాఠశాల ద్వారానే జరుగుతాయి. ప్రతి పిరియడ్ విరామంలో పది నిమిషాల చొప్పున వ్యాయామం చేయిస్తాం. వ్యక్తిగత పరిశుభ్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలూ, నలుగురిలో ఎలా మాట్లాడాలీ, ఎలా ఉండాలనేదీ చెబుతాం. కొందరు పిల్లల్లో డిస్‌గ్రాఫియా అనే సమస్య ఉంటుంది. వాళ్లు ఎంత చురుగ్గా ఉన్నా. బాగా చదివినా సరిగ్గా రాయలేరు. దాన్ని గుర్తిస్తే చిన్న కౌన్సెలింగ్, పర్యవేక్షణతో మార్పు తెచ్చేందుకు ప్రయత్నిస్తాం. మేం చెప్పినట్లు విని.. చక్కగా గోళ్లు కత్తిరించుకుని, పరిశుభ్రమైన సీసాల్లో నీళ్లు తెచ్చుకుని, పోషకాహారం తీసుకునేవారిని హెల్దీ హీరోస్‌గా గుర్తించి చిన్నపాటి కానుకలు ఇస్తాం. .

# బాదం భేష్!



పరీక్షల సమయంలో శక్తినిచ్చి, అలసటకు లోను చేయని ఆహారం తీసుకోవాలి. చటుక్కున తినగలిగే స్నాక్స్‌లో బాదం భేషైనది!

పరీక్షల సమయంలో పలువురు సెలబ్రిటీలు ఎంచుకున్న పవర్‌ఫుల్ స్నాక్ బాదం. తమ బాల్యంలో, పరీక్షల సమయంలో బాదం పప్పు తినేవాళ్లమని బాలీవుడ్ నటులు సోహా అలీ ఖాన్, మిలింద్ సోమన్‌లు చెప్పారు. వాళ్లు ఏమన్నారంటే....

సోహా అలీ ఖాన్: పరీక్షల సమయంలో పిల్లలు ఒత్తిడికి లోనవుతూ ఉంటారు. ఈ అనుభవం నేనూ ఎదుర్కొన్నాను. నా చిన్నతనంలో అమ్మ నా స్టడీ టేబుల్ మీద బాదం అందుబాటులో ఉంచేది. ఎక్కువ సమయం పాటు చదువుతూ, ఆకలి అనిపించినప్పుడు శక్తి కోసం బాదం బాగా ఉపయోగపడేవి.

మిలింద్ సోమన్: పరీక్షల సమయంలో పిల్లలు ఫిట్‌నెసను నిర్లక్ష్యం చేస్తారు. అయితే ఇందుకోసం స్టడీ టైమ్ నుంచి కొంత బ్రేక్ తీసుకోవాలి. ప్రత్యేకంగా వ్యాయామం కోసం సమయం కేటాయించలేకపోతే, నడుస్తూ చదవడం లేదా ఇంటిని చుట్టి రావడం చేయాలి. అలాగే బలవర్ధకమైన ఆహారంలో భాగంగా బాదం తప్పక తీసుకోవాలి. మెదడుకు పోషణ! పరీక్షల సమయంలో భోజనానికీ, భోజనానికీ మధ్య ఆకలి వేయడం సహజం. ఇలాంటప్పుడు పిల్లలు చిరుతిళ్ల జోలికి వెళ్లకుండా బాదం తినడం మేలు. బాదం తింటే మెదడుకు పోషణ లభించి చురుగ్గా పని చేస్తుంది.

# ఆనియన్ క్వీన్



ఉల్లి పంట... దాని ధర అమాంతంగా పెరిగి జనం కంట నీరు తెప్పిస్తుంది. హఠాత్తుగా పతనమైపోయి రైతులకు ఆవేదన మిగుల్చుతుంది. దీనికి కారణాలను శాస్త్రీయంగా అధ్యయనం చేసిన 23 ఏళ్ళ కల్యాణి రాజేంద్ర షిండే సరికొత్త పరిష్కారంతో ముందుకొచ్చారు. ఆమె తీసుకున్న చొరవ రైతుల నష్టాలను భారీగా తగ్గించి... నికరమైన ఆదాయానికి భరోసా ఇస్తోంది. "మా నాన్నంటే నాకు ప్రాణం. ఎప్పుడూ సరదాగా, నవ్విస్తూ ఉండే ఆయన దిగాలుగా ఉంటే ఎంతో బాధగా ఉండేది. అలాంటి సందర్భాలు రాకూడదని దేవుణ్ణి కోరుకొనేదాన్ని. కానీ "ఈ ఏడాది కూడా నష్టమేనమ్మా!" అని ఆయన కన్నీళ్ళు ఆపుకొంటూ చెబుతుంటే మా ఇంటిల్లిపాదికీ ఏడుపొచ్చేది. ఇది మా ఒక్కరి కథ కాదు... లక్షలమంది ఉల్లి రైతుల వ్యథ. మహారాష్ట్రలోని లాసల్‌గావ్... ఆసియాలోనే అతి పెద్దదైన ఉల్లిపాయల హోల్‌సేల్ మార్కెట్. నేను ఆ ఊర్లోనే పుట్టాను. మా ప్రాంతంలో దాదాపు రైతులందరూ ఉల్లి సాగుచేస్తారు. వారిలో మా నాన్న కూడా ఒకరు. ఉల్లి పంట వేసినప్పటి నుంచి కోతకు వచ్చేసరికి దాదాపు నాలుగు నెలల సమయం పడుతుంది. ఆ తరువాత వాటిని ఆరు నుంచి ఎనిమిది నెలలపాటు నిల్వ ఉంచుతారు. సరుకు దెబ్బతింటే... ధరల్లో ఎనిమిది వందల శాతం హెచ్చుతగ్గులు చోటు చేసుకోవడం నేను గమనించాను. మార్కెట్‌లో హఠాత్తుగా చోటుచేసుకొనే ఒడుదొడుకుల కారణంగాను, సరుకు దెబ్బతినడం వల్లా రైతులు తీవ్రమైన నష్టాలకు గురవడం సాధారణమైపోయింది. ఇవన్నీ చూస్తూ పెరిగాను. 'రైతుల కష్టాలు తీరే మార్గం లేదా?' అని ఎప్పుడూ ఆలోచించేదాన్ని...ఆ నష్టం దేశానిది కూడా...నాసిక్‌లో 2018లో కంప్యూటర్ ఇంజనీరింగ్ చేస్తున్నప్పుడు... టీసీఎస్ ఫౌండేషన్ నిర్వహణలోని ఓపెన్ సోషల్ ఇనీషియేటివ్ సెంటర్... 'డిజిటల్ ఇంపాక్ట్ స్క్వేర్'కు ఎంపికయ్యాను. సామాజికమైన వివిధ సవాళ్ళను పరిష్కరించడానికి డిజిటల్ సాంకేతికతల వినియోగాన్ని ప్రోత్సహించడానికి ఉద్దేశించిన సంస్థ ఇది. దాని ద్వారా రైతుల సమస్యలను క్షేత్ర స్థాయిలో శాస్త్రీయంగా అధ్యయనం చేసే అవకాశం దొరికింది. మన దేశంలో ఉత్పత్తి అయ్యే ఉల్లి పంటలో 40 నుంచి 50 శాతం వరకూ వినియోగదారులకు చేరేలోగానే పాడవుతోంది. అది ప్రతీ ఏడాది అయిదు కోట్ల మంది వినియోగించే పంటతో సమానం. దేశ ప్రజల అవసరాలకు మించిన ఉత్పత్తిని మన రైతులు చేస్తున్నారు. కానీ పంట కోత తరువాత తలెత్తే పరిస్థితులు వారు నష్టపోవడానికి దారి తీస్తున్నాయి. సంప్రదాయమైన గిడ్డంగుల్లో నిల్వ చేయడం, ఆధునికమైన పర్యవేక్షణ పద్ధతులు అనుసరించకపోవడం లాంటి కారణాల వల్ల... పంట లోలోపలే కుళ్ళిపోతోంది. మరింత వివరంగా చెప్పాలంటే... పంట కుళ్ళిపోయిందా? లేదా? అని నిర్ధారించడానికి రైతులు తమ వాసన శక్తి మీద తరచుగా ఆధారపడుతున్నారు. కానీ కుళ్ళిన వాసన వచ్చేసమయానికి సగం పంట పనికిరాకుండా పోతోంది. ఈ నష్టం విలువ ప్రతి సంవత్సరం సుమారు రూ.40 వేల కోట్లు. ఈ నష్టం కేవలం రైతు కుటుంబాలదే కాదు, దేశానిది కూడా. ఆధునిక సాంకేతికతలను వినియోగించడం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం చూపించాలనుకున్నాను. దానికోసం తీవ్రంగా పరిశోధన చేశాను. అయిదేళ్ళ క్రితం నాసిక్ నుంచి లాసల్‌గావ్‌కు తిరిగి వచ్చి 'గోదామ్ ఇన్నోవేషన్స్' అనే అనే అగ్రిటెక్ స్టార్టప్‌ను ఏర్పాటు చేశాను. కేవలం రూ. మూడు లక్షల నిధులతో ఇది మొదలైంది. ఉల్లిపాయలు దెబ్బతినడాన్ని ముందుగానే గుర్తించేందుకు... ఒక ఐఓటీ (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్) సాంకేతికతతో... ఒక చిన్న పరికరానికి రూపకల్పన చేశాను. దానికి 'గోదామ్ సెన్స్' అనే పేరు పెట్టాను. ఈ తరహా పరికరం తయారీ దేశంలోనే తొలిసారి. ఉల్లిపాయలు నిల్వచేసే గోదాముల్లో దీన్ని అమర్చితే... నిశ్శబ్ద సంరక్షకుడిలా గమనిస్తూ ఉంటుంది. ఉష్ణోగ్రతలను, తేమను నిరంతరం పర్యవేక్షిస్తుంది. ఉల్లిపాయలు పాడవడం ప్రారంభమైన తొలి దశలో... వాటి నుంచి కొన్ని వాయువులు వెలువడతాయి. మొత్తం సరుకులో ఒక శాతం పాడవడం మొదలైనా సరే... ఆ పరికరం హెచ్చరికలు పంపుతుంది. సరుకు బాగా దెబ్బతిన్న తరువాత మేలుకొనేకన్నా... ముందుగా గుర్తించడం వల్ల రైతులకు మేలు కలుగుతుంది. ప్రయోగాత్మకంగా కొన్ని చోట్ల ఈ పరికరాన్ని అమర్చి చూశాం. ఫలితాలు ఆశాజనకంగా ఉండడంతో... ఆ వివరాలను ప్రభుత్వ సంస్థల దృష్టికి తీసుకువెళ్ళాం. వాటి నుంచి సానుకూల స్పందన వచ్చింది. ఇప్పుడు 'డైరెక్టరేట్ ఆఫ్ ఆనియన్ అండ్ గార్లిక్ రీసెర్చ్' (డిఓజిఆర్), భారత జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య (నాఫెడ్), జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డ్) తదితర సంస్థలు మాకు భాగస్వాములుగా ఉన్నాయి. భారీ, మధ్యతరహా, చిన్న తరహా రైతుల అవసరాల మేరకు... నెలవారీ ఛార్జీలతో గోదాముల్లో 'గోదామ్ సెన్స్' పరికరాలను అమరుస్తున్నాం. వాటి ద్వారా కనీసం 30 నుంచి 40 శాతం నష్టాన్ని రైతులు నివారించుకోగలుగుతున్నారు. దానికోసం పాత గోదాములనే కొత్తగా తీర్చి దిద్దుతున్నాం. ఇప్పుడు పలు రాష్ట్రాల్లో... ఉల్లి నిల్వచేసే చాలా గోదాముల్లో ఈ పరికరాన్ని వినియోగిస్తున్నారు. తద్వారా వారికి నష్టం తగ్గి... నికరమైన ఆదాయం లభిస్తోంది."

సాంకేతికతపై అవగాహనతో....

రైతు సంఘాలు, మీడియా నన్ను 'ఆనియన్ క్వీన్' అని పిలుస్తున్నాయి. దానికన్నా... మా నాన్నలాంటి ఎందరో రైతులను నష్టాల ఊబి నుంచి కాపాడగలగడం నాకు ఎంతో సంతోషం కలిగిస్తోంది. రైతులకు కొత్త సాంకేతికతలను పరిచయం చేసి, వాటిపై అవగాహన కలిగిస్తే... ఎన్నో అద్భుతాలు జరుగుతాయని నా నమ్మకం. అది నిజమని నా ప్రయత్నం రుజువు చేస్తోంది.

# మనోవైకల్యాలను తొలగించండి

టీనేజర్లలో దుడుకు స్వభావం పెరిగేందుకు అనేక రకాల అంశాలు దోహదం చేస్తుంటాయి. ఆ స్వభావం వల్ల అనేక రకాల మనోవైకల్యాలు వారిలో కలుగుతుంటాయి.. కొన్ని కొన్నిసార్లు వారు చేస్తున్న పనులపై వారికే కంట్రోల్ ఉండదు. వాటన్నింటినీ వారు ఒక్కరే ఎదుర్కోవడం అసాధ్యం. పైగా ఆ మనో వైకల్యాల వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ సందరేలో వారిలో ఏర్పడే మనో సంక్లిష్టతలకు గల కారణాలేంటో చూద్దాం !

టీనేజర్లలో ఉండే కొన్ని రకాల మనోవైకల్యాలను సమాజంలో చాలామంది వయసు ప్రభావానికి ప్రతీకలుగా పేర్కొంటారు. కానీ వాటివల్లనే నేరాల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. నేర ప్రవ ృత్తి, మనోవైకల్యం పెరగడం ఇలాంటి వన్నీ మనదేశంలో కన్నా పశ్చిమ దేశాల నగరాల్లోనే ఎక్కువగా ఉంటాయి. అక్కడ సమాజంలో ధనికవర్గం ఎక్కువగా ఉండడం ఒకెత్తయితే, పిల్లలకు మితిమీరిన స్వేఛ్ఛఇవ్వడం మరో ఎత్తు. అక్కడి సమాజంలో పిల్లలకు చిన్నప్పుడే స్వతంత్రంగా బతకడం నేర్పిస్తారు. ఇది ఒకందుకు మంచిదే అయినా మితిమీరిన స్వతంత్రం పిల్లల్లో నేర ప్రవ ృత్తి, దుడుకు స్వభావం పెంచుతుంది.

మన సమాజంలో మధ్యతరగతికి చెందిన వారే అత్యధికం కాబట్టి ఈ బాపతు అవకతవకలున్నా కూడా అవి అంతగా బయటకు రావు. పైగా అలాంటి గణాంక వివరాలు కూడా మనకంత తేలికగా దొరకవు.

ఇక ఎక్కడైనా టీనేజ్‌లో మిస్‌బిహేవియర్ ఉన్నప్పటికీ అల్లరి చిల్లరితనం ఎంతో కొంత ఉంటుందని మాత్రం చెప్పుకోవచ్చు. ఇది కేవలం పాశ్చాత్య దేశాల్లోనే కాదు మన దేశంలో కూడా ఉంది. అందుకు కారణాలు అనేకం. అందుకోసం బాల్యం నుంచి పిల్లలను చక్కటి ప్రేమ, సంరక్షణలో పెంచితే ఆ పిల్లలు టీనేజ్ వచ్చేనాటికి ఏ అవకతవకలూ లేకుండా మంచి మానసిక ఆరోగ్యంతో ఆనందదాయకమైన ఎదుగుదల కొనసాగిస్తారు.

**భంగపాటు**

టీనేజ్‌లో సక్రమమైన మానసికస్థితి లేకపోవడానికి చాలా కారణాలు కనిపిస్తాయి. ఫలానా కారణం వల్లనే వారిలా ఉంటున్నారని నిర?యించడం కష్టం. టీనేజ్‌లో శారీరక ఎదుగుదల అనేక మార్పులతో చకచకా జరిగిపోతుంది. ఆ సమయంలో వచ్చే రకరకాల శారీరక మార్పులవల్ల హార్మోన్ల ఉత్పత్తిలో బాలెన్స్ లోపిస్తుంది. అంటే కొన్నిసార్లు అధిక మొత్తంలో హార్మోన్లు ఉత్పత్తి అవడం, మరికొన్నిసార్లు తక్కువ మొత్తంలో ఉత్పత్తి అవడం ఇలా, హార్మోన్ల ఉత్పత్తిలో సమతూకం లోపించడం వల్ల వ్యక్తి స్వభావంలో, టెంపర్‌మెంట్‌లో నిలకడ శక్తి లేకుండాపోతుంది. దాంతో వారు ఒకసారి ఒకలా మాట్లాడితే మరునిమిషంలో మరోలా వేరే ఆలోచనతో మాట్లాడుతారు. అసలు ఈ టెంపర్‌మెంట్ ఎలా ఏర్పడుతుందంటే....

ఒక వ్యక్తి శారీరక యంత్రాంగం అతని మనస్సు మీదా ఉద్వేగాల మీదా చూపే ప్రభావం అతనిలోని స్వభావం లేక టెంపరమెంట్‌కి పునాదిగా ఉంటుంది. ఇది శారీరకంగానూ, మానసికంగానూ రెండు రకాలుగా ఉంటుంది. శరీర అవయవాలు ఉత్పత్తిచేసే హార్మోన్లలో సమతూకం లోపించినప్పుడు అతని టెంపరమెంట్‌లో కూడా సహజంగా అవకతవకలు ఏర్పడతాయి. ఇది కేవలం శారీరక సంబంధమైన కారణంగా చెప్పుకోవచ్చు. ఇక మానసిక సంబంధమైన కారణాలు గమనించినప్పుడు అనేకం కనిపిస్తాయి.

టీనేజ్‌లో ఆదర్శవాదం మితిమీరిన స్థాయిలో ఉండడం సహజం. వారిలా ఉండాలి లేదా అలా తయారవ్వాలి, ఇలాంటి పనులే చేయాలి... అనే తరహాలో ఏదో ఒక ఆదర్శంతో ఉండేందుకే ప్రయత్నిస్తుంటారు. అయితే వాస్తవ జీవితంలో తప్పులు తెలుస్తున్నప్పుడు, భంగపాటుకు గురవుతున్నప్పుడు ఈ ఆదర్శవాదం తాలూకు భ్రమలు కుదేలైపోతుంటాయి. ఫలితంగా కుర్రకారులో ఫ్రస్టేషన్ ప్రభావం వల్ల మనస్తత్వంలో నిలకడ లోపిస్తుంది. ప్రవర్తనలో అవకతవకల ధోరణి ప్రవేశిస్తుంది.

**స్వీయ నియంత్రణ..** టీనేజ్లో సెక్స్ అనుభూతులు, దుడుకు స్వభావం ఒకదానితో ఒకటి పోటీ పడుతూ వేగంగా అభివ ృద్ధిచెందుతుంటాయి. ఈ రెంటి తాలూకు తీవ్రత తట్టుకోలేక కుర్రవాళ్ళు స్వీయ నియంత్రణ కోల్పోతారు. నిలకడ లేకుండా అడ్డదిడ్డంగా ప్రవర్తిస్తారు.

కుర్రవాళ్ళల్లో తమమీద తమకు నియంత్రణ లేకపోవటానికి పైన చెప్పుకున్న కారణాలే కాకుండా పెంపకానికి సంబంధించిన కారణాలు కూడా కొన్ని కనిపిస్తాయి. వాటిలో స్వీయ క్రమశిక్షణ అలవర్చుకోలేకపోవడం ఒకటి.

**క్రమశిక్షణా లోపం**

టీనేజర్లు క్రమశిక్షణ అలవర్చుకోలేక పోవటానికి కారణాలు అనేకం ఉంటాయి. వీటిల్లో ముఖ్యంగా రెండింటిని ప్రధానంగా చెప్పుకోవచ్చు.



బాల్యంలో తల్లిదండ్రులు అతి గారాబం చేసి చెడగొట్టటం కావచ్చు లేక తల్లిదండ్రులకే నియంత్రణశక్తి లేకపోవడంవల్ల, ఆదర్శంగా ఉండాలని కన్నబిడ్డలకు చెప్పలేకపోటమూ కారణం కావచ్చు. చాలామంది తల్లిదండ్రులు 'బాల్యదశలో ఉన్నప్పుడే కట్టుదిట్టంలో పెంచినట్లయితే ఇప్పుడిలా తయారయ్యేవాడు కాదు' అని చెప్పుకోవడం వింటూవుంటాం. 'మొక్కై వంగనిది మానై వంగుతుందా' అనే సామెత ఇలాంటి సందరేలోంచి పుట్టిందే. ఇవన్నీ క్రమశిక్షణకు సంబంధించినవే. క్రమశిక్షణలేకపోడం ఒకెత్తయితే ఒక్కోసారి మితిమీరిన క్రమశిక్షణ కూడా టీనేజర్లలో చెడునడతకు కారణంగా ఉంటూ ఉంటుంది. బాల్యంలో పిల్లవాణి? మితిమీరిన క్రమశిక్షణలో ఉంచడంవల్ల పెద్దయి కాస్త స్వేఛ్ఛలభించే సమయానికి సంకెళ్లు తెంచుకుని రివోల్టయ్యే అవకాశం ఏర్పడుతుంది. బాల్యమంతా పిల్లాణి? బొటనవేలు కింద నొక్కిపెట్టి తమ నిర?యాల్ని పిల్లలపై రుద్దడంవల్ల వారిలో ఆలోచించే జ్ఞానం తగ్గిపోతుంది. పెద్దయ్యాక స్వంత నిర?యం తీసుకునే శక్తిసామర్థ్యాలు కొరవడతాయి. దానివల్ల కాలేజీ జీవితంలో ప్రవేశించినా కూడా ఈత రానివాడు సముద్రంలో గిలగిలలాడినట్టు ఉక్కిరి బిక్కిరైపోతాడు. ఇలాంటి కుర్రవాళ్లల్లో సంకల్పం, వ్యక్తిత్వం రెండూ లోపించి తమకు దొరికిన స్వేఛ్ఛాస్వాతంత్ర్యం ఎలా ఉపయోగించుకోవాలో తెలియక వ్యతిరేక ఫలితాలు పొందుతారు. అంతకు మునుపు తల్లి తల్లిదండ్రులు తమ నిర?యాన్ని రుద్దినట్లుగానే ఇప్పుడు తోటి సహచరులు తమ నిర?యాల్ని అతని మీద రుద్దుతుంటారు.

**అభద్రతా భావం**

మనుషులలో మనోవ్యాకులత అనే అవలక్షణం ఎప్పుడూ ఉంటుంది. దీనివల్ల ఎప్పుడూ టెన్షన్, ఆదుర్దా, ఆందోళనతో ఉంటారు. ఈ న్యూరోసిస్‌కి మూలకారణం భద్రతారాహిత్యం! పసిప్రాయంలో తల్లి అందించే ప్రేమ మీదే పిల్లల భద్రతాభావం ఆధారపడి ఉంటుంది. పిల్లలతో తల్లి అంటీముట్టనట్టు ప్రవర్తిస్తే, తిరస్కారానికి గురవుతున్నానే భావం పిల్లల్లో కలుగుతుంది. దాంతో బిడ్డ భద్రతకు సంబంధించిన భయాందోళనకు లోనవుతాడు. తల్లిప్రేమ ద్వారా లభించే భద్రతాభావం నిస్సహాయులైన పసిపిల్లలమీద ఎంతో ప్రభావం చూపిస్తుంది. 'నీకు నేనున్నాను' అనే భద్రతా భావం తల్లి దగ్గర నుంచి పిల్లవాడికి దొరకనప్పుడు అతనిలో భద్రతాభావం లోపిస్తుంది. పెద్దయ్యాక జీవితాన్ని ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోలేడు. నిరాశావాదం, ఆందోళన, బిడియంలాంటివి అతణి? చుట్టుముడతాయి. అందరితో కలుపుగోలుగా ఉండలేడు. ఇతరుల్ని ప్రేమించలేడు. తనను తాను ప్రేమించుకోవడంలోనే మునిగిపోయి ఒంటరిగా మిగిలిపోతాడు. జీవితంలో అతనికి ఇవన్నీ నష్టాన్ని కలుగజేసే అంశాలు. తల్లిదండ్రుల నుంచి ప్రేమ లభించని పిల్లలు నానారకాలుగా ప్రతిస్పందించే అవకాశం ఉంది. భయాందోళనలకు గురికావచ్చు. వైరాగ్యానికి లోనుకావచ్చు. చెల్లెలు లేక తమ్ముడు పుట్టడం మూలంగా తల్లి ప్రేమకు దూరమైనట్టు భావిస్తే మనస్సులో కోపం, ఈర్ష్య పెరిగి, వాటిని ఇతరుల మీద ప్రదర్శిస్తారు. లేకపోతే ఇతరుల నుంచి జాలి పొందే ప్రయత్నం చేస్తారు. వారి ప్రేమ పొందేందుకు కొన్ని స్వయం కల్పిత పనులను చేస్తారు. ఉదాహరణకు జ్వరం వచ్చినప్పుడు తల్లిదండ్రులు అతిప్రేమ ప్రదర్శిస్తారు. ఇలాంటి ప్రేమకోసమే కోరి జ్వరం తెచ్చుకుంటారు. లేకపోతే ఒక దెబ్బ తగిలించుకుని తల్లిదండ్రుల నుంచి గారాబం చవిచూడాలని ప్రయత్నిస్తారు. ఇవన్నీ వాళ్ళు తెలిసి కావాలని చేయరు. మనస్సు అసంకల్పితంగా స్పందించి శరీరం కూడా అలా స్పందించేలా చేస్తుంది. ఈ లక్షణాలన్నీ ప్రేమాదరణ లభించని పిల్లల్లో చోటుచేసుకోవడం సహజం. ముఖ్యంగా ఇద్దరు పిల్లలున్న ఇంట్లో ఈ లక్షణాలు ఎవరికైనా వచ్చే అవకాశాలు ఉంటాయి. తల్లిదండ్రుల ప్రేమ సంపాదించడానికి కావాలని నొప్పి లేదా జ్వరం వచ్చిందని ఏడ్చినప్పుడు, తల్లిదండ్రులు నొప్పీలేదు పాడులేదు ఊరుకో అన్నారనుకోండి, నిజంగానే తల్లిదండ్రులు తనను ప్రేమించడంలేదని మరింత బెంగపెట్టుకుంటాడు. అలాకాకుండా తల్లిదండ్రులు వెంటనే స్పందించి గారం ప్రదర్శించి బుజ్జగించారనుకోండి,



# లాభాల్లో ముగిసిన మార్కెట్లు.. 442 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

**ముంబై-నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ 25వేల ఎగువన ముగిసింది. ఆటో, రియాల్టీ, మెటల్, ప్రైవేట్ బ్యాంకుల షేర్లు రాణించడంతో లాభపడ్డాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,918.53 పాయింట్ల వద్ద సెన్సెక్స్ లాభాల్లో ప్రారంభమైంది. ఆ తర్వాత సెన్సెక్స్ కాస్త ఒడిదుడుకులను ఎదుర్కొన్నది. చివరలో కొనుగోళ్లతో లాభపడింది. ఇంట్రాడేలో 81,518.66 కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. గరిష్టంగా 82,274.03 పాయింట్ల మార్క్‌ను తాకింది. చివరకు 442.62 పాయింట్లు




పెరిగి.. 82,200.34 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 122.30 పాయింట్లు పెరిగి 25,090.70 వద్ద స్థిరపడింది. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం పెరగ్గా.. స్మాల్ క్యాప్ ఇండెక్స్ ఫ్లాట్‌గా ముగిసింది. రంగాలవారీగా చూస్తే ఆటో, క్యాపిటల్ గూడ్స్, ప్రైవేట్ బ్యాంక్, పవర్, రియాల్టీ, మెటల్ 0.5-1 శాతం పెరిగాయి.

## డిజిటల్‌లో చెల్లింపుల్లో దూసుకుపోతున్న భారత్..

### నెలలోనే 18.39 బిలియన్స్ లావాదేవీలు..!




**ముంబై-నవభూమి:** డిజిటల్ చెల్లింపుల్లో భారత్ దూసుకుపోతున్నది. యూపీఐ పేమెంట్స్‌లో భారత్ ప్రపంచ అగ్రగామిగా నిలిచిందని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. భారత్‌లో ప్రతినెలా రూ.1800 కోట్లకుపైగా యూపీఐ లావాదేవీలు జరుగుతున్నాయని పేర్కొంది. 'ది రైజ్ ఆఫ్ రిటైల్ డిజిటల్ పేమెంట్స్: ది ఇంపార్టెన్స్ ఆఫ్ ఇంటర్‌ఆపరబిలిటీ' పేరుతో ఐఎంఎఫ్ ఈ నివేదికను విడుదల చేసింది. యూపీఐ ద్వారా ఈ ఏడాది జూన్‌లో రూ.24.03 లక్షల కోట్ల సొత్తు ట్రాన్సాక్షన్స్ జరిగాయి. మొత్తం 18.39 బిలియన్ లావాదేవీలు నమోదైనట్లుగా నివేదిక పేర్కొంది. గతేడాది ఇదే నెలలో 13.88 బిలియన్ లావాదేవీలు జరగ్గా.. 32శాతం వృద్ధి నమోదైంది. ప్రస్తుతం 49.1 కోట్ల మంది సామాన్య ప్రజలు, 6.5 కోట్ల మంది వ్యాపారులు ఈ యూపీఐ సేవలను వినియోగిస్తున్నారు. 675 బ్యాంకులు యూపీఐతో కలిసి పని చేస్తున్నాయి.

అయితే, మొత్తం డిజిటల్ చెల్లింపుల్లో 85శాతం యూపీఐ ద్వారా భారత్‌లో జరుగుతున్నాయి. రియల్ టైమ్ డిజిటల్ చెల్లింపుల్లో 50 శాతం ఒక్క భారతదేశంలోనే జరుగుతున్నాయి. ఈ యూపీఐ సేవలు భారత్‌తో పాటు యూఏఈ, సింగపూర్, భూటాన్, నేపాల్, శ్రీలంక, ఫ్రాన్స్, మారిషస్ దేశాల్లోనూ కొనసాగుతున్నాయి. అయితే, బ్రిక్స్ సభ్యత్వ దేశాలకు యూపీఐని విస్తరించాలని రిజర్వ్ బ్యాంక్ యోచిస్తున్నది. సురక్షితమైన, వేగవంతమైన లావాదేవీలతో యూపీఐ చెల్లింపులు ప్రజల్లో భారీగా పెరిగింది. 2016లో నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రారంభించిన యూపీఐ సర్వీసులకు మంచి స్పందన లభిస్తున్నది. అప్పటి నుంచి ఏటా యూపీఐ లావాదేవీలు పెరుగుతూ వచ్చాయి. యూపీఐ ద్వారా ఎన్ని బ్యాంక్ అకౌంట్స్ ఉన్నా ఆయా అకౌంట్లను ఒకే మొబైల్ యాప్‌లో లింక్ చేసుకునేందుకు అవకాశం ఉంది. ఎవరు ఎవరికైనా డబ్బులు పంపడం, దుకాణంలో బిల్లులు చెల్లించేందుకు సైతం అవకాశం ఉన్నది.

## తగ్గిన బంగారం, వెండి ధరలు..ఎంతకు చేరుకున్నాయంటే..



**ముంబై-నవభూమి:**బంగారం, వెండి ధరలు తగ్గుతాయని ఆశిస్తున్న వారికి కాస్త ఊరట లభించింది. ఎందుకంటే నిన్నటి ధరలతో పోల్చితే వీటి రేట్లు ఈరోజు (జూలై 21న) స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం ఉదయం 6.30 గంటల సమయానికి 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 00, 030కి చేరుకుంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 91, 690గా ఉంది.

ఇది నిన్నటి రేటుతో పోల్చుకుంటే స్వల్పంగా రూ.10 మాత్రమే తగ్గింది. ఈ రోజు ధరల తగ్గుదల స్వల్పమైనదే అయినప్పటికీ, పెద్ద మొత్తంలో పసిడి కొనుగోలు చేసే వారికి ఇది ఒక మంచి అవకాశంగా మారనుంది. మరోవైపు సామాన్యులు మాత్రం లక్షకు చేరుకున్న పసిడి ధరలను చూసి కొనుగోలు చేయాలా వద్దా అని ఆలోచిస్తున్నారు.

ఇతర నగరాల్లో బంగారం ధరలు (10 గ్రాములకు):

చెన్నైలో 24 క్యారెట్ రూ. 1,00,030, 22 క్యారెట్ రూ. 91,690
ముంబైలో 24 క్యారెట్ రూ. 1,00,030, 22 క్యారెట్ రూ. 91,690
ఢిల్లీలో 24 క్యారెట్ రూ. 1,00,180, 22 క్యారెట్ రూ. 91,840
కోల్‌కతాలో 24 క్యారెట్ రూ. 1,00,030, 22 క్యారెట్ రూ. 91,690
బెంగళూరులో 24 క్యారెట్ రూ. 1,00,030, 22 క్యారెట్ రూ. 91,690
హైదరాబాద్?లో 24 క్యారెట్ రూ. 1,00,030, 22 క్యారెట్ రూ. 91,690
విజయవాడలో 24 క్యారెట్ రూ. 1,00,030, 22 క్యారెట్ రూ. 91,690
విశాఖపట్నంలో 24 క్యారెట్ రూ. 1,00,030, 22 క్యారెట్ రూ. 91,690

## ఆటో ఎగుమతుల జోరు

**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఆటోమొబైల్ ఎగుమతులు 22 శాతం వృద్ధి చెందినట్లు భారత ఆటోమొబైల్ తయారీదారుల సమాఖ్య (సియామ్) వెల్లడించింది. ఈ కాలంలో మొత్తం ఎగుమతులు 14,57,461 యూనిట్లుగా ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇవి 11,92,566 యూనిట్లుగా ఉన్నాయి. ప్యాసింజర్ వాహన ఎగుమతులు రికార్డు స్థాయికి చేరటంతో పాటు ద్విచక్ర, వాణిజ్య వాహన విభాగాల్లో బలమైన పెరుగుదల ఈ వృద్ధికి కారణమని సియామ్ పేర్కొంది. జూన్ త్రైమాసికంలో ప్యాసింజర్ వాహన ఎగుమతులు 2,04,330 యూనిట్లుగా ఉన్నాయి. పశ్చిమాసియా సహా అమెరికా మార్కెట్లలో స్థిరమైన డిమాండ్ కారణంగా ఎగుమతులు గణనీయంగా పెరిగాయని తెలిపింది. ఈ కాలంలో ద్విచక్ర, వాణిజ్య వాహన ఎగుమతులు 23 శాతం వృద్ధితో వరుసగా 11,36,942 యూనిట్లు, 19,427 యూనిట్లుగా ఉన్నాయి. జూన్ త్రైమాసికంలో దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ 96,181 యూనిట్లను ఎగుమతి చేసి మార్కెట్లో తన ఆధిపత్యాన్ని కొనసాగించింది.2030 నాటికి దేశీయ ద్విచక్ర వాహన మార్కెట్లో వాటా 30 శాతానికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్స్ ఇండియా (హెచ్‌ఎంఎస్‌ఐ) వెల్లడించింది. ప్రస్తుతం దేశీయ మార్కె ట్లో 27 శాతం వాటాతో హోండా రెండో స్థానంలో ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం ద్విచక్ర వాహన విక్రయాలు 1.88 కోట్ల యూనిట్లుగా ఉండగా హోండా మోటార్‌సైకిల్ విక్రయాలు 47.89 లక్షల యూనిట్లుగా ఉన్నాయి.


# రూ.44 వేల కోట్లు కొల్లగొట్టిన 'జేన్ స్ట్రీట్'కు సెబీ అనుమతి.. మళ్లీ ట్రేడింగ్ షురూ!




**ముంబై-నవభూమి:** భారత మార్కెట్లను కొల్లగొట్టిన అమెరికా సంస్థ జేన్ స్ట్రీట్ విషయం ఇటీవలి కాలంలో సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. పంప్ అండ్ డంప్ స్కామ్ చేసి ఏకంగా రూ. 44 వేల కోట్లకుపైగా అక్రమంగా ఆర్జించినట్లు గుర్తించిన మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ, జేన్ స్ట్రీట్‌పై నిషేధం విధించింది. రూ.4800 కోట్లు జరిమానా చెల్లించాలని ఆదేశించింది. తాజాగా ఈ వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. జేన్ స్ట్రీట్ మళ్లీ మార్కెట్లలోకి అడుగుపెడుతోంది. మళ్లీ ట్రేడింగ్ నిర్వహించేందుకు అమెరికా హెడ్జ్ ఫండ్ జేన్ స్ట్రీట్‌కు సెబీ ఆమోదం తెలిపిందట.జేన్ స్ట్రీట్‌పై విధించిన నిషేధాన్ని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ బోర్డ్ ఆఫ్ ఇండియా ఎత్తివేసినట్లు జాతీయ మీడియాల్లో వార్తలు వస్తున్నాయి. తాము విధించిన రూ.4800 కోట్ల జరిమానాను జేన్ స్ట్రీట్ సంస్థ ఎస్క్రో అకౌంట్లో డిపాజిట్ చేసిన క్రమంలోనే స్టాక్ మార్కెట్‌లోకి మళ్లీ ప్రవేశించేందుకు అనుమతులు ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు చెప్పాయి. ఈ నిషేధం ఎత్తివేత విషయాన్ని జేన్‌స్ట్రీట్‌తో పాటు స్టాక్ ఎక్స్ఛేంజీలకు, డిపాజిటరీలకు, కస్టోడియన్లనకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది.విధించిన జరిమానా మొత్తం రూ. 4800 కోట్లు ఎస్క్రో అకౌంట్లో జమ చేసిన నేపథ్యంలో ఈ నిషేధాన్ని ఎత్తివేయాలని జేన్ స్ట్రీట్ కోరిందని, ఈ నేపథ్యంలోనే సెబీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు చెప్పినట్లు జాతీయ మీడియాలు పేర్కొన్నాయి. అయితే, వేల కోట్ల రూపాయల అక్రమార్జన ఉదంతం వెలుగు చూసిన క్రమంలో జేన్ స్ట్రీట్ రోజు వారీ కార్యకలాపాలపై ఎక్స్ఛేంజీలు నిఘా ఉంచుతాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.అక్రమ పద్ధతుల ద్వారా జేన్ స్ట్రీట్ దాదాపు రూ. 44,358 కోట్లు ఆర్జించినట్లు సెబీ నిర్ధరించింది. ఈ నేపథ్యంలో ఆ సంస్థపై నిషేధం విధిస్తూ జూలై 3వ తేదీన ఆదేశాలు జారీ చేసింది. అక్రమార్జన సమయంలో జేన్ స్ట్రీట్ సంస్థ స్టాక్ ఫ్యూచర్స్‌లో రూ. 7208 కోట్లు, ఇండెక్స్ ఫ్యూచర్స్‌లో రూ. 191 కోట్లు, నగదు విభాగంలో రూ. 288 కోట్లు నష్టపోయింది. ఈ నష్టాలను మినహాయించినట్లయితే నికరంగా రూ. 36,671 కోట్ల మేర అక్రమంగా సంపాదించినట్లు సెబీ గుర్తించింది. అందులో రూ. 4,843 కోట్లు జరిమానా చెల్లించాలని సెబీ ఆదేశించిన సంగతి తెలిసిందే. దేశీయ మార్కెట్ చరిత్రలోనే ఇంత పెద్ద మొత్తంలో జరిమానా విధించడం ఇదే తొలిసారి. అంతే కాదు జరిమానా విధించిన కొద్ది రోజుల్లోనే జేన్ స్ట్రీట్ చెల్లించడం, నిషేధం ఎత్తివేయాలని కోరడం గమనార్హం.

# హైదరాబాద్‌లో ఇళ్లకు ఫుల్ డిమాండ్..


## హైటెక్ సిటీ, గచ్చిబౌలిలో చదరపు అడుగుకు ఇన్ని వేలా?



**న్యూఢిల్లీ-నవభూమి:** మీరు రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడి పెట్టాలని ఆలోచిస్తున్నారా? అయితే ఇది మీకోసమే. ముఖ్యంగా మన హైదరాబాద్ ఇప్పుడు పెట్టుబడిదారులకు హాట్ స్పాట్‌గా మారింది. తాజాగా రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ అనరాక్ ఒక రిపోర్ట్ విడుదల చేసింది. దీని ప్రకారం.. హైదరాబాద్‌లోని ఐటీ హబ్‌లుగా పేరొందిన గచ్చిబౌలి, హైటెక్ సిటీ ప్రాంతాల్లో స్థిరాస్తి ధరలు అసాధారణంగా పెరిగాయి. గత ఐదేళ్లలో (2021 చివరినుంచి.. 2 2025 మధ్య) హైటెక్ సిటీలో 70 శాతం మూలధన ధరలు పెరగ్గా.. ఇదే గచ్చిబౌలిలో చూస్తే ఏకంగా 87 శాతం పెరుగుదల నమోదైంది. ఈ ప్రాంతాల్లో ఐటీ కంపెనీల విస్తరణ, ఉద్యోగ అవకాశాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలు.గచ్చిబౌలిలో ఇళ్ల ధరలు.. 2021 చివర్లో.. చదరపు అడుగుకు సగటున రూ. 6,800 - 7,200 గా ఉండగా.. ఇదే %ు%2 2025 నాటికి సగటున రూ. 12,700 - 13,400 కు చేరింది.ఇదే హైటెక్ సిటీలో చూసినట్లయితే 2021లో సగటున చదరపు అడుగుకు రూ. 6,200 - 6,600 గా ఉండగా.. ఇప్పుడు 2025 క్యూ2 నాటికి చ.అడుగుకు రూ. 10,500- రూ. 11,200 కు చేరింది.ఈ గణాంకాలే.. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ఎంత వేగంగా దూసుకెళ్తుందో స్పష్టం చేస్తున్నాయి.మూలధన ధరల పెరుగుదల అంటే మీరు పెట్టుబడి పెట్టిన ఆస్తి విలువ కాలక్రమేణా ఎంత పెరిగిందనేదానిని తెలియజేస్తుంది. అంటే ఇది ఒక ఆస్తిని కొనుగోలు చేసిన ధర, దాని ప్రస్తుత మార్కెట్ విలువ మధ్య తేడానే. ఇది రియల్ ఎస్టేట్‌ను అమ్మాలనుకునే వారికి లేదా పెట్టుబడి కోసం రియల్ ఎస్టేట్‌ను కొనాలనుకునే వారికి చాలా ముఖ్యమైన కొలమానం.ఇక.. థానే, ముంబైలో గత 3 సంవత్సరాలలో సగటు గృహ ధరలు 46 శాతం పెరిగాయని అనరాక్ తెలిపింది. జూన్ 2025 నాటికి, ఈ ముంబై శివారు ప్రాంతంలో రెసిడెన్షియల్ ధరలు చదరపు అడుగుకు రూ. 19,800కి చేరుకున్నాయి, ఇది 2022 ద్వితీయార్థంలో రూ. 13,550గా ఉంది. థానే పెట్టుబడికి మరింత విలువైనదిగా నిలుస్తోంది. ఇతర ముంబై ప్రాంతాలతో పోలిస్తే ఇది చాలా సరసమైనది. ఇతర ముంబై శివారు ప్రాంతాల కంటే థానే 78% చౌకగా ఉంది.ప్రస్తుతం, థానేలో 2%దీఎఖ% సగటు ధర రూ. 1.25 కోట్లుగా ఉంది. ముంబైలోని సెంట్రల్ సబర్బ్‌లో (కుర్లా, ఘట్‌కోపర్, భాండూప్, ములుండ్, పొవాయి) ఇలాంటి ఇల్లు కొనాలంటే రూ. 2.11 కోట్లు ఖర్చవుతుంది. అదే వెస్ట్రన్ సబర్బ్‌లో (అంధేరి, బోరివలి, దహిసర్, గోరేగావ్, జోగేశ్వరి, జుహు, కాందివలి, ఖార్, మలాడ్, శాంతాక్రజ్, విలే పార్లే) అయితే రూ. 2.36 కోట్లు అవుతుంది.థానేలో 3 సంవత్సరాలు, 5 సంవత్సరాల కాలంలో మూలధన ధరల పెరుగుదల గణనీయంగా ఉంది. ఈ శివారు ప్రాంతంలో మూడేళ్లలో 36% మూలధన ధరల పెరుగుదల ఉంది. ఐదేళ్లలో 58 శాతానికి పెరిగింది.ఇక భారతదేశంలోని టాప్ 7 నగరాల్లో సగటు రెసిడెన్షియల్ ధరలు సంవత్సరానికి 6% నుంచి 27% వరకు పెరిగాయి. ముంబై మెట్రోపాలిటన్ రీజియన్‌లో 9 శాతం పెరుగుదల నమోదైంది. పాన్-ఇండియా స్థాయిలో, వార్షిక వృద్ధి 11 శాతంగా నమోదైంది. ఇది 2 2024లో చదరపు అడుగుకు రూ. 8,070 గా ఉండగా.. 2 2025లో రూ. 8,990 కు చేరింది.

## లక్ అంటే వీరిదే.. 5 ఏళ్లకే లక్షకు రూ.75 లక్షలు..

# ఇప్పుడు 1 షేరుకు 7 షేర్లు ఇస్తోన్న కంపెనీ



**న్యూఢిల్లీ-నవభూమి:** స్మాల్ క్యాప్ కేటగిరిలోని క్యాపిటల్ గూడ్స్ కంపెనీ జీటీవీ ఇంజనీరింగ్ లిమిటెడ్ డబుల్ ట్రీట్ ప్రకటించింది. గత జూన్ నెలలో కంపెనీ బోర్డు డైరెక్టర్ల సమావేశమై బోనస్ షేర్స్ సహా స్టాక్ స్ప్లిట్ చేపట్టేందుకు ఆమోదం తెలుపింది. ఈ ప్రకటన చేసిన నాటి నుంచి షేర్ భారీ ర్యాలీ చేస్తోంది. మరోవైపు ఈ షేరు గత ఐదేళ్లలో ఏకంగా 7555 శాతం లాభాన్ని అందించి మల్టీబ్యాగర్ స్టాక్స్‌లో ఒకటిగా నిలిచింది. ఐదేళ్ల క్రితం రూ. 1 లక్ష పెట్టుబడి పెట్టి ఇప్పటి వరకు కొనసాగిన వారికి ఆ షేర్ల విలువ రూ. 75 లక్షలు అవుతుంది.కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ ప్రకారం కంపెనీ బోర్డు 1:5 రేషియోలో స్టాక్ స్ప్లిట్ చేసేందుకు ఆమోదం తెలిపింది. దీని ప్రకారం రూ. 10 ఫేస్ వ్యాల్యూ ఉన్న 1 ఈక్విటీ షేరును రూ. 2 ఫేస్ వ్యాల్యూ ఉండేలా 5 ఈక్విటీ షేర్లుగా విభజించనున్నారు. అలాగే ఈ స్టాక్ స్ప్లిట్‌కి అర్హులైన షేర్ హోల్డర్లను నిర్ణయించేందుకు అవసరమైన రికార్డు డేట్ జూలై 28, 2025గా నిర్ణయించినట్లు కంపెనీ తాజాగా తెలిపింది.అలాగే బోర్డు డైరెక్టర్స్ సమావేశంలో 2:1 రేషియోలో బోనస్ షేర్లు అందించేందుకు ఆమోదం లభించింది. అంటే రికార్డు తేదీ నాటికి రూ. 2 ఫేస్ వ్యాల్యూ ఉండే 1 ఈక్విటీ షేర్ డీమ్యాట్ అకౌంట్లో కలిగి ఉంటే వారికి అదనంగా రూ. 2 ఫేస్ వ్యాల్యూ ఉండే 2 ఈక్విటీ షేర్లను ఉచితంగా బోనస్ రూపంలో జారీ చేయనున్నారు. ఈ బోనస్ షేర్ల జారీకు అర్హులైన షేర్ హోల్డర్లను నిర్ణయించేందుకు రికార్డు తేదీని సైతం జూలై 28గా నిర్ణయించినట్లు తెలిపింది.ఈరోజు స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ సెషన్‌లో జీటీవీ ఇంజనీరింగ్ షేరు ధర 5 శాతం లాభంతో అప్పర్ సర్క్యూట్లో లాక్ అయింది. రూ. 1309 వద్ద కొనసాగుతోంది. ఈ షేరు 52 వారాల గరిష్ఠ ధర సైతం ఇదే కావడం గమనార్హం. కనిష్ఠ ధర రూ. 395 వద్ద ఉంది. గత వారం రోజుల్లో 11 శాతం లాభాన్ని ఇచ్చింది. గత నెల రోజుల్లో 30 శాతం లాభాన్ని ఇచ్చింది. గత ఆరు నెలల్లో సుమారు 84 శాతం లాభపడగా గత ఏడాదిలో 197 శాతం పెరిగింగి. గత ఐదు సంవత్సరాల కాలంలో 7555 శాతం లాభాన్ని అందించింది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ. 408 కోట్లుగా ఉంది.


## టాప్‌గేర్‌లో ఐపీఓ మార్కెట్



**న్యూఢిల్లీ-నవభూమి:**పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) మార్కెట్ కళకళలాడుతోంది. ఈ ఏడాది జనవరి-జూన్ మధ్య కాలంలో 24 కంపెనీలు ఐపీఓల ద్వారా రూ.45,351 కోట్లు సమీకరించాయి. గత ఏడాది ఇదే కాలంలో 36 కంపెనీలు...న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) మార్కెట్ కళకళలాడుతోంది. ఈ ఏడాది జనవరి-జూన్ మధ్య కాలంలో 24 కంపెనీలు ఐపీఓల ద్వారా రూ.45,351 కోట్లు సమీకరించాయి. గత ఏడాది ఇదే కాలంలో 36 కంపెనీలు సమీకరించిన రూ.31,281 కోట్లతో పోలిస్తే ఇది 45 శాతం ఎక్కువ. గత ఆరు నెలల్లో ఇష్యూల సంఖ్య తగ్గినా సమీకరించిన నిధులు పెరగడం విశేషం. ప్రైమరీ మార్కెట్లో నెలకొన్న ఈ జోరు డిసెంబరు వరకు కొనసాగుతుందని మార్కెట్ వర్గాల అంచనా. దేశీయ మదుపరులకు ఐపీఓలపై పెరుగుతున్న మోజు, లాభాలు ఇందుకు దోహదం చేయనున్నాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, అనిశ్చితులు పెరిగినా భారత ఐపీఓ మార్కెట్ జోరు మీద ఉండడం విశేషం. గత ఏడాది తొలి ఆరు నెలల్లో 52 కంపెనీలు తమ ఐపీఓల కోసం సెబీకి దరఖాస్తు చేస్తే గత ఆరు నెలల్లో ఈ సంఖ్య ఏకంగా 118కు పెరిగింది.ఎన్‌ఐఆర్‌ఎల్ రూ.4,000 కోట్ల ఐపీఓ: ఎన్‌ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ (ఎన్‌ఎల్‌సీఐఎల్) అనుబంధ సంస్థ ఎన్‌ఐఆర్‌ఎల్ రూ.4,000 కోట్ల ఐపీఓకు సిద్ధమవుతోంది. ఎన్‌ఎల్‌సీఐఎల్ సీఎండీ మోటుపల్లి ప్రసన్న కుమార్ ఈ విషయం ప్రకటించారు. వచ్చే ఏడాది సెప్టెంబరులోగా ఈ ఐపీఓ పూర్తి చేయాలని భావిస్తున్నట్టు చెప్పారు. ఎన్‌ఐఆర్‌ఎల్ పునరుతాదక ఇంధన వనరుల ప్రాజెక్టుల కోసం ఈ నిధులను వినియోగించనున్నట్టు చెప్పారు.

24 నుంచి బ్రిగేడ్ హోటల్స్ ఇష్యూ: ఐపీఓ ద్వారా రూ.750 కోట్లు సమీకరించేందుకు బ్రిగేడ్ హోటల్ వెంచర్స్ ఈ నెల 24న క్యాపిటల్ మార్కెట్‌కు వస్తోంది. ఈ ఐపీఓ ద్వారా సమీకరించే రూ.750 కోట్లలో రూ.468.14 కోట్లు రుణ చెల్లింపులకు, రూ.197.52 కోట్లు ప్రమోటర్‌కే చెందిన కొంత స్థలం కొనుగోలుకు వినియోగిస్తారు. మిగతా నిధులను కంపెనీ వ్యాపార విస్తరణ కోసం వినియోగిస్తామని కంపెనీ తెలిపింది.నేటి నుంచే సావీ ఇన్‌ఫ్రా ఐపీఓ: గుజరాత్ కేంద్రంగా పనిచేసే ఈపీసీ కంపెనీ సావీ ఇన్‌ఫ్రా అండ్ లాజిస్టిక్స్ ఐపీఓ సోమవారం నుంచి ప్రారంభమవుతోంది. రూ.70 కోట్ల సమీకరణ కోసం మార్కెట్‌కు వస్తున్న ఈ ఎస్‌ఎంఈ కంపెనీ ఐపీఓ ఈ నెల 23న ముగుస్తుంది. ఈ ఇష్యూ ప్రైస్ బ్యాండ్‌ను రూ.114/120గా నిర్ణయించారు.

## కాయిన్‌డీసీఎక్స్‌పై సైబర్ దాడి




**న్యూఢిల్లీ-నవభూమి:** సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. క్రిప్టోకరెన్సీల ట్రేడింగ్ ఎక్స్ఛేంజీలను వదలడం లేదు. భారత్‌లో క్రిప్టోకరెన్సీల్లో ట్రేడింగ్ చేసే వారికి సేవలందించే కాయిన్‌డీసీఎక్స్‌పైనా హ్యాకర్లు దాడి చేసి 4.42 కోట్ల డాలర్ల (సుమారు రూ.378 కోట్లు) కొట్టేశారు. అయితే ఇది తమ అంతర్గత ఖాతా సొమ్ము అని, ఖాతాదారుల నిధులకు ఎలాంటి ఢోకా లేదని కాయిన్‌డీసీఎక్స్ ప్రకటించింది. సైబర్ నేరగాళ్లు కొట్టేసిన మొత్తాన్ని తమ ట్రెజరీ రిజర్వుల నుంచి భర్తీ చేసుకుంటామని పేర్కొంది.

## స్టాక్ మార్కెట్‌లో పంప్ అండ్ డంప్ స్కామ్..భారీగా నష్టపోయిన ఇన్వెస్టర్లు

**న్యూఢిల్లీ-నవభూమి:**స్టాక్ మార్కెట్‌లో ఇటీవల కాలంలో పెట్టుబడులు చేసే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇదే సమయంలో స్టాక్ మార్కెట్ మోసాలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా జరిగిన ఓ స్కామ్ గురించి ఇక్కడ చూద్దాం. ఇటీవల అమెరికాకు చెందిన ప్రముఖ గ్లోబల్ ఆల్గో ట్రేడింగ్ కంపెనీ జేన్ స్ట్రీట్ కేసు వార్తల్లో నిలిచింది.

ఈ సంస్థ ఫ్యూచర్స్, ఆప్షన్స్ ముసుగులో వేల కోట్ల రూపాయలను పెట్టుబడిదారుల నుంచి మోసం చేసిందనే ఆరోపణలు వచ్చాయి. స్టాక్ మార్కెట్‌లో పంప్ అండ్ డంప్ అనే మోసపూరిత స్కాం ద్వారా పెద్ద ఇన్వెస్టర్లు, చిన్న ఇన్వెస్టర్ల కష్టార్జిత డబ్బును కూడా దోచుకుంది.పంప్ అండ్ డంప్ అనేది స్టాక్ మార్కెట్‌లో చాలా కాలంగా కొనసాగుతున్న ఆర్థిక మోసం. ఈ స్కామ్లో భాగంగా స్కామర్లు మొదట తక్కువ ధర కలిగిన స్టాక్‌లను (పెన్నీ స్టాక్స్) లేదా చిన్న కంపెనీల షేర్లను ఎంచుకుంటారు. ఈ షేర్లను భారీ మొత్తంలో కొనుగోలు చేసి, వాటి ధరను కృత్రిమంగా పెంచుతారు.

## పిల్లల భవిష్యత్తు కోసం బెస్ట్ ప్లాన్ ఇదే..

# ఇలా నెలకు రూ. 15 వేలు పక్కనబెడితే చేతికి రూ. 1.5 కోట్లు!



**న్యూఢిల్లీ-నవభూమి:**మనం ఎంత సంపాదిం చామన్నది ముఖ్యం కాదు. డబ్బును ఎలా నిర్వహించగలుగుతున్నామనేదే ముఖ్యం. అవును.. డబ్బును పొదుపు చేయడం ముఖ్యం. ఇంకా దానిని మదుపు చేయడం ముఖ్యం. ఎక్కడ ఖర్చులు తగ్గించుకుంటున్నాం.. ఎక్కడ సంపద సృష్టిస్తున్నాం అనేది తెలుసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇందుకోసం చిన్న వయసు నుంచే మదుపు చేయాలని చెబుతున్నారు. చిన్న వయసు నుంచి పెట్టుబడులు పెడితేనే మలివయసులో ఇబ్బందుల్లేకుండా ఉండొచ్చని.. పిల్లలకు మంచి భవిష్యత్తు అందించొచ్చని అంటున్నారు.గెయి నింగ్ గ్రౌండ్ ఇన్వెస్ట్‌మెంట్ సర్వీసెస్ కో ఫౌండర్ రవి కుమార్ టీవీ అభిప్రాయం ప్రకారం, ఈక్విటీ ఫండ్స్‌లో క్రమపద్ధతిలో పెట్టుబడి పెట్టాలనే మీ నిర్ణయం చాలా మంచి ప్రారంభమే. అయితే, కేవలం నెలకు రూ. 15,000 సిప్‌తో 12 నుంచి 14 ఏళ్లలో రూ. 1.50 కోట్ల లక్ష్యాన్ని చేరుకోవడం కష్టం కావొచ్చు. ఇక్కడ రాబడి ఏటా సగటున 13 శాతం మించితేనే ఇది సాధ్యమని అంటున్నారు.పిల్లల ఉన్నత విద్య లక్ష్యాన్ని చేరుకోవడానికి నిపుణులు కొన్ని ముఖ్యమైన సూచనలు చేస్తున్నారు.నెలవారీ పెట్టుబడి పెంచండి: మీ లక్ష్యాన్ని చేరుకోవాలంటే, ముందుగా మీ నెలవారీ సిప్ మొత్తాన్ని పెంచడాన్ని పరిశీలించండి. రూ. 15 వేలు సరిపోకపోవచ్చు.మీరు ప్రస్తుతం రెండు లార్జ్ క్యాప్, ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లో పెట్టుబడి పెడుతున్నారు. అధిక వృద్ధి సామర్థ్యం కోసం, మీ లార్జ్-క్యాప్ ఫండ్స్‌లో ఒకదాన్ని మల్టీ-క్యాప్ ఫండ్‌తో మార్చొచ్చు.అలాగే.. మీ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లో ఒకదాన్ని మిడ్ క్యాప్ లేదా స్మాల్ క్యాప్ ఫండ్‌తో భర్తీ చేయొచ్చు. ఎందుకంటే, రానున్న పదేళ్లలో మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ ఫండ్స్‌లో అధిక వృద్ధికి అవకాశం ఉంటుంది. ఇక్కడ మీరు మీ పోర్ట్‌ఫోలియోలో 20 శాతం పెట్టుబడి పెట్టొచ్చు.మ్యూచువల్ ఫండ్ ఎంచుకునేటప్పుడు మీ రిస్క్ తీసుకునే సామర్థ్యం, పెట్టుబడి పెట్టే కాలం, మీ ఆర్థిక లక్ష్యాలను బట్టి ఎంచుకోవాలి. పిల్లల విద్య దీర్ఘకాలిక లక్ష్యం కాబట్టి, కొంత రిస్క్ తీసుకోవడం ద్వారా మంచి రాబడులు ఆశించొచ్చు.షార్ట్ టర్మ్ మార్కెట్ హెచ్చుతగ్గులకు కంగారు పడకుండా, మీ ఆర్థిక లక్ష్యం వైపు మీ పోర్ట్‌ఫోలియో ఎలా పురోగమిస్తుందో ప్రతి సంవత్సరం సమీక్షించాలి. అవసరమైతే చిన్నచిన్న మార్పులు చేసుకోవచ్చు.

పెట్టుబడి అనేది ఒక దీర్ఘకాలిక ప్రక్రియ. దీనిలో ఓపికగా ఉండటం, సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవడం చాలా అవసరం. మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి.మీ పిల్లల భవిష్యత్తు కోసం సరైన పెట్టుబడులు పెట్టడం తల్లిదండ్రులుగా మీ బాధ్యత. సరైన మార్గంలో పెట్టుబడి పెట్టడం ద్వారా మంచి రాబడి పొంది, వారికి మంచి విద్యను అందించొచ్చు. అయితే, పెట్టుబడి పెట్టే ముందు అన్ని విషయాలను తెలుసుకోవడం, అవసరమైతే ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.

